
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 201
బుధవారం 11-10-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురికాకక్షల జోలికి వెళ్లరు'


నంబర్‌వన్ జోడీగా సాత్విక్-చిరాగ్
ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానం -14లో


అంబానీ టాప్
హురున్ ఇండియా కుబేరుల్లో 8 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం -15లో


కులగణన దేశానికి ఎక్స్‌రే
కులగణన దేశానికి ఎక్స్‌రే తీయడం లాంటిదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు.
వివరాలు 8లో ▸


ఆప్ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు
మద్యం స్కాం కేసులో మనీలాండరింగ్ కేసులున్న ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌పై ఈడీ దాడులు జరిపింది.
వివరాలు 6లో ▸


భారత్‌కు దౌత్య పరీక్షే
హమాస్‌తో ఇజ్రాయెల్ పోరు అంతర్జాతీయ సమాజాన్ని రెండుగా విడదీస్తోంది. ఇది భారత్‌కు దౌత్యపరంగా అగ్నిపరీక్షే కానుంది.
వివరాలు 6లో ▸


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఊరట
2018 ఎన్నికల అఫిడవిట్‌లో శ్రీనివాస్‌గౌడ్ తప్పుడు సమాచారం ఇచ్చారంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.
వివరాలు 3లో ▸



కమలం సర్కార్‌ను తెద్దాం

మూడోసారి.. మూడో తేదీ... ముక్కోణం!

సాయుధ తెలంగాణకు ఓటు ఆయుధమై..

ఆ 4 రోజులే!

మధ్యప్రదేశ్‌లో ఉచిత జపమే!

బీజేపీ ఐఏఎస్

- వివరాలు 7,8 పేజీల్లో

ఆదిలాబాద్ జనగర్జన సభలో అమిత్ షా

- పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిందేమీ లేదు
- రాష్ట్రం నంబర్ వన్‌గా ఉందంటూ అబద్ధపు ప్రచారం చేస్తున్నారు
- ఒవైసీ చేతిలో 'కారు'స్టీరింగ్
- ఇవాళ్టి రజాకారుల నుంచి బీజేపీతోనే రక్షణ లభిస్తుంది
- డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుంది..
- రాహుల్ బాబా ఏదేదో చేస్తామని చెబుతూ తిరుగుతున్నారు..
- యూపీఏ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి


మంగళవారం ఆదిలాబాద్ బహిరంగ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



ఆత్మహత్యలు, అకృత్యాల్లోనే నంబర్ వన్
ఈ పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పేదలు, రైతులు, దళితులు, ఆదివాసీలు, బడుగు, బలహీన వర్గాల కోసం చేసిందేమీ లేదని అమిత్ షా ధ్వజమెత్తారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రి చేయడం ఎలా? అనే ఒక చింత తప్పితే కేసీఆర్‌కు మరొకటి లేదన్నారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం అన్నింటిలో నంబర్ వన్‌గా ఉందనే ఒక అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రయోజనం పొందాలని చూస్తున్నారని, అయితే రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అకృత్యాలు, అవినీతిలో మాత్రమే ఈ ప్రభుత్వం నంబర్ వన్‌గా ఉందని ఆరోపించారు.

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్ఎస్ ఎన్నికల గుర్తైన కారు స్టీరింగ్ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో ఉందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో నడిచే కేసీఆర్ సర్కార్‌ను పీకి పారేద్దామని, డిసెంబర్ 3న తెలంగాణ రాష్ట్రంలో కమలం సర్కార్‌ను తీసుకొద్దామని పిలుపునిచ్చారు. ఇవాళ్టి రజాకారుల నుంచి బీజేపీతోనే రక్షణ లభిస్తుందని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెప్టెంబర్ 17 విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జనగర్జన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

కేటీఆర్‌ను సీఎం ఎలా చేయాలన్నదే కేసీఆర్ ఆలోచన
ప్రధాని మోదీ నేతృత్వంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని అమిత్ షా చెప్పారు. ఇటీవల మోదీ రాష్ట్రంలో పర్యటించినప్పుడు రూ.950 కోట్లతో సమ్మక్క-సారక్క యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారని, వాస్తవానికి దీన్ని 2014 నుంచే ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ కేసీఆర్ సర్కార్ స్థలం ఇవ్వకపోవడంతో ఆలస్యమైందని విమర్శించారు. గిరిజనుల ఉన్నత చదువులకు, అలాగే వారి సంస్కృతి, ఆచారాలను కాపాడేందుకు వర్సిటీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పసుపు సాగు అధికంగా ఉన్న దృష్ట్యా ఇక్కడ మిగతా 2వ పేజీలో ▶

ఆ డబ్బంతా ఏం చేశారు?
రూ.7.5 లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో, ఆ డబ్బు ఎక్కడ పెట్టారో చెప్పాలి
కేసీఆర్‌ను డిమాండ్ చేసిన అమిత్ షా

ఎలాగైనా గెలవాల్సిందే
- వివరాలు 2లో

శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

- ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటికే 1,800 మంది బలి
- ఇజ్రాయెల్‌లో 1,000 మంది, గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మృతి
- నాలుగో రోజుకు చేరిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు
- మా లక్ష్యం హమాస్ మాత్రమే: ప్రధాని నెతన్యాహు
- గాజాపై దాడులు ఆపకపోతే బందీలను చంపేస్తాం
- ఇజ్రాయెల్‌కు హమాస్ హెచ్చరిక

6 లో



కాంగ్రెస్‌తో రాజకీయ అవగాహన కుదిరింది


రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరిందని, ఇంకా సీట్ల అవగాహన కుదరలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. ఊహాగానాలు నమ్మొద్దని అన్నారు.
- వివరాలు 2లో ▶

17 రోజులు.. 41 సభలు



ఎన్నికల ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టనున్న సీఎం కేసీఆర్

- ఈ నెల 15 నుంచి నవంబర్ 9 వరకు సభల షెడ్యూల్ విడుదల.. దసరా నేపథ్యంలో 19 నుంచి 25 వరకు విరామం
- వచ్చే నెల 9న గజ్వేల్, కామారెడ్డిలో నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 15న పార్టీ అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేయడంతోపాటు మేనిఫెస్టోను ప్రకటించిన వెంటనే ఎన్నికల ప్రచార బరిలోకి దిగనున్నారు. ఈ నెల 15 నుంచి నవంబర్ 9 వరకు 17 రోజుల వ్యవధిలో 41 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నిర్వహించే ఎన్నికల ప్రచార సభల్లో కేసీఆర్ ప్రసంగించనున్నారు. ఈ నెల 15 నుంచి 18 వరకు వరుసగా సభల్లో పాల్గొని సద్దుల బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో 19 నుంచి 25 వరకు మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం



- దక్షిణ భారతదేశంలో తొలి హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టిస్తారు
- జనగామ బీఆర్ఎస్ నేతలతో భేటీలో మంత్రి కేటీఆర్
- రాష్ట్రంలో పాగా వేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని వ్యాఖ్య
- ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నడుమ కుదిరిన రాజీ

- వివరాలు 2లో

తెలంగాణలో కరువు, కర్ఫ్యూ లేదు

బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ కావడం ఖాయం



- కాంగ్రెస్‌వి ఫేక్ సర్వేలు..
- ఢిల్లీలో కాంగ్రెస్ ముఠా టికెట్ల పంచాయితీ: హరీశ్‌రావు

-వివరాలు 2లో

గ్రూప్-2 మళ్లీ వాయిదా

- జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామన్న టీఎస్‌పీఎస్సీ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నిర్ణయం

-వివరాలు 3లో

14న భేటీ తర్వాత అభ్యర్థుల జాబితా

అంతకంటే ముందు భేటీ కానున్న కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

దసరా తరువాత మలి జాబితా


సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈ నెల 14న ఢిల్లీలో భేటీ కానుంది. అంతకంటే ముందురోజు తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ సమావేశం మరోమారు జరగనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 14న సీఈసీ భేటీ తర్వాత ఏ క్షణమైనా తెలంగాణ అభ్యర్థుల తొలి జాబితా వస్తుందని, దసరా తర్వాత మలి జాబితా రానుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియ పూర్తిచేసి, స్క్రీనింగ్ కమిటీ సమర్పించిన నివేదికల ఆధారంగా సీఈసీ ఫైనల్ చేయనుంది. ఏఐసీసీ కార్యాలయంలో జరిగే ఈ భేటీపై ఇప్పటికే కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 9న భేటీ అయిన స్క్రీనింగ్ కమిటీ 70కిపైగా స్థానాల్లో ఒక్కో అభ్యర్థిని, మిగతా మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి


అబ్బే అదేం కాదు! అభ్యర్థుల ఎంపిక కసరత్తు చేసి వస్తున్నారు.

అవినీతిని కాపాడటానికా సెక్షన్ 17ఏ?

తప్పు చేసిన వాళ్లంతా ఈ చట్టాన్ని చూపించి అనుమతులు తెమ్మంటే ఎలా?
ఇలాగైతే దర్యాప్తు చేయడానికి ఏ అధికారి అయినా ముందుకొస్తారా?



- నిజాయితీపరులకు మద్దతివ్వటానికే ఈ చట్టాలు... వాటికి సవరణలు
- అంతేతప్ప అవినీతిని, అవినీతిపరుల్ని కాపాడటానికి కాదు?
- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది రోహత్గీ వాదన
- చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంలో కొనసాగిన విచారణ
- చంద్రబాబు తరఫున వాదనలు వినిపించిన హరీశ్ సాల్వే, లూథ్రా
- గవర్నర్ అనుమతి తీసుకోకుండా బాబును అరెస్టు చేశారన్న సాల్వే
- అక్రమంగా అరెస్టు చేశారు కనుక కేసు మొత్తాన్ని కొట్టేయాలంటూ వాదనలు
- సెక్షన్ 17ఏ ప్రకారం అనుమతి ఉండాలని, లేదు కనుక కేసు చెల్లదని వ్యాఖ్యలు
- స్కిల్ కుంభకోణంతో ఖజానాకు తీవ్రమైన నష్టం జరిగిందన్న ముకుల్ రోహత్గీ
- సాంకేతిక అంశాలు చూపుతూ కేసును కొట్టేయమనటం సరికాదని వాదన
- తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు
- మంగళవారమే తేల్చాలని బాబు లాయర్లు కోరినా.. ధర్మాసనం నో

12 లో

తత్తరపాటు.. బిత్తర చూపులు!



- సీఐడీ విచారణలో లోకేశ్ తడబాటు.. అసహనం
- అబ్బే నాకేం తెలీదు.. మరి ఈ సంతకాలు మీవే కదా?
- ఇన్నర్ రింగ్ రోడ్డు అక్రమాలపై అధికారుల ప్రశ్నలు.. హెరిటేజ్ భూముల కొనుగోలు దందాపై ఆధారాలు చూపిస్తూ ప్రశ్నల వర్షం

- వివరాలు 12లో ▶

క్లుప్తంగా...

ఈటలను రాజకీయాల్లోకి తెచ్చిందే బీఆర్ఎస్

మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీపై ఈటల రాజేందర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని, ఆయన్ని రాజకీయాల్లోకి తెచ్చిందే బీఆర్ఎస్ పార్టీ అనే విషయం మరిచిపోవద్దని మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ హితవు పలికారు. ముదిరాజ్‌ల పేరుతో బహిరంగ సభ పెట్టి సీఎం కేసీఆర్‌పై ఈటల మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎల్.రమణ, మత్స్య ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పరేడ్ గ్రౌండ్స్‌లో మా బొమ్మలు వేసుకుని మీటింగ్ పెట్టడం సిగ్గుచేటన్నారు. బీసీ వర్గాలకు న్యాయం చేయడానికే కేసీఆర్ పనిచేస్తున్నారని, ఈటల కాడి వదిలిస్తే కేసీఆర్ తనకు అవకాశం కల్పించారని వెల్లడించారు. పిట్టల మాట్లాడుతూ.. 20 ఏళ్లలో ముదిరాజ్‌లు ఎదగకుండా ఈటల కుట్ర చేశారన్నారు.

ఈనెల 16 వరకు ఎదురుచూస్తా

లేకుంటే బీఆర్ఎస్‌కు రాజీనామా: నీలం మధుముదిరాజ్



పటాన్‌చెరు టౌన్ (హైదరాబాద్): బీఆర్ఎస్ పార్టీ నుంచి సానుకూల నిర్ణయం కోసం ఈనెల 16 వరకు ఎదురుచూస్తానని, అప్పటికీ తేల్చకుంటే ఆ పార్టీకి రాజీనామా చేస్తానని ఎన్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధుముదిరాజ్ ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని, అధిష్టానం పటాన్‌చెరు నుంచి టికెట్ ఇస్తుందని ఆశించానని తెలిపారు. ఏ పార్టీ టికెట్ ఇస్తే, ఆ పార్టీ నుంచి కండువా కప్పుకుని పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ప్రజా సమస్యల ఎజెండాగా నియోజకవర్గంలోని గుమ్మడిదల మండలం కొత్తపల్లి ఒకటో నంబర్ బూత్ నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని తెలిపారు.

కాంగ్రెస్‌తో రాజకీయ అవగాహన కుదిరింది

సీపీఐ, సీపీఎం తరఫున చెరో ఐదు సీట్లు అడిగాం: నారాయణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతో రాజకీయ అవగాహన కుదిరిందని, ఇంకా సీట్ల అవగాహన కుదరలేదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. ఊహాగానాలు నమ్మొద్దని, చర్చలు ఆశాజనకంగా ఉన్నాయని, అవి పరిష్కారం అవుతాయని విశ్వసిస్తున్నామన్నారు. హైదరాబాద్ మఖ్దూంభవన్‌లో మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐ, సీపీఎంలు చెరో ఐదు సీట్లు కావాలని కోరుతూ కాంగ్రెస్‌కు జాబితా అందజేశాయని, దీనిపై జాతీయ నాయకత్వాలు మాట్లాడుతున్నాయని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కూడా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, అజీజ్ పాషా, తాను కలిసి మాట్లాడామన్నారు. ఇక్కడ కూడా సీపీఐ, సీపీఎంలతో కాంగ్రెస్ విడివిడిగా చర్చలు జరుపుతోందని నారాయణ వెల్లడించారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు ప్రతిపా దించిన స్థానాల్లో పరస్పరం వివాదం లేవని, ఇద్దరిని కలిపి చర్చలు జరిపితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయిలో ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసే ఉన్నాయని, రాష్ట్రాల్లో కొన్నిచోట్ల కలిసి, కొన్ని చోట్ల విభేదించుకుంటున్నాయని తెలిపారు.

ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని అరికట్టాలి

ఎన్నికల కమిషన్‌ను కోరిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



మిర్యాలగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీపై ఎన్నికల కమిషన్ పకడ్బందీ చర్యలు తీసుకొని, వాటి ప్రభావాన్ని అరికట్టాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ జె.రాజు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బు పంపిణీని అరికట్టడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆచరణకు అమలుకాని హామీలతో ప్రకటించే మోసపూరిత మేనిఫెస్టోలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలంటూ ఏకగ్రీవ తీర్మానం చేసిన గ్రామాలకు అత్యధిక నిధులు కేటాయించాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడం అధికార దుర్వినియోగమేనన్నారు. మంత్రి వ్యాఖ్యలపై సీఈసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆ డబ్బంతా ఏం చేశారు?

- రూ.7.5 లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో, ఆ డబ్బు ఎక్కడ పెట్టారో చెప్పాలి
- సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో రూ. 9 లక్షల కోట్లు కేటాయించింది
- ప్రజలకు మార్గదర్శనంలో మేధావులు కీలకపాత్ర పోషించాలని పిలుపు




మంగళవారం జరిగిన మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న అమిత్‌షా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.400 కోట్ల మిగులుతో ఉన్న రాష్ట్రం కాస్తా ఇప్పుడు రూ.7.5 లక్షల కోట్ల మేర అప్పుల్లో కూరుకుపోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో తెలంగాణకు మెట్రో రైలు, హైవేలు, రోడ్లు, ఇరిగేషన్, యూనివర్సిటీలు తదితరాల కోసం రూ.9 లక్షల కోట్లు కేటాయిస్తే.. ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో ఏం చేశారో, ఆ డబ్బు ఎక్కడ పెట్టారో చెప్పాలని సీఎం కేసీఆర్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. ప్రతి పేదవారికీ బియ్యం, మరుగుదొడ్లు, గ్యాస్ సిలిండర్లు, వందేభారత్ రైళ్లు, ఇలా అన్నింటినీ కేంద్రమే ఇచ్చిందని చెప్పారు. బీఆర్ఎస్ 2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోల్లోని అంశాలను హైదరాబాద్‌లో బహిరంగ వేదికలపై వెల్లడించే ధైర్యం ఉందా? అని నిలదీశారు. 'తెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలను విస్మరించిన మీకు, పాఠశాల విద్య, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న కొలువులు భర్తీ చేయలేని.. రోజువారీ సమస్యలను పరిష్కరించలేని మీకు, తెలంగాణ ప్రజలను ఓట్లడిగే హక్కు, అధికారం లేదు..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం సిఖ్ విలేజ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో వివిధ రంగాల వృత్తి నిపుణులు, మేధావులు, సైన్యంలో దేశానికి సేవ చేసినవారు, ఇతర వర్గాలతో నిర్వహించిన సమావేశంలో అమిత్‌షా ప్రసంగించారు.

తెలంగాణ అభివృద్ధే బీజేపీ ధ్యేయం: కిషన్‌రెడ్డి

తెలంగాణ అభివృద్ధి, వికాసమే బీజేపీ ప్రధాన ధ్యేయమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం అభివృద్ధి నిరోధక సర్కార్ ఉందని, ఫాంహౌస్, కుటుంబ రాజకీయాలతో తెలంగాణను ఏలుతోందని ఆరోపించారు. బీజేపీని ఆశీర్వదిస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ...మేధావులు మౌనం వీడాలని, బీఆర్ఎస్ నియంతృత్వ, అవినీతి పాలనను అంతమొందించేలా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పార్టీ నేతలు ప్రకాశ్ జవదేకర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, ఏవీఎన్‌రెడ్డి, నల్లు ఇంద్రసేనారెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డి, మాజీ డీజీపీలు కృష్ణప్రసాద్, జయచంద్ర, అరవిందరావు, మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు, ఓయూ వీసీ తిరుపతిరావు, విశ్రాంత ఐఏఎస్‌లు రామచంద్రుడు, చంద్రవదన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపిస్తే ఉత్తమ రాష్ట్రంగా మారుస్తాం

'కేసీఆర్ పార్టీకి ఒక సిద్ధాంతం, విధానం అంటూ ఏమీ లేదు. తన కుమార్తె కవితను జైల్లో వేయొద్దని, కొడుకు కేటీఆర్‌ను సీఎం చేయాలని కోరుకోవడం, కుటుంబ ప్రయోజనాల కోసం అవినీతికి పాల్పడడం తప్ప ఇంకేమీ లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలలో దేనికి ఓటేసినా వాటిల్లో మరో పార్టీకి వేసినట్టే. అందువల్ల తెలంగాణలో బీజేపీకి ఓట్లేసి గెలిపిస్తే అన్నిరంగాల్లో దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా మారుస్తాం. గతంలో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్, ఇప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటి అనుభవాలు, కుటుంబ, నియంతృత్వ పాలన, అవినీతి, అక్రమాలు, కుంభకోణాలకు పాల్పడిన తీరు దృష్టిలో పెట్టుకుని బీజేపీని ఎంచుకోవాల్సిందిగా కోరుతున్నాం. వృత్తి నిపుణులు, మేధావులు వేసేది కేవలం ఒకే ఓటు కాదు. వారంతా తమ తమ రంగాలు, పరిధుల్లో అనేకమంది ప్రజలకు సరైన మార్గదర్శనం చేయగలరు. కాబట్టి గత తొమ్మిదేళ్లలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీని గెలిపించే దిశలో మీ వంతు కృషి చేయాలి..' అని అమిత్ షా విజ్ఞప్తి చేశారు. 'మొత్తం కుటుంబ, వారసత్వ పార్టీల అవినీతితో కూడిన ఇండియా కూటమి ఏవో కలలు కంటోంది. అయినా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా మూడింట రెండు వంతుల మెజారిటీతో ముచ్చటగా మూడోసారి కూడా మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది..' అని ధీమా వ్యక్తం చేశారు.

ఎలాగైనా గెలవాల్సిందే

- బీజేపీ రాష్ట్ర నేతలతో అమిత్ షా
- అన్నీ అనుకూల పరిస్థితులున్నాయి
- బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో తయారీపై సమగ్ర సమీక్ష
- ప్రకాశ్ జవదేకర్, కిషన్‌రెడ్డికి అమిత్ షా దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు అన్ని అనుకూల పరిస్థితులున్నందున వీటిని ఉపయోగించుకుని విజయం సాధించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. విజయం దిశగా కట్టుదిట్ట మైన కార్యాచరణను, ఎన్నికల వ్యూహాలను అమలు చేయాలని రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలను ఆయన ఆదేశించారు. ప్రజల్లో కేసీఆర్ సర్కార్‌పై వ్యతిరేకత వ్యక్తమవుతున్నందున దానిని బీజేపీకి అనుకూలంగా ఓట్లుగా మార్చేకునే దిశగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర పార్టీకి, నేతలకు అవసరమైన సహాయ, సహకారాలు, తోడ్పాటును అందించేందుకు జాతీయ నాయకత్వం సిద్ధం ఉందని హామీ నిచ్చారు. మంగళవారం రాత్రి బేగంపేటకు సమీపంలోని ఓ స్టార్ హోటల్‌లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్‌తో అమిత్ షా భేటీ అయ్యారు. ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు, ఎన్నికల మేనిఫెస్టో తయారీ, అభ్యర్థులకు సంబంధించి రెండు, మూడు జాబితాల తయారీపై కసరత్తు, ఎన్నికల్లో అనుసరించబోయే వ్యూహాలు, ప్రచార సరళి తదితర అంశాలన్నింటిపైనా సమీక్ష నిర్వహించినట్టు సమాచారం.

గ్రేటర్‌పై ఫోకస్ పెంచండి

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలిచి అనూహ్య ఫలితాలు సాధించినందున, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి, చుట్టుపక్కల జిల్లాలపై ఫోకస్ పెట్టి అత్యధిక స్థానాలు గెలిచేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని అమిత్ షా ఆదేశించినట్టు తెలుస్తోంది. అదేవిధంగా పార్టీకి బలమున్న ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్‌లతో పాటు మహబూబ్‌నగర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించినట్టు తెలిసింది. ఇక పార్టీపరంగా అంతగా బలం లేని ఉమ్మడి ఖమ్మం, వరంగల్‌తో పాటు నల్లగొండ జిల్లా పరిధిలోని కొన్ని నియోజకవర్గాల్లో కార్యకలాపాలు, ఎన్నికల ప్రచారవేగం ముమ్మరం చేయాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ భేటీ అనంతరం అమిత్ షాను నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, రాష్ట్ర పార్టీ ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక బేగంపేట విమానాశ్రయంలో అమిత్‌షాను బీజేపీ జాతీయకార్యవర్గసభ్యుడు కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి కలుసుకున్నారు.

తొలి జాబితాలోని 38 మంది అభ్యర్థుల బలాబలాలపై ఆరా

ఇక ఎన్నికల్లో పోటీకి సంబంధించి ఖరారు చేయబోతున్న 38 మంది అభ్యర్థుల తొలి జాబితాపై చర్చించారు. వీరి విజయావకాశాలు, బలాబలాలు తదితర అంశాలపై ఆరా తీసినట్టు తెలిసింది. ప్రస్తుతం పార్టీలో వివిధ స్థానాల్లో (తొలిజాబితా మినహాయించి) పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న వారు, పార్టీ పరంగా బలమైన అభ్యర్థులుగా పరిగణిస్తున్న వారు ఎవరెవరు ఉన్నారన్న అంశాలపైనా ఆరా తీసినట్టు సమాచారం. బీజేపీలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్న వాళ్లెవరు, ఏ స్థానంలోనైనా సీటు కావాలని కోరుకుంటున్న వారెవరు, చేరేందుకు ఏదైనా కమిట్ మెంట్, హామీ కోరుకుంటున్నారా అన్న విషయాలపై రాష్ట్ర పార్టీ నేతలను అమిత్‌షా ప్రశ్నించినట్టు తెలిసింది.

17 రోజులు.. 41 సభలు

▶ మొదటి పేజీ తరువాయి

విరామం తీసుకోనున్నారు. తిరిగి ఈ నెల 26 నుంచి వచ్చే నెల 9 వరకు వరుస సభల్లో కేసీఆర్ పాల్గొననున్నారు. నవంబర్ 4న కూడా ప్రచారానికి కేసీఆర్ విరామం ప్రకటించారు. నవంబర్ 9న గజ్వేల్, కామారెడ్డిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ నామినేషన్లు దాఖలు చేసి కామారెడ్డి నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచార సభల తాత్కాలిక షెడ్యూల్‌ను విడుదల చేశారు.

కేసీఆర్ ప్రచార షెడ్యూల్ ఇలా...

తేదీ	సభలు జరిగే నియోజకవర్గాలు
అక్టోబర్ 15	హుస్నాబాద్
16	జనగామ, భువనగిరి
17	సిరిసిల్ల, సిద్దిపేట
18	జడ్చర్ల, మేడ్చల్
19-25 వరకు	విరామం
26	అచ్చంపేట, నాగర్‌కర్నూల్, మునుగోడు
27	పాలేరు, స్టేషన్ ఘన్‌పూర్
29	కోదాడ, తుంగతుర్తి, ఆలేరు
30	జుక్కల్, బాన్సువాడ, నారాయణఖేడ్
31	హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ
నవంబర్ 01	సత్తుపల్లి, ఇల్లందు
02	నిర్మల్, బాల్కొండ, ధర్మపురి
03	భైంసా (ముధోల్), ఆర్మూరు, కోరుట్ల
04	విరామం
05	కొత్తగూడెం, ఖమ్మం
06	గద్వాల, మక్తల్, నారాయణపేట
07	చెన్నూరు, మంథని, పెద్దపల్లి
08	సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి
09	గజ్వేల్, కామారెడ్డిలో నామినేషన్, కామారెడ్డిలో బహిరంగ సభ

తెలంగాణలో కరువు, కర్ఫ్యూ లేదు

- బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్ బ్లాంక్ కావడం ఖాయం
- కాంగ్రెస్‌వి ఫేక్ సర్వేలు, గ్లోబల్ ప్రచారాలు
- ఢిల్లీలో కాంగ్రెస్ ముఠా టికెట్ల పంచాయితీ: హరీశ్‌రావు

హుస్నాబాద్ (సిద్దిపేట జిల్లా): బీఆర్ఎస్ పాలనలో కరువు, కర్ఫ్యూ అనే మాటే ఎప్పుడూ రాలేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఒకప్పుడు తిండిలేని తెలంగాణ ఈరోజు దక్షిణాది ధాన్య భాండాగారంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15న బీఆర్ఎస్ మేనిఫెస్టోను అధినేత కేసీఆర్ ప్రకటించనున్నారని, ఆ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాల మైండ్ బ్లాక్ కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. నవంబర్ 3న నోటిఫికేషన్, నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న ఫలితాలు కలిసొచ్చే 3 అనే సంఖ్య రావడంతో బీఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో 3వ సారి గెలిచి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు.

అవినీతి సొమ్ముతో కాంగ్రెస్...

మాటలు, డబ్బు మూటలు, కర్ఫ్యూలకు, మత కల్లోలాలకు పెట్టింది పేరైన కాంగ్రెస్ పార్టీ... మంటల ముఠాలతో ఎన్నికలు చేయాలనుకుంటోందని మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఫేక్ సర్వేలు, గ్లోబల్ ప్రచారాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. కర్ణాటకలో సంపాదించిన అవినీతి సొమ్ముతో తెలంగాణలో గెలవాలని ఆ పార్టీ చూస్తోందని దుయ్యబట్టారు. ముఠా రాజకీయాలతో ఢిల్లీలో టికెట్ల పంచాయితీ చేస్తోందని మండిపడ్డారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్)తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చాక తమను మోసం చేసిందని, పొత్తు పెట్టుకున్న పార్టీని పొట్టన పెట్టుకుందామని చూసిందని ఆరోపించారు. మూడు గంటల కరెంట్ రైతులకు చాలన్న కాంగ్రెస్ మంచిదా, రైతుల మోటార్లకు మీటర్లు పెడుతున్న బీజేపీ మంచిదా, మూడు పంటలకు సరిపడా 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ మంచోడా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని హరీశ్‌రావు కోరారు. ప్రాజెక్టుల ద్వారా నీళ్లు వస్తే అందరూ సంతోషిస్తారని, కానీ ప్రతిపక్షాలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్‌లో కేసీఆర్‌కు తొలి 'ఆశీర్వాదం'



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రజలపై ఉన్న నమ్మకంతోనే సీఎం కేసీఆర్ ఎన్నికల శంఖారావానికి మరోసారి హుస్నాబాద్ వేదిక కాబోతుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈ నెల 15న నిర్వహించే కేసీఆర్ ఎన్నికల శంఖారావ బహిరంగ సభ స్థలాన్ని మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌లతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌కు ఈశాన్యంలో ఉండే హుస్నాబాద్‌ను కేసీఆర్ సెంటిమెంట్‌గా భావిస్తారన్నారు. ఒకప్పుడు కరువు కాటకాలకు నిలయంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గాన్ని నేడు కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

- దక్షిణ భారతదేశంలో తొలి హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టిస్తారు
- జనగామ బీఆర్ఎస్ నేతలతో భేటీలో మంత్రి కేటీఆర్
- ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి నడుమ కుదిరిన రాజీ



పల్లాను ఆలింగనం చేసుకుంటున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ముత్తిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో తొలి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చరిత్ర సృష్టించడం ఖాయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు స్పష్టం చేశారు. అయితే మాయమాటలతో రైతులను గోల్‌మాల్ చేసి రాష్ట్రంలో పాగా వేయాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈనె గాచి నక్కల పాలు చేసినట్లు కాంగ్రెస్ లాంటి ముదనష్టపు పార్టీ చేతిలో రాష్ట్రాన్ని పెట్టొద్దని హితవు పలికారు. మంగళవారం మంత్రుల నివాస సముదాయంలో జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ నెల 16న జనగామలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేసేందుకు పకడ్బందీ ప్రణాళికతో, పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సభ ఏర్పాట్ల బాధ్యత మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అప్పగించినట్లు తెలిపారు. కాగా ప్రతి ఊరూవాడ నుంచి జన సమీకరణ చేయాలని మంత్రి ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. పార్టీ ఇచ్చిన అవకాశంతో జనగామలో 2014లో 34 వేలు, 2018 లో 30 వేల ఓట్ల మెజారిటీతో పీసీసీ అధ్యక్షుడిని ఓడించి కేసీఆర్‌కు కానుకగా ఇచ్చానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి 70 వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీ సాధిస్తారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను జనగామ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రజల ముందు పెడతారని పల్లా తెలిపారు.

పల్లా ప్రచారానికి లైన్ క్లియర్

పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన పార్టీ కీలక నేతలు ఈ భేటీలో పాల్గొన్నారు. ఈ నెల 16న జనగామ బహిరంగ సభ ఏర్పాట్ల కోసం ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. అయితే జనగామ టికెట్ దక్కని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నడుమ రాజీ కోసమే ఈ సమావేశం నిర్వహించారని తెలుస్తోంది. కాగా ఈ భేటీ ద్వారా పల్లా అభ్యర్థిత్వానికి లైన్ క్లియర్ చేయడంతో పాటు ప్రచారానికి కూడా కేటీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో జనగామ నియోజకవర్గంలో బహిరంగ కార్యక్రమాలకు పల్లా శ్రీకారం చుట్టనున్నారు.

త్వరలో 'నర్సాపూర్'పై సయోధ్య!

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డికి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేసీఆర్.. సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం లేదనే అంశంపై స్పష్టత ఇచ్చారు. అయితే వారం రోజుల వ్యవధిలో నాలుగైదు పర్యాయాలు మదన్‌రెడ్డి ప్రగతి భవన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఎమ్మెల్యేగా కొన్ని పెండింగ్ పనులు, ఫైళ్ల కోసమే ఆయన వెళ్తున్నారని చెబుతున్నారు. సునీతా లక్ష్మారెడ్డి ఇప్పటికే అంతర్గతంగా నియోజకవర్గంలో పార్టీ నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. కాగా జనగామ తరహాలో ఒకటి రెండు రోజుల్లో సునీతా లక్ష్మారెడ్డి, మదన్‌రెడ్డి మధ్య కూడా రాజీ కుదిర్చి ఒకే వేదికపై ప్రకటన ఇచ్చేలా కసరత్తు జరుగుతున్నట్టు తెలిసింది. జనగామ, నర్సాపూర్, మల్కాజిగిరి, నాంపల్లి, గోషామహల్ అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అయితే పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ), సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజిగిరి), నందకిషోర్ వ్యాస్ (గోషామహల్), ఆనంద్ గౌడ్ (నాంపల్లి)కి ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ బీ ఫారాలు అందజేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కమలం సర్కార్‌ను తెద్దాం



సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న అమిత్‌షా. చిత్రంలో ఈటల, కిషన్‌రెడ్డి, బండి సంజయ్

▶ మొదటి పేజీ తరువాయి

జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయడం ఆ రైతుల అభ్యున్నతికి దోహదపడుతుందని తెలిపారు. కృష్ణా జలాల వివాదాన్ని కేంద్ర కేబినెట్‌లో చర్చించి తెలంగాణలో నీటి సమస్య తీర్చేవిధంగా మోదీ సర్కార్ నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర సర్కార్ సఫలీకృతమైందని చెప్పారు.

కేసీఆర్‌కు ఏమైందో చెప్పాలి: సంజయ్

అమిత్ షా ప్రసంగానికంటే ముందు కిషన్‌రెడ్డి మాట్లాడేందుకు సిద్ధమయ్యారు. కానీ గొంతు బొంగురు పోవడంతో ఆగిపోయారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ మాట్లాడుతున్నప్పుడు సభలో జనం నుంచి విశేష స్పందన కనిపించింది. బీజేపీ ఎన్నికల యుద్ధాన్ని ప్రారంభించిందని, సైరన్ మోగించామని, కార్యకర్తలు సిద్ధం కావాలని సంజయ్ పిలుపునిచ్చారు. సీఎం గత కొన్ని రోజులుగా కనిపించడం లేదని, ఆయనకు ఏమైందో చెప్పాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. కేసీఆర్ సార్‌కు రక్షణ కల్పించాలని, ఆయన విషయంలో తనకు ఆందోళనగా ఉందని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత రాష్ట్రంలో బీజేపీ నిర్వహించిన మొట్టమొదటి బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ప్రసంగం ప్రారంభించే ముందు రెండు చేతులు పైకెత్తిన అమిత్‌షా.. కేసీఆర్‌ను మార్చివేసి, మోదీ సర్కార్‌ను తెచ్చేందుకు పిడికిలి బిగించాలంటూ పిలుపునిచ్చారు. అనంతరం 'భారత్ మాతాకీ జై'అంటూ ఆయన చేసిన నినాదానికి సభికుల నుంచి విశేష స్పందన వచ్చింది. సభలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవరిలో భవ్య రామమందిర్ ప్రారంభం

ఎన్నికలు వచ్చాయంటే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకొని వస్తారని, ఇటీవల రాహుల్ బాబా ఏదేదో చేస్తామని చెబుతూ తిరుగుతున్నారని అమిత్ షా విమర్శించారు. ఆదివాసీల సంక్షేమం కోసం యూపీఏ ప్రభుత్వం 2013–14లో రూ.24 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తే, ప్రస్తుతం మోదీ ప్రభుత్వం రూ.1.24 లక్షల కోట్లు కేటాయించిందని చెప్పారు. ఆ ప్రభుత్వ హయాంలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, కానీ తమపై అవినీతి ఆరోపణలు చేసే అవకాశం కూడా లేకుండా పోయిందని అన్నారు. ఆర్టికల్ 370 తొలగించడం ద్వారా కశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగంగా చేశామని చెప్పారు. వచ్చే జనవరిలో అయోధ్యలో భవ్య రామమందిర్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు.

అదానీ చేతిలోనే బీజేపీ స్టీరింగ్

అబద్ధాల అమిత్ షా పార్టీకి గుణపాఠం తప్పదు: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందంటూ ఆదిలాబాద్ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. బీఆర్ఎస్ స్టీరింగ్ తమ చేతిలోనే ఉందని, బీజేపీ స్టీరింగ్ మాత్రం అదానీ చేతిలో ఉందని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన విషయాన్ని అమిత్ షాకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చెప్పకుండా దాచారేమో అని అనుమానం వ్యక్తం చేశారు. అమిత్ షా తన వ్యాఖ్యలను సరిదిద్దుకోవాలని సూచించారు.

బీజేపీకి ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదు

అమిత్ షా ఎన్ని అబద్ధాలు చెప్పినా రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ఎన్నికలవేళ బీజేపీ అబద్ధాలు విని రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని, పెరిగిన ధరలు, నిరుద్యోగం గురించి వాళ్లు మాట్లాడాలన్నారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందంటూ వచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగించే ప్రయత్నం చేశారన్నారు. ఆదిలాబాద్ సీసీఐని తెరిపిస్తామని ఐదేళ్ల క్రితం అమిత్ షా ఇచ్చిన హామీ ఏమైందని, గిరిజన యూనివర్సిటీకి అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పినా ఇప్పటిదాకా వర్సిటీని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.

కుటుంబ పాలనపై మాట్లాడితే నవ్వుకుంటున్నారు

కుటుంబ పాలన అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై దేశ ప్రజలు నవ్వుకుంటున్నారని, క్రికెట్ వరల్డ్ కప్ జరుగుతున్న ఈ సందర్భంలో ఆయన కొడుకు జై షా ఎక్కడ క్రికెట్ ఆడారో, ఎవరికి కోచింగ్ ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీస్సులతో పదేపదే తిరిగి ఎన్నికవుతున్న నాయకుల గురించి, కుటుంబ పాలన పేరుతో ప్రశ్నించే నైతిక హక్కు అమిత్ షా లాంటి వారికి లేదన్నారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేకపోవడంతో కేవలం మత రాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చుపెట్టే దుర్మార్గపు రాజకీయాలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.

క్లుప్తంగా...

ఓటర్లను చైతన్యపర్చడానికి 800 కి.మీ.ల సైకిల్ యాత్ర

సైకిలిస్టులను సన్మానించిన సీఈఓ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఓటర్లను చైతన్యపరచడానికి 800 కి.మీ.ల సైకిల్ యాత్రను పూర్తి చేసిన ఐదుగురు సైకిలిస్టులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్ రాజ్ మంగళవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ ఈనెల 4న దుర్గం చెరువుపై జెండా ఊపి వీరి సైకిల్ యాత్రను ప్రారంభించారు. జనగామ, హుస్నాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో ఈ బృందం సైకిల్ యాత్ర నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచింది. సైకిలిస్టుల్లో రాజేశ్, మోను యాదవ్, రాకేశ్, నిఖిల్, విజయప్రసాద్ ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలుకు స్క్రీనింగ్ కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించడానికి సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో స్క్రీనింగ్ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, సంబంధిత శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అన్ని శాఖల ప్రతిపాదనలను తొలుత స్క్రీనింగ్ కమిటీ పరిశీలించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అడ్డంకి కాదని నిర్ధారించుకుంటుంది.

విద్యుదుత్పత్తి, కృష్ణా జలాలపై కౌంటరు దాఖలు చేయండి

కేంద్రం, కేఆర్‌ఎంబీలకు సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీజలాల వినియోగం, విద్యుదుత్పత్తి అంశంలో కౌంటరు దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణకు విద్యుదుత్పత్తి నిమిత్తం కృష్ణా జలాల విడుదల ఆపాలంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేసిందని ఆ రాష్ట్రం తరపు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ ధర్మాసనానికి తెలిపారు. దీంతో కౌంటరు దాఖలు చేయాలని కేంద్రం, కేఆర్‌ఎంబీలను ధర్మాసనం ఆదేశించింది. రిజాయిండరు దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి రెండు వారాలు గడువిస్తూ తదుపరి విచారణను నవంబరు 21కు వాయిదా వేసింది.

ఏదో ఒక దారిలో ఓడీ ఇవ్వండి ప్లీజ్

ప్రభుత్వంపై ఉపాధ్యాయ సంఘాల ఒత్తిడి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలోనూ ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆన్ డ్యూటీ (ఓడీ) డిమాండ్‌ను వదిలిపెట్టడం లేదు. ఎన్నికల కోడ్‌తో తమకేం సంబంధం అంటు న్నారు. ఓ దొడ్డిదారిని ప్రభుత్వానికి సూచిస్తు న్నారు. ఒక టీచర్ల యూనియన్ నేతలు ఇటీవల సంబంధిత మంత్రిని కలిసి ఓడీ కోసం పట్టుబట్టినట్టు తెలిసింది. ఓడీ లభిస్తే గుర్తింపు పొందిన టీచర్ల యూనియన్ నేతలు బోధన విధులకు హాజరవ్వాల్సిన అవసరం ఉండదు. గతేడాది జనవరిలో ఇచ్చిన ఓడీ డిసెంబర్‌తో ముగిసింది. అప్పట్నుంచీ మళ్లీ ఓడీ కోసం టీచర్ల యూనియన్ నేతలు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం ఆలోచిస్తున్న సమయంలోనే తాజాగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఈ నేపథ్యంలో 'ఓడీ వెసులుబాటు ఇవ్వడానికి ఇప్పుడు కోడ్ అడ్డం కాదా?'అని అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. టీచర్ల ఓట్లను ప్రభావితం చేసేందుకే ఓడీ ఇచ్చారనే వాదన వస్తుందేమో అని మంత్రి కూడా అనుమానం వ్యక్తం చేయగా, 'అదేం లేదు... పాత డేట్ వేసి, ఆదేశాలు ఇవ్వొచ్చు'అంటూ సదరు యూనియన్ నేతలు మంత్రి వద్ద అన్నట్టు తెలిసింది.

సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ పిటిషన్ విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేపట్టాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు విచారించింది. ఈ పిటిషన్‌ను సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారించింది. మాదిగ సామాజిక వర్గం అన్నిరంగాల్లోనూ వెనకబాటుతనంతో ఉందని పలు కమిటీలు తెలిపాయని ఎమ్మార్పీఎస్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వర్గీకరణ అంశంపై పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసు రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తోందని, ఈ కేసును దానితో జతపరుస్తామని ఈ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు.

టీఆర్టీపై తర్జనభర్జన!

- ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నిర్వహణపై సందిగ్ధత
- వాయిదా వేయక తప్పేలా లేదంటున్న అధికార వర్గాలు
- హోరాహోరీ ప్రచార సమయంలో టీఆర్టీ పరీక్షలు.. తెరపైకి శాంతిభద్రతలు, ఇతరత్రా సమస్యలు
- వాయిదా వేయాలంటూ అందుతున్న విజ్ఞప్తులు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) వాయిదా వేయక తప్పేట్టు లేదని అధికార వర్గాలు అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటమే దీనికి కారణమని పేర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నవంబర్ 22 నుంచి 30వ తేదీ వరకూ టీఆర్టీ పరీక్ష నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేశారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆరు రోజుల పాటు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సమయంలో ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో పరీక్ష నిర్వహణపై అనుమానాలు నెలకొన్నాయి.

పరీక్ష నిర్వహణ కష్టమేనా?

రాష్ట్రంలో ఎన్నికల హీట్ పెరుగుతోంది. వచ్చే నెల 30న ఎన్నికలుండటంతో 15 రోజుల ముందు నుంచే పోలింగ్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తారు. అప్పటికి ఎన్నికల ప్రచారం హోరాహోరీ దశకు చేరుతుంది. దాదాపుగా ఇదే సమయంలో నవంబర్ 22న స్కూల్ అసిస్టెంట్లు, 23న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, 24న భాషా పండితులు, 25 నుంచి 30వ తేదీ వరకూ సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులకు సంబంధించిన టీఆర్టీ జరగాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో పోలింగ్ జరిగే 30వ తేదీ పరీక్షను వాయిదా వేస్తే సరిపోతుందని అధికారులు భావించినా, 20వ తేదీ నుంచే ఎన్నికల హడావుడి ఉంటుందని, అభ్యర్థులు కూడా ఓటు వేసేందుకు తమ ఊళ్ళకు వెళ్ళాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. మరోవైపు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు భద్రతతో పాటు ఇతర శాంతిభద్రతల అంశాన్నీ, ఆంక్షలను దృష్టిలో పెట్టుకోవాలని పలువురు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. అదీగాక ఎన్నికల విధులకు వెళ్ళేందుకు టీచర్లు, ఇతర సిబ్బంది సన్నాహాల్లో ఉంటారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుంటే పరీక్ష నిర్వహణ కష్టమని అధికార వర్గాలూ భావిస్తున్నాయి. దీంతో మొత్తంగా పరీక్షనే వాయిదా వేయడమా? ఎస్జీటీ పరీక్ష జరిగే 25 నుంచి 30వ తేదీల్లో మార్పు తేవడమా? అనే అంశంపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదించి, దీనిపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఒకటీ రెండురోజుల్లో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే వీలుందని అన్నారు.

నెల రోజులు వాయిదా వేయండి

ఎన్నికల హడావుడిలో టీఆర్టీ పరీక్ష నిర్వహణకు ఇబ్బందు లెదురయ్యే అవకాశం ఉంది. నవంబర్ 20 నుండి 30 వరకు జరగబోయే ఈ పరీక్షలన్నీ నెల రోజులు వాయిదా వేయాలి. పరీక్ష దరఖాస్తు తేదీని కూడా పొడిగించాలి. – రావుల రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు

రూ. 3.35 కోట్ల హవాలా నగదు పట్టివేత

- బంజారాహిల్స్‌లో నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో సుమారు రూ. కోటిన్నర నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న హవాలా సొమ్ము

సాక్షి హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో ఎటువంటి పత్రాల్లేకుండా తరలిస్తున్న నగదు భారీ స్థాయిలో పట్టుబడుతోంది. అదే సమయంలో హవాలా సొమ్ము గుట్టు సైతం రట్టవుతోంది. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో రూ. 3.35 కోట్ల హవాలా సొమ్ముతోపాటు రాష్ట్రమంతటా చేపట్టిన సోదాల్లో సుమారు రూ. కోటిన్నర నగదు, 700 గ్రాముల బంగారం, 4 కిలోల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కమీషన్ ఆశతో తరలిస్తూ...

బంజారాహిల్స్ రోడ్ నంబర్–2లో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా ఓ కారులో తరలిస్తున్న రూ. 3.35 కోట్ల నగదు బయటపడింది. చందానగర్‌లో నివసిస్తున్న చిత్తూరు జిల్లావాసి చింపిరెడ్డి హనుమంతరెడ్డి (48), మాదాపూర్‌లో ఉంటున్న నెల్లూరు జిల్లా గూడూరువాసి బచ్చల ప్రభాకర్ (52), మదీనాగూడ సాయినగర్ కాలనీకి చెందిన చిత్తూరు జిల్లావాసి మండల శ్రీరాములురెడ్డి, మండల ఉదయ్ కుమార్‌రెడ్డి ఈ డబ్బు తరలిస్తూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అది హవాలా డబ్బుగా తేలింది. రూ. కోటికి రూ. 25 వేల చొప్పున కమిషన్‌పై ఈ డబ్బును గుర్తుతెలియని వ్యక్తులు అరోరా కాలనీలో అందజేయాలని తమకు ఇచ్చారని నిందితులు తెలిపారు. దీంతో ఈ డబ్బును సీజ్ చేసి ఎన్నికల కమిషన్‌కు అప్పగిస్తున్నట్లు హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీ జోయల్ డెవిస్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ డబ్బు రవాణాలో రాజకీయ కోణం ఉందా అనే విషయమై ఆరా తీసున్నట్లు చెప్పారు.

ఆధారాల్లేకుండా తీసుకెళ్తూ...

- నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద తనిఖీల్లో రూ. 50 లక్షలు పట్టుబడ్డాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లికి చెందిన నాగునాయక్ ఆ నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో ఆ సొమ్మును నల్లగొండ ట్రెజరీకి పోలీసులు అప్పగించారు.
- ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా జరిగిన తనిఖీల్లో పోలీసులు సుమారు రూ. 30 లక్షలు లభించాయి.
- ఎస్సార్ నగర్ పరిధిలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ. 15 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ పరిధిలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో గోషామహల్‌కు చెందిన దీపక్ అనే వ్యాపారి వద్ద ఎటువంటి ఆధారాల్లేకుండా రూ.11 లక్షలు లభ్యమయ్యాయి.
- మేడ్చల్ జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలోని చెంగిచెర్ల వద్ద తనిఖీల్లో లెక్క చూపని రూ. 6,01,940 బయటపడింది.
- పంజగుట్ట ప్రాంతంలో జరిగిన వాహన సోదాల్లో అంజూదేవి అనే మహిళ ప్రయాణిస్తున్న బెంజ్ కారులో రూ. 5 లక్షలు దొరికాయి.
- సికింద్రాబాద్ జనరల్ బజార్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి రశీదులు లేని సుమారు రూ. 3.52 లక్షల నగదుతో పాటు 706.44 గ్రాముల బంగారం, 3.4 కేజీల వెండి, 92 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొని ఐటీ శాఖకు అప్పగించారు.
- దోమలగూడ పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ. 6 లక్షలను స్వాధీనం చేసుకున్నారు.

గ్రూప్–2 మళ్లీ వాయిదా

- జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామన్న టీఎస్‌పీఎస్సీ
- ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 పరీక్షలు మరోమారు వాయిదా పడ్డాయి. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. వాయిదా పడిన పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 6, 7 తేదీల్లో నిర్వహిస్తామని కమిషన్ కార్యదర్శి మంగళవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పరీక్షలను వాయిదా వేయాల్సి వచ్చిందని వివరించారు. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల సన్నద్ధతకు సమయం కోరడంలాంటి కారణాలతో ఇప్పటికే రెండుసార్లు ఈ పరీక్షలు వాయిదా పడిన సంగతి తెలిసిందే.

సిబ్బంది, భద్రత బలగాల ఇబ్బంది దృష్ట్యా..

గ్రూప్–2 పరీక్షలు నవంబర్ 2, 3 తేదీల్లో నిర్వహించాల్సి ఉంది. 783 ఉద్యోగాలకు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందుకోసం దాదాపుగా 40 వేల మంది సిబ్బంది అవసరం. బందోబస్తుకు గాను 20 వేల సిబ్బంది నాలుగు రోజుల పాటు విధులు నిర్వహించాల్సి ఉండగా.. పరీక్షల నిర్వహణకు మరో 20 వేల మంది అధికారులు, ఇన్విజిలేటర్లు మూడురోజుల పాటు విధుల్లో ఉండాల్సి ఉంటుంది. అయితే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడటంతో, ఎన్నికల సమయంలో పరీక్షల నిర్వహణ కష్టమని అధికారులు భావించారు. నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ జారీ కానుండగా నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలవుతుంది. ఈ నేపథ్యంలో గ్రూప్–2 పరీక్షల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందని టీఎస్‌పీఎస్సీ అంచనాకు వచ్చింది. పరీక్షలు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

చేపల వ్యర్థాలతో ఏం చేద్దాం!?

- రీసైక్లింగ్ పద్ధతిలో వినియోగించుకునేందుకు వీలున్న మార్గాల అన్వేషణ
- చిన్నపిల్లలకు, గర్భిణులకు పోషక పదార్థంగా తయారు
- 'ఎకో వైద్య'శాస్త్రవేత్తల బృందంతో చర్చలు
- హైదరాబాద్ కేంద్రంగా పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు: పిట్టల రవీందర్



సాక్షి, హైదరాబాద్: చేపలను శుద్ధి చేసే క్రమంలో ఉత్పత్తయ్యే వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ పద్ధతిలో వినియోగించుకునేందుకు వీలున్న మార్గాలను ఫిషరీస్ ఫెడరేషన్ అన్వేషణ చేస్తోంది. చేపల వ్యర్థాలను వినియోగించి ఆహార పదార్థాలను తయారు చేయడంతో పాటు చేపలు, కోళ్ల దాణా తయారీలో ఈ వ్యర్థాలను ముడి పదార్థంగా వినియోగించే ప్రక్రియ అనేక దేశాల్లో ఇప్పటికే అమలులో ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో లభ్యమయ్యే చేపల వ్యర్థాలతో ప్రయోగాలు నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'ఎకో వైద్య'అనే వ్యర్థ పదార్థాల యాజమాన్య సంస్థకు చెందిన యువ శాస్త్రవేత్తలు ఎం.కన్నడ రావు, విపుల్ భావే, విజయ యాత్గల్, సి.ఎస్.ఆర్.కార్తీక్ మాసాబ్‌ట్యాంక్‌లోని ఫిషరీస్ కార్యాలయంలో రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్‌ను కలిసి దీనిపై చర్చించారు.

చిన్నపిల్లలకు, గర్భిణులకు పోషక పదార్థంగా..

- చేపలను శుద్ధి చేసే క్రమంలో వెలువడే వ్యర్థాలను దాణా తయారీలో వినియోగించే ముడి పదార్థంగా మార్చడంతో పాటు చిన్నపిల్లలకు, గర్భిణులకు పోషక పదార్థంగా కూడా ఉపయోగపడే విధంగా మార్చే వీలున్న అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందుకు అనుగుణంగా పరిశోధనలు నిర్వహిస్తూనే ఒక ప్రయోగాత్మక పైలెట్ ప్రాజెక్టును హైదరాబాద్ కేంద్రంగా ఫిషరీస్ ఫెడరేషన్ సహాయ సహకారాలతో చేపట్టనున్నట్లు రవీందర్ వెల్లడించారు. హైదరాబాద్ నగరంలోని రాంనగర్ ముషీరాబాద్ చేపల మార్కెట్‌తో పాటు బేగంబజార్ చేపల మార్కెట్లో వెలువడే చేపల వ్యర్థ పదార్థాలను సేకరించి ఈ పైలెట్ ప్రాజెక్టు నిర్వహించే ప్రయోగాలకు వినియోగిస్తామని తెలిపారు. జిల్లాల్లో ఏర్పాటు చేసే ఇలాంటి కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఆయా జిల్లాలకు సంబంధించిన మహిళా మత్స్య సహకార సంఘాలకు అప్పగించాలని కూడా ఆలోచన చేస్తున్నామని ఆయన చెప్పారు.

పండుగ పైసలు 'కోడ్'పాలు

- బ్యాంక్‌లో డ్రా చేసి తీసుకెళ్తున్న ఎరియర్స్ డబ్బులు సీజ్
- లబోదిబోమంటున్న సింగరేణి కార్మికుడు

సాక్షి, పెద్దపల్లి: ఇటీవల సింగరేణి ఇచ్చిన బోనస్, ఎరియర్స్‌తో బతుకమ్మ, దసరా పండుగలకు ఇంటిల్లిపాది కొత్త బట్టలు, ఇంటి సామగ్రి కొనుగోలు చేయాలనుకున్నాడు ఓ కార్మికుడు. అయితే ఆ కార్మికుడి ఆశను ఎన్నికల కోడ్ అడ్డుకుంది. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగెపల్లికి చెందిన వేగొలం రామన్న అనే సింగరేణి కార్మికుడికి స్థానిక బేగంపేట బ్రాంచ్ యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. 11వ వేజ్‌బోర్డు ఎరియర్స్‌ను సింగరేణి యాజమాన్యం అందులో ఇటీవల జమచేసింది. గత నెల తాలూకు వేతనం సొమ్ము కూడా ఆ ఖాతాలో జమైంది. మంగళవారం చెక్కుసాయంతో రూ.3 లక్షలను బ్యాంకు నుంచి డ్రా చేసుకుని రామన్న ఇంటికి వెళ్తుండగా దారిలో పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలకు మించి తీసుకెళ్లరాదంటూ పోలీసులు ఆ డబ్బును సీజ్ చేశారు. బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసినట్లు ఆధారాలు చూపి ఆర్డీవో కార్యాలయంలో వాటిని తిరిగి తీసుకోవాలని చెప్పడంతో లబోదిబోమనడం ఆ కార్మికుడి వంతైంది. ఎరియర్స్ డబ్బులతో పండుగల అవసరాలు తీర్చుకునేందుకు వెసులుబాటు కల్పించాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

చెరువు రక్షణకు 18 ఏళ్లు సరిపోలేదా?

- మరింత ఆక్రమణ కావాలని మీరు భావిస్తున్నారా?
- మమ్మల్ని రెచ్చగొట్టేలా మీ సమాధానాలున్నాయ్.. మీపై చర్యలకు పైఅధికారులకు సిఫార్సు చేస్తాం
- జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- రామంతాపూర్ చెరువుపై విచారణ గురువారానికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: 'రామంతాపూర్ చెరువు రక్షణకు సంబంధించి మీరు 2016లో రెవెన్యూ విభాగానికి ఒక లేఖ రాశారు. దాని తర్వాత కూడా గుర్తు చేశారు. ఎప్పుడు లేఖ రాశారన్నది మీకు కచ్చితమైన తేదీ తెలియదు. మరో ఇద్దరు ముగ్గురు బిల్డర్లు చెరువు పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టాలని మీరు కోరుకుంటున్నారా? ఇలాంటి సమాధానా లిచ్చి మమ్మల్ని రెచ్చగొట్టొద్దు. తీవ్ర అసహనంతో చెబుతు న్నాం.. మీ చట్టబద్ధమైన విధిని నిర్వర్తించనందుకు మీపై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం. ఈ పిటిషన్ 2005 నుంచి పెండింగ్‌లో ఉంది. 18 ఏళ్ల గడిచినా చెరువు రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంకా ఎన్నాళ్లు సమయం కావాలి. మీ పనిని మరొకరిపై నెట్టి తప్పించుకోలేరు. భవిష్యత్ తరాలకు తాగునీటికి సంబంధించిన అంశంలోనూ ఇంత నిర్లక్ష్యమా? ఉన్న జలవనరులను రక్షించు కోలేకపోతే భవిష్యత్ తరాలు క్షమించవు' అని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. రామంతాపూర్ పెద్దచెరువును రియల్టర్లు, అక్రమార్కులు ఆక్రమించకుండా అడ్డుకునేందుకు ఏం చర్యలు తీసుకున్నారని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రోస్‌ను ప్రశ్నించింది. దీనిపై రెవెన్యూ ఉన్నతాధికారులకు 2016లోనే లేఖ రాశామని, వివ రాలు ఇంకా అందలేదని ఆయన చెప్పారు. దీంతో జీహెచ్ ఎంసీ కమిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం, అసహ నం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు కూడా హాజరు కావా లని తేల్చిచెప్పింది. ఈ పిటిషన్‌లో హెచ్‌ఎండీఏ కమిష నర్ ను ఇంప్లీడ్ చేయాలని రిజిస్ట్రీని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం ఆదేశించింది.

తదుపరి విచారణలోగా వివరాలు అందజేయండి..

హైదరాబాద్‌లో 532 చెరువులు క్షీణిస్తున్నాయని, 26 ఎకరాల్లోని రామంతాపూర్ పెద్దచెరువును డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని, ఈ కారణంగా నీటికాలుష్యం పెరిగి దుర్వాసన వ్యాపిస్తోందని ఉస్మానియా ప్రొఫెసర్ డాక్టర్ కెఎల్ వ్యాస్ 2005లో లేఖ రాశారు. చెరువు సమీపంలో చెత్త వేయడంతో భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని, తద్వారా వాతావరణం కలుషితమై, దుర్వాసనతో, దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ ప్రదేశంలో చెత్తను వేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ లేఖను హైకోర్టు విచారణకు స్వీకరించింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ హాజరుకావాలని గత విచారణ సందర్భంగా సీజే ధర్మాసనం ఆదేశించింది. దీనిలో భాగంగా మంగళవారం విచారణకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ హాజరయ్యారు. అయితే ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సరిగా సమాధానాలు ఇవ్వలేకపోవడంపై ప్రభుత్వ న్యాయవాది, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌పై కూడా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌లోని వివరాలను కమిషనర్‌కు వివరించడంలో వీరు విఫలమయ్యారని వ్యాఖ్యానించింది. ఇకపై న్యాయవాదులపై ఆధారపడకుండా, సబ్జెక్టుపై సిద్ధమై కోర్టుకు రావాలని ఆదేశించింది. రామంతాపూర్ పెద్దచెరువుకు కంచె ఎప్పుడు వేస్తారు.. చెత్తరహిత నీటి వనరుగా తీర్చిదిద్దడానికి, నీటి నిల్వ పెరిగేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.. ఆక్రమణలను అరికట్టేందుకు ఏం చేస్తున్నారు.. చెత్తను వేయకుండా స్థానికులకు అవగాహన కల్పించడం.. చెరువు సరిహద్దులు రూపొందించడం.. మట్టి కోతను అరికట్టేందుకు పరీవాహక ప్రాంతాల్లో చెట్ల పెంపకాన్ని చేపట్టడం.. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు నోటిఫికేషన్ ఇవ్వడం.. వీటన్నింటిపై వివరాలు తెలుసుకుని అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఊరట

ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు మిఠాయి తినిపిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్

సాక్షి, హైదరాబాద్/జెడ్పీ సెంటర్ మహబూబ్‌నగర్): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయ నపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2018 ఎన్నికల అఫిడవిట్‌లో తన భార్యకు సంబంధించిన స్థిరాస్తుల గురించి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు సమాచారం ఇచ్చారని, రూ.12 లక్షల మార్టిగేజ్ లోన్, బ్యాంక్ అకౌంట్ల వివరాలు కూడా తప్పుగా ఇచ్చారని మహబూబ్‌నగర్‌కు చెందిన సీహెచ్ రాఘవేంద్ర రాజు 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత మార్పులు చేసి మరోసారి అందజేశారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసిన అడ్వొకేట్ కమిషనర్ నివేదికను ధర్మాసనానికి అందజేయడంతో ఈ నెల 5న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. ఇరు పక్షాల వాదనలు, అడ్వొకేట్ కమిషనర్ నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

న్యాయం, ధర్మమే గెలుస్తుంది

ఎప్పటికైనా న్యాయం, ధర్మమే గెలుస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేగా శ్రీనివాస్‌గౌడ్ ఎన్నిక చెల్లదని దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం కొట్టివేయడంపై ఆయన స్పందించారు. ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు నాయకులు వారి అస్తిత్వం కనుమరుగవుతుందని కుట్ర చేసి బీసీ మంత్రినైన తనపై కేసు వేయించారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు ఎక్కువ రోజులు నిలబడవని తేటతెల్లమైందన్నారు. కుట్రచేసిన వారి పేర్లను ఆధారాలుసహా వెల్లడిస్తానని, వారు తప్పనిసరిగా జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. అంతకుముందు మహబూబ్‌నగర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చేరుకుని బాణాసంచా పేల్చి, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు.

కేసుల వివరాలు ఇవ్వకపోతే ఎలా?

రేవంత్ అడిగిన సమాచారం ఇవ్వండి.. డీజీపీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తనపై దాఖలైన కేసులకు సంబంధించి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అడిగిన కేసుల వివరాలను ఆయనకు ఇవ్వాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యిందని, పిటిషనర్ తన నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, ఆయన కోరిన సమాచారం తనకు అందనప్పుడు నామినేషన్‌ను ఎలా దాఖలు చేస్తారని న్యాయమూర్తి ప్రశ్నించారు. తదుపరి విచారణను 17కు వాయిదా వేస్తూ, ఆ లోగా వివరాలు అందజేయాలని స్పష్టం చేసింది. ఓ ప్రజాప్రతినిధి, ప్రతిపక్ష నాయకుడు అడిగితే సమాచారం ఇవ్వడంలో జాప్యం చేయడాన్ని లేదా నిరాకరించడం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో తనపై దాఖలైన క్రిమినల్ కేసుల వివరాలివ్వాలని కోరుతూ 2023, అక్టోబర్ 3న డీజీపీకి వినతి పత్రం ఇచ్చామని, ఇప్పటివరకు సమాచారం ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ హైకోర్టులో రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

ఎన్నికల అఫిడవిట్‌లో కేసుల వివరాలివ్వాలి కదా..

పిటిషనర్ తరపు న్యాయవాది తేరా రజనీకాంత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 2009, 2014లో జరిగిన వరుస ఎన్నికల్లో కొడంగల్ నుంచి రేవంత్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని, 2019లో మల్కాజిగిరి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారని చెప్పారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన రేవంత్‌పై అధికార పార్టీ అనుచరులు అనేక తప్పుడు కేసులు పెట్టారని వెల్లడించారు. గత రెండేళ్లలోనే రేవంత్‌పై దాదాపు 20 కేసులు విచారణకు రాగా, వాటన్నింటిలోనూ నాంపల్లిలోని ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రత్యేక కోర్టు నిర్దోషిగా విడుదల చేసిందని పేర్కొన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో కేసుల వివరాలు పేర్కొన్నాల్సి ఉన్నందున సమాచారం తప్పని సరి అని వెల్లడించారు. పిటిషనర్‌కు సమాచారం అందించే ప్రక్రియ ప్రారంభమైందని, అతను కోరిన సమాచారాన్ని అందజేస్తామని ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ముజీబ్ నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణలోగా పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

నకిలీ విత్తనాల తయారీపై చర్యలేవి?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నకిలీ విత్తనాల తయారీని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు పలువురు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తూ.. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో నకిలీ విత్తనాల తయారీ, విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

17, 19న రైల్వే కో ఆపరేటివ్ ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఈ నెల 17, 19వ తేదీల్లో జరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.చౌదరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 17న సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో, 19న సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని బయటి రైల్వే స్టేషన్లలో కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని తెలిపారు. విధి నిర్వహణలో ఉంటూ వివిధ ప్రాంతాలకు ఆయా రైళ్లలో దూర ప్రాంతాలకు వెళ్ళే కార్మికులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికోసం 11 నుంచి 13 వరకు సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంలో, 16 నుంచి 18 వరకు బయట ప్రాంతపు రైల్వే స్టేషన్స్ పోలింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్స్ అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్మికులందరూ సంఘ్ ప్యానెల్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సంఘ్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధిని చేసి చూపిస్తామని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ సెక్రటరీ డి.వి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయుధాలు అప్పగించండి

ఉత్తర్వులు జారీ చేసిన సీపీలు

సాక్షి, హైదరాబాద్: శాసన సభ ఎన్నికలు నవంబర్ 30న జరగనున్న నేపథ్యంలో గ్రేటర్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో లైసెన్స్‌డ్ తుపాకులు, ఆయుధాలు కలిగి ఉన్నవారు వాటిని స్థానిక పోలీసు స్టేషన్‌లో లేదా ఆథరైజ్ ఆర్మ్స్ డీలర్ల వద్ద డిపాజిట్ చేయాలని కమిషనర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఆయుధాలను డిపాజిట్ చేయని వారి లైసెన్స్‌లు రద్దు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ హెచ్చరించారు. డిసెంబర్ 10 ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాతే ఆయా ఆయుధాలను సంబంధిత వ్యక్తులకు తిరిగి అప్పగిస్తామని సూచించారు. రాచకొండ పరిధిలోని జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వర్తించే సెక్యూరిటీ గార్డు ఉద్యోగులకు మాత్రం ఆయుధాల డిపాజిట్ నుంచి మినహాయింపు ఉంటుందని సీపీ డీఎస్ చౌహాన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వుల నుంచి మినహాయింపు కావాలనుకునే వారు గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జిల్లా ఆయుధ స్క్రీనింగ్ కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు.



బహుజన హితాయ... బహుజన సుఖాయ... లోకానుకంపాయ.
(అందరి మంచి కోసం, అందరి సంతోషం కోసం, ప్రపంచం పట్ల కరుణతో నడుచుకోవాలి.)

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 11 అక్టోబర్ 2023

పతకాల శతకం

కోరినది నెరవేరింది. అనుకున్నట్టే... ఆశించినట్టే... ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశం పతకాల శతకం పండించింది. చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన 19వ ఏషియన్ గేమ్స్‌లో 655 మంది సభ్యుల భారత బృందం 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్యాలతో మొత్తం 107 పతకాలు గెలిచింది. మునుపు 2018లో జకార్తా ఏషియన్ గేమ్స్‌లో సాధించిన 70 పతకాల రికార్డును తిరగరాసింది. ఆసియా క్రీడల పతకాల వేటలో మూడంకెల స్కోరుకు మన దేశం చేరడం ఇదే ప్రప్రథమం. శతాధిక పతకాల సాధనలో ఎప్పుడూ ముందు వరుసలో ఉండే చైనా, జపాన్, దక్షిణ కొరియాల సరసన అగ్ర శ్రేణి క్రీడాదేశంగా మనం కూడా స్థానం సంపాదించడం గర్వకారణం. ఈ క్రమంలో అతి సామాన్య స్థాయి నుంచొచ్చి అంతర్జాతీయ వేదికపై చెరగని ముద్ర వేసిన మనవాళ్ళ కథలు స్ఫూర్తిదాయకం.

ఈ క్రీడోత్సవాల్లో 201 స్వర్ణాలతో సహా మొత్తం 383 పతకాలతో తిరుగులేని ప్రథమ స్థానంలో చైనా నిలిచింది. 188 మెడల్స్‌తో జపాన్, 190తో దక్షిణ కొరియా ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కరోనా వల్ల ఏడాది ఆలస్యంగా 2021లో జరిగిన టోక్యో–2020 వేసవి ఒలింపిక్స్ లోనూ చైనా, జపాన్‌లు ఇలాగే పతకాల సాధనలో రెండు, మూడు స్థానాల్లోనే ఉన్నాయి. ప్రపంచస్థాయి ఒలింపిక్స్‌లోనే అంతటి విజయాలు నమోదు చేసుకున్న ఆ దేశాలు ఇప్పుడు ఆసియా క్రీడోత్సవాల్లోనూ ఇలా ఆధిక్యం కనబరచడం ఆశ్చర్యమేమీ కాదు. అయితే, ఒలింపిక్స్ పతకాల ర్యాంకింగుల్లో ఆసియా దేశాల కన్నా వెనకాల ఎక్కడో 48వ ర్యాంకులో ఉన్న భారత్, తీరా ఏషియాడ్‌లో మాత్రం వాటన్నిటినీ వెనక్కి నెట్టి, నాలుగో ర్యాంకులోకి రావడం గణనీయమైన సాధన.

మొత్తం 107 పతకాల్లో అత్యధిక పతకాలు (6 స్వర్ణాలతో సహా 29) మనకు అథ్లెటిక్స్‌లోనే వచ్చాయి. ఆపైన అత్యధికంగా షూటింగ్‌లో (22 మెడల్స్), ఆర్చరీలో (9), అలాగే బ్యాడ్మింటన్, రెజ్లింగ్, బాక్సింగ్, హాకీల్లో మనవాళ్ళు ప్రపంచ శ్రేణి ప్రతిభ కనబరిచారు. హాంగ్‌జౌలోని ఈ తాజా ఆసియా క్రీడోత్సవాల్లో మన దేశానికి మరో విశేషం ఉంది. ఈ క్రీడల పోరులో సాంప్రదాయికంగా తనకు బలమున్న హాకీ, రెజ్లింగ్, కబడ్డీ, షూటింగ్ లాంటి వాటిల్లోనే కాదు... అనేక ఇతర అంశాల్లో జమాజెట్టీలైన ఇతర దేశాల జట్లకు ఎదురొడ్డి భారత్ పతకాలు సాధించింది. పట్టున్న హాకీ, కబడ్డీ లాంటి క్రీడల్లో ప్రతిష్ఠ నిలబెట్టుకుంటూనే, ఆటల్లోని ఆసియా అగ్రరాజ్యాలను ఢీ కొని, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ లాంటి ప్రపంచ శ్రేణి ఆటల్లోనూ పతకాలు గెలుచుకుంది. ఇది గమనార్హం.

ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఆదివారం ముగిసిన ఈ ఆసియా క్రీడా సంబరంలో మన ఆటగాళ్ళ విజయగీతిక భారత క్రీడారంగంలో అత్యంత కీలక ఘట్టం. కేవలం పతకాల గెలుపులోనే కాక, క్రీడాజగతిలో మన వర్తమాన, భవిష్యత్ పయనానికీ ఇది స్పష్టమైన సూచిక. క్రీడాంగణంలోనూ మన దేశం వేగంగా దూసుకుపోతూ, రకరకాల ఆటల్లో విశ్వవిజేతల సరసన నిలవాలన్న ఆకాంక్షను బలంగా వ్యక్తం చేస్తున్న తీరుకు ఇది నిలువుటద్దం. 2018 నాటి ఏషియన్ గేమ్స్‌లో పతకాల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచిన భారత్ ఇవాళ నాలుగో స్థానానికి ఎగబాకిందంటే, దాని వెనుక ఎందరు క్రీడాకారుల కఠోరశ్రమ, దృఢసంకల్పం ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, క్రీడా ప్రాధికార సంస్థలు ఆటలకు అందించిన ప్రోత్సాహమూ మరువలేనిది.

ఆతిథ్యదేశమైన చైనా వైఖరి అనేక అంశాల్లో విమర్శల పాలైంది. భారత్‌లో అంతర్భాగమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆటగాళ్ళకు తన వీసా విధానంతో అడ్డం కొట్టి, డ్రాగన్ తన దుర్బుద్ధిని మరోసారి బయటపెట్టుకుంది. జావెలిన్ త్రో సహా కొన్ని అంశాల్లో చైనా అధికారిక రిఫరీలు భారత ఆటగాళ్ళ అవకాశాల్ని దెబ్బ తీసేలా విచిత్ర నిర్ణయాలు తీసుకోవడమూ వివాదాస్పదమైంది. తొండి ఆటతో బీజింగ్ తన కుత్సితాన్ని బయటపెట్టుకున్నా, స్థానిక ప్రేక్షకులు ఎకసెక్కాలాడుతున్నా భారత ఆటగాళ్ళ బృందం సహనంతో, పట్టుదలతో ఈ విజయాలను మూటగట్టుకు వచ్చింది. ఆ విషయం విస్మరించలేం. అందుకే కొన్ని అంశాల్లో అసంతృప్తి ఉన్నా, కొందరు క్రీడాతారలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, ఆటతీరులో నిలకడ చూపలేక పోయినా తాజా ఆసియా క్రీడోత్సవాల్లో భారత ప్రదర్శనను అభినందించి తీరాలి. వచ్చే ఏటి ప్యారిస్ ఒలింపిక్స్‌కు దీన్ని ఉత్ప్రేరకంగా చూడాలి.

మునుపటితో పోలిస్తే, క్రీడాజగత్తులో మనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకోవడం సంతోషకర పరిణామం. అలాగని సాధించినదానితో సంతృప్తి పడిపోతేనే ఇబ్బంది. ఇప్పటికీ జనాభాలో, అనేక ఇతర రంగాల్లో మనతో పోలిస్తే దిగువనున్న దేశాల కన్నా ఆటల్లో మనం వెనుకబడి ఉన్నాం. అది మర్చిపోరాదు. ఆర్థిక, సామాజిక ఇబ్బందులతో పాటు క్రీడావ్యవస్థలోని సవాలక్ష రాజకీయాలు, పెత్తందారీ విధానాలు, క్రీడా సంఘాలను సొంత జాగీర్లుగా మార్చుకున్న నేతలు – గూండాలు మన ఆటకు నేటికీ అవరోధాలు. మహిళా రెజ్లర్లతో దీర్ఘకాలంగా అనుచితంగా వ్యవహరిస్తున్నట్టు అధికార పార్టీ ఎంపీపై అన్ని సాక్ష్యాలూ ఉన్నా ఏమీ చేయని స్వార్థ పాలకుల దేశం మనది. అలాంటి చీకాకులు, చిక్కులు లేకుంటే మన ఆటగాళ్ళు, మరీ ముఖ్యంగా ఇన్ని ఇబ్బందుల్లోనూ పతకాల పంట పండిస్తున్న పడతులు ఇంకెన్ని అద్భుతాలు చేస్తారో! ఏషియాడ్‌లో మనం గెల్చిన 28 స్వర్ణాల్లో 12 మాత్రమే ఒలింపిక్స్ క్రీడాంశాలనేది గుర్తు చేసుకుంటే చేయాల్సిన కృషి, సాధించాల్సిన పురోగతి అవగతమవుతుంది. మహారాష్ట్రలోని దుర్భిక్ష ప్రాంతంలోని రైతు కొడుకు, ముంబయ్‌లో కూరలమ్మే వాళ్ళ కూతురు లాంటి మన ఏషియాడ్ పతకాల వీరుల విజయగాథలెన్నో ఆ లక్ష్యం దిశగా మనకిప్పుడు ఆశాదీపాలు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ద్వాదశి సా.5.11 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మఖ ఉ.9.39 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.6.30 నుండి 8.16 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.11 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.57 నుండి 8.44 వరకు, తిరిగి తె.5.07 నుండి 6.40 వరకు (తెల్లవారితే గురువారం).

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఒత్తిడితో పిల్లల్ని ఇంకా చంపుదామా?

విశ్లేషణ



అవిజిత్ పాఠక్

మన దేశంలోని ఐఐటీలు 2018 నుండి 2023 వరకు 33 మంది విద్యార్థుల ఆత్మహత్యలను నివేదించాయి. ఎన్ఐటీలు, ఐఐఎమ్‌లు అలాంటి 61 కేసులను నమోదు చేశాయి. 'విజయం' అనే కలలను అమ్మే బ్రహ్మాండమైన కోచింగ్ ఫ్యాక్టరీలకు అపఖ్యాతి గాంచిన రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంవత్సరం జనవరి నుండి ఆగస్టు వరకు ప్రతి నెలా సగటున మూడు ఆత్మహత్యలు నమోదయ్యాయి. ప్లేస్‌మెంట్లు, జీతం ప్యాకేజీల కథలతో ఈ వ్యవస్థ యువ మనస్సులను హిప్నోటైజ్ చేస్తోంది. అర్థం లేని పరుగు కోసం గుర్రాలుగా మారుస్తోంది. గొప్ప ఆకాంక్షలను, కలలను చంపుతోంది. అయినా విద్యార్థుల ఆత్మహత్యలను మనం సాధారణీకరిస్తున్నాం. ఈ ప్రాణాపాయ విద్యకు బలంగా 'నో' అని చెప్పాలి.

ఈ మధ్య ఓ దీర్ఘకాలిక ఆందోళన నాతో ఘర్షించడం మొదలెట్టింది. విద్యార్థుల ఆత్మహత్యలను మనం సాధారణీకరిస్తున్నామా? విద్య పేరిట, 'విజయం' కోసం జరిగే పరుగుపందెంలో కొందరు 'బలహీనమైన', 'భావోద్వేగానికి లోనయ్యే' యువకులు తమ జీవితాలను అంతం చేసుకుంటున్నప్పటికీ, దీన్నంతా మామూలు వ్యవహారం లానే చూస్తున్నామా?

ఇలాంటి విద్య... విద్యార్థి స్ఫూర్తినే నాశనం చేస్తుందనీ, సామాజిక మానసిక వ్యాధిని సాధారణీకరిస్తుందనీ చెబుతూ, మధ్యతరగతి తల్లిదండ్రులతోనూ, ఉపాధ్యాయులతోనూ నేను తరచుగా కమ్యూనికేట్ చేయడానికి ప్రయత్నించాను. గణాంకాల ద్వారా వారిని ఒప్పించేందుకు కూడా ప్రయత్నించాను. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2021 నివేదిక ప్రకారం, ఆ ఏడాది 13,089 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే ప్రతిరోజూ 35 కంటే ఎక్కువ చొప్పున అన్నమాట. అయినప్పటికీ, నేను ఒక తిరస్కరణ లేక నిరాకరణ స్థితిని ఎదుర్కొంటున్నాను. మన కాలంలో వాతావరణ అత్యవసర పరిస్థితికి చెందిన కఠినమైన వాస్తవికతను మనం ఎలాగైతే తిరస్కరిస్తున్నామో దాదాపుగా ఇదీ అంతే! మన దేశంలోని ఐఐటీలు 2018 నుండి 2023 వరకు 33 మంది విద్యార్థుల ఆత్మహత్యలను నివేదించాయి. మరో వైపున ఎన్ఐటీలు, ఐఐఎమ్‌లు అలాంటి 61 కేసులను నమోదు చేశాయి. అయినప్పటికీ, మనం మౌనంగా ఉండటానికే ఇష్టపడతాం లేదా దానిని కేవలం ఒక అపసవ్యతగా భావిస్తాం. అదే విధంగా, 'విజయం' అనే కలలను అమ్మే బ్రహ్మాండమైన కోచింగ్ ఫ్యాక్టరీలకు అపఖ్యాతి గాంచిన రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంవత్సరం జనవరి నుండి ఆగస్టు వరకు ప్రతినెలా సగటున మూడు ఆత్మహత్యలు నమోదయ్యాయి.

నిజానికి, జీవితాన్నే నిరాకరించే ఈ పోటీ వ్యాప్తికి సంబంధించిన వ్యవస్థీకృత, సామాజిక కారణాల గురించి నాకు తెలుసు. ఇంకా చెప్పాలంటే, అధిక జనాభా కలిగిన ఈ దేశంలో ఉద్యోగాల కొరత ఉంది. ఉదారవాద కళలు, మానవ శాస్త్రాల విలువ తగ్గిపోయింది. ఇంజినీరింగ్, వైద్యశాస్త్రాలు, బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇతర సాంకేతిక కోర్సులపై మక్కువ పెరిగింది. సంస్కృతిపై, విద్యపై నయా ఉదారవాద దాడి కారణంగా జీవిత ఆకాంక్షల మార్కెటీకరణ జరిగింది. అన్నింటికంటే మించి, 'యోగ్యత' లేదా 'బలవంతులదే మనుగడ' సిద్ధాంతాలకు పవిత్రత కల్పించడం కోసం... అన్యాయమైన సామాజిక వ్యవస్థలో ఒక జీవన విధానంగా అతి పోటీతత్వాన్ని లేదా సామాజిక డార్వినిజంను అంగీకరించడం జరిగింది. మన పిల్లలు, యువ విద్యార్థులు బాధపడుతున్న తీరును చూస్తూనే ఉన్నాం. దీర్ఘకాలిక ఒత్తిడి, భయం, ఆందోళన, ఆత్మహత్య ధోరణులతో వారు జీవిస్తున్నందున, మనం మౌనంగా ఉండలేం. ఈ అన్యాయాన్ని మనం సాధారణీకరించలేం.



ఒక ఉపాధ్యాయునిగా, ఈ విధమైన ఏ విద్యనైనా ఏమాత్రం సందిగ్ధత లేకుండా మనం విమర్శించాలనీ, దీని ద్వారా కొత్త అవకాశాల కోసం ప్రయత్నించాలనీ నేను భావిస్తాను. వాస్తవానికి, ప్రతి ఒక్కరూ ఆత్మహత్య చేసుకోవడం లేదు. కానీ ఈ విద్యా వ్యవస్థలో భాగమైన ప్రతి యువ విద్యార్థి కూడా మానసిక ఒత్తిడి, ఆందోళన, 'వైఫల్యానికి' సంబంధించిన అమితమైన భయాలతో అననుకూలమైన వాతావరణంలో పెరుగుతున్నారనేది కూడా అంతే నిజం. ప్రేమ, సహకారానికి సంబంధించిన ఆవశ్యకత; పట్టుదల, ప్రశాంతతకు సంబంధించిన కళ ద్వారా భూమ్మీద మన ఉనికి తాలూకు హెచ్చుతగ్గులను అర్థం చేసుకోగలిగే సామర్థ్యం; సాధారణ విషయాలలో జీవితానికి సంబంధించిన నిజమైన నిధిని కనుగొనడానికి వీలు కల్పించే బుద్ధిపూర్వక స్థితి... ఇలా, అర్థవంతమైన జీవితాన్ని గడపడానికి అవకాశం లేని, నిజంగా ముఖ్యమైన వాటిని పెంపొందించడంలో ఆసక్తి లేని వ్యవస్థ ఇక్కడ ఉంది. ఒక సీతాకోక చిలుక చిన్న పసుపు పువ్వుతో ఆడుకోవడం, ముసలి నాయనమ్మ కోసం ఒక కప్పు టీ తయారు చేయడం, ఆమెతో పారవశ్యంలో ఒక క్షణం పంచుకోవడం, లేదా శీతా కాలపు రాత్రి ఒక నవలను చదవడం... ఇలాంటి వాటికి బదులుగా, ఈ వ్యవస్థ అన్ని గొప్ప ఆకాంక్షలను, కలలను చంపుతోంది. ఇది యువ మనసులను అర్థం లేని పరుగు కోసం గుర్రాలుగా మారుస్తోంది.

పాఠశాలల నుండి కోచింగ్ ఫ్యాక్టరీల వరకు, మనం విద్యను అన్ని రకాల ప్రామాణిక పరీక్షలను 'ఛేదించే' ఒక వ్యూహంగా కుదించి వేశాము. గొప్ప పుస్తకాలను చదవడం, వినూత్న ఆలోచనలను అన్వేషించడం, చర్చించడం, వాదించడం, సైన్స్, సాహిత్యం, కళలతో ప్రయోగాలు చేయడం వంటి వాటి కంటే పరీక్షలు, మార్కులు చాలా ముఖ్యమైనవి కావడంతో నిజమైన అభ్యాసం దెబ్బతింటోంది. 'వేగానికి' సంబంధించిన మాంత్రికతతో ఓఎమ్ఆర్ షీట్‌లో 'సరైన' సమాధానాన్ని టిక్ చేయగల సామర్థ్యమే విలువైనది అయిపోయింది.

ఎమ్‌సీక్యూ – కేంద్రీకృత పరీక్షా వ్యూహాలను విక్రయించే మార్గదర్శక పుస్తకాలు యువ అభ్యాసకుల మానసిక స్థితిని వలసీకరించడం ప్రారంభించాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

ఈ వ్యవస్థ సౌందర్యం, సృజనాత్మకత, ఉత్సుకత లేనిది. ఇది యాంత్రికమైన, ప్రామాణికమైన, కరుడు గట్టిన మనస్సులను తయారు చేస్తుంది. ఉపకరణ 'మేధస్సు'కు మాత్రమే అది విలువనిస్తుంది. దీనిలో సృజనాత్మక కల్పన లేదా తాత్విక అద్భుతం లేదు. కోచింగ్ సెంటర్ వ్యూహకర్త మీ బిడ్డను సూర్యాస్తమయాన్ని చూడడానికీ, ఒక పద్యం చదవడానికీ లేదా సత్యజిత్ రే చలన చిత్రాన్ని మెచ్చుకునేలా ప్రేరేపించాలనీ మీరు ఆశించలేరు. ఈ బోధకులు మీ పిల్లలను వేగంగా పరిగెత్తమని, ఇతరులను ఓడించమని, భౌతిక శాస్త్రాన్ని లేదా గణితాన్ని కేవలం ప్రవేశ పరీక్ష మెటీరియల్‌గా కుదించుకోమని, అతని/ఆమె స్వీయ–అవగాహనను ఐఐటీ–జేఈఈ లేదా నీట్ ర్యాంకింగ్‌తో సమానం చేయమని మాత్రమే అడగగలరు. మరో మాటలో చెప్పాలంటే, ఈ విధమైన విద్య ఒక వ్యక్తిని సాంస్కృతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా కూడా దారిద్ర్యంలోకి నెడుతుంది. ఇది జీవితం కోసం, దాని లోతైన అస్తిత్వ ప్రశ్నల కోసం ఎవరినీ సిద్ధం చేయదు.

కార్ల్ మార్క్స్ ఒకప్పుడు 'సరుకుల మాయ'గా భావించిన దానిని ఈ విధమైన సాధనా విద్య చట్టబద్ధం చేస్తోంది. అవును, మన పిల్లలు ఒక విధంగా శిక్షణ పొందవలసి ఉంటుంది, తద్వారా వారు ఒక ధర ట్యాగ్‌తో వస్తువులుగా లేదా 'ఉత్పత్తులుగా' ఉద్భవించవలసి ఉంటుంది. కఠినమైన వాస్తవాన్ని అంగీకరించండి. చాలా హైప్ చేయబడిన ఐఐటీలు, ఐఐఎమ్‌లు – మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లల కోసం చూసే అంతిమ మోక్షమైన 'ప్లేస్‌మెంట్‌లు మరియు జీతం ప్యాకేజీల' పురాణాల ద్వారా యువ మనస్సులను హిప్నోటైజ్ చేస్తాయి. మన పిల్లలను, ప్రత్యేకమైన స్వయంప్రతిపత్తి గల వ్యక్తులుగా చూడకుండా, కేవలం 'పెట్టుబడి' లేదా విక్రయించదగిన వస్తువుల స్థాయికి తగ్గించి, మనం న్యూరోటిక్, ఆందోళనతో కూడిన, అధిక ఒత్తిడితో కూడిన తరాన్ని సృష్టించడం కొనసాగిస్తాము. 'మోటివేషనల్ స్పీకర్ల'ను 'స్వయం–సహాయ' పుస్తకాల మార్కెట్‌ను అభివృద్ధి చేయడానికి వ్యవస్థ అనుమతించినప్పటికీ, పెరుగుతున్న ఆత్మహత్యల రేటును అరికట్టడం అసాధ్యం.

ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, శ్రద్ధగల పౌరులుగా, మనం అప్రమత్తంగా ఉండాలి, మన స్వరం పెంచాలి, ఈ ప్రాణాపాయ విద్యకు నో అని చెప్పాలి, కొత్త అవగాహనను ఏర్పరచాలి. మన పిల్లలకు జీవితాన్ని ధ్రువీకరించే, కరుణను పెంచే మరో దృక్పథాన్ని అందించాలి.

వ్యాసకర్త సామాజిక శాస్త్రవేత్త
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

హ్యాపీ బర్త్ డే



పుట్టినరోజు (అక్టోబర్ 10) శుభాకాంక్షలు ఎస్.ఎస్.రాజమౌళి సర్. మీ సినిమా దీప్తి మరెన్నో ఏళ్లు వెలగాలి!

– మహేశ్ బాబు, నటుడు

లోపలే ఆనందం!



ఇన్నర్ ఇంజినీరింగ్ అనేది, నీ లోపలే ఆనంద రసాయనాలను కొనసాగించే సాంకేతిక పరిజ్ఞానం. అన్ని పరిజ్ఞానాల్లాగే, దీన్ని ఉపయోగించడం నేర్చుకుంటే, అది మీ కోసం పనిచేస్తుంది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దాన్ని అభ్యాసం చేయండి.

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

ప్రయోజనాలే ముఖ్యం



వ్యక్తులకు ఒక నైతిక స్పష్టత ఉండటం చాలా ముఖ్యం. కానీ విషాదకరంగా దేశాలకు ఆ విలాసం లేదు. ఇస్లామిక్ తీవ్రవాదం అనేది భారతదేశానికి పెద్ద సవాలుగా ఉంది. అలీన విధాన కాలం, తర్వాతి సంవత్సరాల సమతుల్యతా కాలం ముగిసిపోయాయి. స్వీయ ప్రయోజనాల విషయంలో ఇండియా ఒక గట్టి వైఖరి తీసుకుంది. ఇజ్రాయిల్‌కు మద్దతుగా నిలబడింది.

– రాహుల్ పండిత, జర్నలిస్ట్

ఎదగని మనుషులు



లైఫ్ టిప్: మీకు మానసిక ఆరోగ్య ఇబ్బంది ఉందని ఊరికే ఎవరికైనా చెప్పి చూడండి... ఇక వాళ్లు వాదనలో మీతో తార్కికంగా గెలవలేని ప్రతిసారీ... చివరి అస్త్రంగా మిమ్మల్ని సైకో అనేస్తారు. 100 శాతం ఇది నిరూపితమైంది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ఇలాంటి అబద్ధాలా?



ఇలాంటి అబద్ధాలను ఎంత పిచ్చిగా వ్యాపింపజేస్తున్నారు! ఇక్కడ అన్ని రకాల తప్పుడు వార్తలూ స్వేచ్ఛగా తేలుతున్నాయి. ట్విట్టర్‌ను పూర్తిగా వదిలేయడానికి ఇదే సమయం. (అమర్త్య సేన్ చనిపోయారన్న వార్త వ్యాపించాక, నివాళిగా నందిత ఒక ట్వీట్ చేశారు. ఇంతలో ఆ వార్త మీద ఖండన వచ్చింది. అప్పుడు మళ్లీ ఆమె చేసిన ట్వీట్ ఇది.)

– నందితా దాస్, నటి, దర్శకురాలు

పద్ధతిగా రానిద్దాం!



ఇంతవరకూ పాకిస్తానీ జర్నలిస్టులకు వీసా ఇవ్వకపోవడం నిరాశగా ఉంది. రాజకీయ తగాదాల్లో జర్నలిస్టులు ఎందుకు ఇరుక్కుపోవాలి? ప్రపంచ క్రికెట్ కప్‌కు పాకిస్తాన్ అర్హత సాధించాక, ఇండియా ఆతిథ్యం ఇస్తున్నాక, జర్నలిస్టులకు వీసా నిరాకరించకూడదు. భవిష్యత్తులో ఇస్లామాబాద్ కూడా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరిస్తుందని ఆశిస్తాను. మనం భారతీయ పద్ధతిలో మంచి అతిథుల్లా ఉందాం!

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

బలవంతుల పక్షం



ఇజ్రాయిల్‌కూ, హిట్లర్‌కూ ఏకకాలంలో భారతీయ రైట్ వింగ్ ఎలా మద్దతిచ్చిందని ఒకరు అడిగారు. 'బలవంతులు' అని అనుకున్న ఎవరికైనా అది మద్దతిస్తుంది. దానిలో లోలోతుగా ఉన్న ఆత్మన్యూనతా భావం అది. ఇందులో నైతిక ఆలోచనేమీ లేదు. నిన్ను నువ్వు బలమైన మనిషిగా బ్రాండ్ చేసుకుంటే, ఇండియన్ రైట్ వింగ్ నీకు మద్దతిస్తుంది.

– శివమ్ శంకర్ సింగ్, రచయిత

ఇన్ బాక్స్

అమ్మాయిల పట్ల వివక్ష తగదు!

దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతోందని గొప్పలు చెప్పుకొంటున్నా ఆడపిల్లల పట్ల చూపుతున్న చులకన భావం, వివక్ష కొనసాగుతుండడం గర్హనీయం. బూజు బట్టిన భావజాలం ఇంకా మన భారతీయులను వదల్లేదు. అందుకే ఆడబిడ్డలను తక్కువగా చూడటం, వారిపై అత్యాచారాలకు పాల్పడటం జరుగుతోంది. ఇంటి నుంచి బడికో, బయటికో వెళ్ళిన బాలిక క్షేమంగా తిరిగొస్తుందన్న నమ్మకం లేదు. 'నిర్భయ', 'అభయ', 'దిశ' లాంటి చట్టాలు వచ్చిన తర్వాత కూడా అత్యాచార ఘటనలు లేకుండా ఒక్క రోజైనా గడిచింది లేదు. 'నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో' (ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదిక ప్రకారం, 2021లో 18 ఏళ్ల పైబడిన మహిళలపై అత్యాచారాలకు సంబంధించి మొత్తం 28,644 కేసులు నమోదయ్యాయి. మైనర్లపై 36,069 అత్యాచార కేసులు నమోదయ్యాయి.

ఈ నేపథ్యంలో మనం 'అంతర్జాతీయ బాలికల దినోత్సవం' జరుపుకొంటున్నాం. బాలికల హక్కులు, మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా, ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రపంచానికి తెలియజేయడంతో పాటు బాలికలకు సమాజ పోకడల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జరుపుకోవాలని 2011 డిసెంబర్ 19న ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసింది.

కిశోర బాలిక... మహిళగా రూపాంతరం చెందే కీలక దశ 'కౌమార' దశ. ఈ దశలో వర్తమానంలోనే కాదు భవిష్యత్తులోనూ సాధికారత దిశలో నడవడానికి తనకు అవగాహన, చైతన్యం అవసరం. దీనికి సరైన ఆయుధం విద్యే. విద్యాభివృద్ధి ద్వారానే అన్ని రకాల దుర్మార్గాలను అంతం చేయవచ్చు. బాలికలను సాధికారత వైపు నడిపించడానికి అందరూ పూనిక వహిస్తే ఇదేమంత కష్టంకాదు. అన్నిటికీ మించి పురుష దృక్పథంలో మార్పు రావాలి. పురుషుల్లో దైవభీతి, నైతిక పరివర్తన ఉన్నప్పుడే బాలికా సమస్యలతో పాటు, సమస్త సామాజిక సమస్యలకూ పరిష్కారం లభిస్తుంది.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్
(నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం)

మానవత్వంతో వ్యవహరించాలి!

అభిప్రాయం



దిలీప్ .వి

ప్రాజెక్టుల వల్ల ఎప్పుడూ ప్రయోజనం పొందేది ధనిక వర్గాల వారైతే... భూములను కోల్పోయేది మాత్రం ఆదివాసీలు, దళితులు, బలహీన వర్గాల ప్రజలు మాత్రమే. పర్యావరణ కాలుష్యానికి బలయ్యేది కూడా ఈ వర్గాల ప్రజలే. 'హైదరాబాద్ ఫార్మా సిటీ' పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్ట్ కూడా ఇవే ఫలితాలను అందించబోతున్నది. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల మండలంలోని పన్నెండు రెవెన్యూ గ్రామ పంచాయితీల పరిధిలో గల ఇరవై నాలుగు గ్రామాల్లోని యాభై వేల కుటుంబాలు... అంటే సుమారుగా రెండున్నర లక్షల జనాభా ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌కు బలి కాబోతున్నారు.

2018లో రాష్ట్ర ప్రభుత్వం పంతొమ్మిది వేల మూడు వందల ముప్పై మూడు ఎకరాల భూమిలో పదహారు వేల ఏడు వందల ఎనభై నాలుగు కోట్ల రూపాయల ప్రతిపాదిత వ్యయంతో ఈ ప్రాజెక్టుని ప్రకటించడం జరిగింది. దీనిద్వారా 5.6 లక్షల మందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధి లభిస్తుందనీ... దేశానికి మందుల దిగుమతి తగ్గించి, మందుల కొరతను నివారించడం కోసమని చెప్పి ప్రభుత్వం ప్రజల నుండి బలవంతంగా భూములు గుంజుకొడానికి ప్రయత్నిస్తున్నది. రెండు కాలాలలో పంటలు పండే విస్తీర్ణం 1026.69 హెక్టార్లు (12.48 శాతం), ఖరీఫ్ పంట 1937.23 హెక్టార్లు (22.44 శాతం), ప్రభుత్వం బీడు భూమి 3002.47 హెక్టార్లు (34.4 శాతం) ఇక్కడ ఉందని ప్రభుత్వమే చెబుతోంది. నిజానికి బీడు భూమి అని చెబుతున్నది బీడు కాదు. తమ నుండి సేద్యంలో లేని భూమినే



తీసుకున్నామని నమ్మించడానికి ప్రభుత్వం అట్లా తప్పుడు నివేదికలు ఇస్తుందని రైతులు అంటున్నారు. ఆ భూమిలో నిత్యం కూరగాయలు ఇతరత్రా పండిస్తమని రైతులు తెలిపారు. మిగతా భూమిలో పశువులు మేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

ప్రభుత్వం రైతులను బెదిరించి భూసేకరణ చేస్తోంది. అసైన్డ్ భూములను లాక్కున్నది. అన్యాయమైన ధరలు చెల్లించడానికి సిద్ధమవ్వడంతో రైతులు పరిహారం, భూ సమస్యల గురించి కోర్ట్ మెట్లు ఎక్కారు. కోర్టు రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. హై కోర్ట్ తీర్పులను అమలు పరచాల్సిన ప్రభుత్వం ప్రతిగా రైతులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నది. ఫార్మా సిటీ కోసం భూములను ఇవ్వని రైతుల భూముల పట్టాలను 'ధరణి'లో కలెక్టర్ నిషేధిత ప్రాంతంగా నమోదు చేసి చూపిస్తున్నారు. ప్రభుత్వం తక్కువ ధరలకు రైతుల వద్ద నుండి గుంజుకున్న భూముల నుండే కందుకూరు మండలం బెగరి కంచలో అమేజాన్ డేటా సెంటర్‌కి ఎకరానికి కోటిన్నర రూపాయలకు 45 ఎకరాలు కట్టబెట్టింది. రైతుల నుంచి ప్రభుత్వం భూములు గుంజుకునేది రియల్ ఎస్టేట్ వ్యాపారం చెయ్యడానికేనా?

ఈ ఫార్మా సిటీ వల్ల మరో సమస్య కాలుష్యం. ఈ ప్రాంతం నుండి విడుదలయ్యే కాలుష్య కారకాలు చుట్టూ వంద కిలోమీటర్ల మేర ప్రభావాన్ని చూపిస్తాయి. ప్రతిపాదిత ఫార్మా సిటీ చుట్టూ 13 రిజర్వ్ ఫారెస్టులు ఉన్నవని పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన పత్రంలో స్పష్టంగా రాసి ఉంది. ఈ పరిశ్రమ వల్ల వెలువడే కాలుష్య కారకాలు ఆ అడవులను నాశనం చెయ్యవా? ఈ సందర్భంగా 'పర్యావరణ విధ్వంసం జరిగినా అది సామాజిక న్యాయానికి విఘాతం జరిగినట్లే' అన్న కె. బాలగోపాల్ మాటలు మనందరి సామాజిక బాధ్యతను గుర్తు చేస్తున్నాయి.

వ్యాసకర్త మానవ హక్కుల వేదిక
మొబైల్: 84640 30808

సవరణ: ఆదివారం (8.10.2023) నాటి 'జనతంత్రం'లో 'ఐపీసీ సెక్షన్లు' అనే మాటకు బదులు సీఆర్‌పీసీ సెక్షన్లు అనే పొరపాటు దొర్లింది. గమనించగలరు. పొరపాటుకు చింతిస్తున్నాం.

– ఎడిటర్

భ్రాతృ ధర్మాన్ని అనుసరించి...

కుంభకర్ణుడు వరుసగా ఆరు నెలలు నిద్రపోతాడు. ఒక్కరోజు మేలుకొని ఉంటాడు. 'శయితా హి ఏష షణ్మాసాన్, ఏకాహం జాగరిష్యతి'. ఆ ఒక్కరోజే అమితమైన ఆకలితో ప్రాణులను మింగేస్తుంటాడు. యుద్ధంలో వానర సేన ధాటికి తట్టుకోలేక కుంభకర్ణుడిని ఏనుగులతో తొక్కించి మరీ నిద్ర లేపించాడు రావణుడు. మర్కట సైన్యాన్ని మట్టుపెట్టమని కోరాడు.

''అన్నా! ఈ విషయంలో మేం ముందే చెప్పిన హితవు నువ్వు తోసిపుచ్చావు. నీ పాపానికి ఫలం త్వరగానే నీ ముందుకొచ్చింది. బలశాలినని గర్వించి, ఆలోచన లేకుండా అకృత్యం చేశావు. ధర్మం, అర్థం, కామం మూడూ ఆచరించాల్సినవే. తప్పు లేదు. కానీ ఆ మూడింటిలో ధర్మం ముఖ్యం. ఆ ధర్మమేమిటో ధీశాలుల నుండి తెలుసుకొని కూడా ఆచరించలేని రాజు నేర్చినదంతా వ్యర్థమే. విభీషణుడు ముందే చెప్పిన హితవు ఇప్పుడన్నా ఆచరించు. అది నీకు మేలు. ఆ తరవాత నీ ఇష్టం. యత్ ఇచ్ఛసి తత్ కురు'' అని మొహమాటం లేకుండా చెప్పేశాడు కుంభకర్ణుడు.

జ్యోతిర్మయం

రావణుడికి కోపం వచ్చింది. ''ఆచార్యుడిలాగా గౌరవించాల్సిన అన్ననే శాసిస్తున్నావు, ఇదేమి ధర్మం? నోరు అదుపులో ఉంచుకో. భ్రమో, బలగర్వమో, చిత్త చాంచల్యమో, కారణమేదయినా ఇప్పుడు కష్ట స్థితిలో ఉన్నవాడి ముందు గతమంతా మళ్ళీ తవ్వడం వ్యర్థం. 'గతం తు గతం ఏవ'. ఇప్పుడేం చెయ్యాలో చెప్పు. నాలాగా తప్పుదారి పట్టిన వాళ్ళకు సహాయం చేసే వాడే అసలైన ఆప్త బంధువు'' అన్నాడు.

అన్న చాలా క్షుభితుడై ఉన్నాడని తమ్ముడు గ్రహించాడు. ''సర్వావస్థలలోనూ నీకు హితమార్గం సూచించడం నా సోదరధర్మం కనక చెప్పాను. అయినా నువ్వు కోరుతున్నావు గనక నేనిప్పుడు భయంకరంగా యుద్ధం చేసి రాముడినీ ఆయన దండునూ హతమార్చి వస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు. శ్రేష్ఠమైన మద్యం తాగుతూ (పిబ చ అగ్ర్య వారుణీమ్) రాజభవనంలో సుఖంగా ఉండు. నేను జీవించి ఉండగా ఆ రాముడు నిన్నేమీ చేయలేడు'' అని, వెంటనే యుద్ధభూమికి చేరాడు.

అధర్మ మార్గంలో ఉన్న అన్నకు హితవు చెప్పబోయి విఫలుడై విభీషణుడు సామాన్య ధర్మాన్ని అనుసరించాడు. అన్నను వదిలి, ధర్మపక్షాన్ని చేరాడు. కుంభకర్ణుడు భ్రాతృ ధర్మాన్ని మాత్రం అనుసరించి, అధర్మం పక్షాన పోరాడి, హతుడయ్యాడు.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

బీసీలకు జనాభా దామాషాలో టికెట్లు ఇవ్వాలి
కాంగ్రెస్, బీజేపీలను డిమాండ్ చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్



ముషీరాబాద్(హైదరాబాద్): బీసీలకు జనాభా దామాషా ప్రకారం కాంగ్రెస్, బీజేపీలు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మాదిరిగా మోసం చేస్తే బీసీలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. 'బీసీల ఓట్లు బీసీలకే'అనే నినాదంతో దసరా తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలు మినహా మిగతా నియోజకవర్గాలలో 'బీసీల అలయ్ బలయి' నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం ఇక్కడ దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నేతలతో కలిసి జాజుల మాట్లాడారు. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 34 అసెంబ్లీ సీట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు మాట మార్చి బీఆర్ఎస్ కంటే ఎక్కువే ఇస్తామనడం బట్టి చూస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు బీసీలను మోసగించడంలో ఒకే విధానాన్ని అవలంబిస్తున్నాయని అర్థమవుతోందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జోక్యం చేసుకొని బీసీలకు సామాజిక న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బీసీలకు ఎన్ని టికెట్లు కేటాయిస్తుందో బీజేపీ స్పష్టం చేయాలని జాజుల డిమాండ్ చేశారు.

రూ.5 వేల కోట్లతో గౌడ సబ్‌ప్లాన్
కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలని బాలరాజుగౌడ్ వినతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): గౌడల సంక్షేమానికి రూ.5 వేల కోట్లతో గౌడ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ కోరారు. మంగళవారం ఈమేరకు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో సలహాదారుడు మల్లు రవికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు చిక్కడపల్లిలోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైన్స్, బార్లలో 50 శాతం సబ్సిడీతో కల్లు గీత సొసైటీలకు ఇవ్వాలని, లిక్కర్ కంపెనీలను 50 శాతం గౌడలకే ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన గీత వృత్తిదారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, గీత వృత్తిని ఆబ్కారీ శాఖ నుంచి తొలగించి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును పెట్టాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని, హెచ్‌సీయూకు పాపన్న పేరు పెట్టాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. గౌడల సమస్యలను ఏ పార్టీ తమ మేనిఫెస్టోలో చేర్చుతుందో ఆ పార్టీలకు మద్దతు ఉంటుందన్నారు.

ఓట్ల పండుగ.. రూ.కోట్లు పిండేద్దాం

- 'వంద రోజుల ఫెస్టివల్ చాలెంజ్'లో ఎన్నికలనూ చేర్చిన ఆర్టీసీ
- ఆదాయం ఎలా పెంచుకోవాలో సిబ్బందికి అత్యవసర ఆదేశాలు
- ఎన్నికల సభలకు బస్సులు అద్దెకు తిప్పాలని నిర్ణయం
- ప్రచార సామగ్రి తరలింపునకూ ఆర్టీసీ బస్సులు
- ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకూ బస్సులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్ఆర్టీసీ గతేడాది నుంచి ప్రత్యేక సందర్భాల్లో 'చాలెంజ్'పేరుతో సిబ్బందికి ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. గత దసరా, దీపావళి సమయాల్లో ఫెస్టివల్ చాలెంజ్, ఈ ఏడాది మార్చి నుంచి జూన్ వరకు వంద రోజుల చాలెంజ్‌లను నిర్వహించింది. ఇప్పుడు దసరా, దీపావళి, కార్తీకమాసం, శబరిమలై అయ్యప్ప దర్శనం, క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతిలను పురస్కరించుకుని అక్టోబరు 22 నుంచి వచ్చే ఏడాది జనవరి 16వరకు '100 రోజుల చాలెంజ్'ను నిర్వహిస్తోంది. ఆయా సందర్భాల్లో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువగా ప్రయాణించేలా చూడటంతోపాటు, వీలైనన్ని ఎక్కువ బస్సులను రోడ్కెక్కించటం, ఎక్కువ కిలోమీటర్లు తిప్పటం లక్ష్యం. ఇప్పుడు ఈ ప్రత్యేక సందర్భాల జాబితాలో ఎన్నికలు కూడా చేరాయి. ఈమేరకు అన్ని డిపోలకూ ఆదేశాలు జారీ అయ్యాయి.

ఎన్నికల సమయంలో ఏం చేస్తారంటే?

- **ఎన్నికల సభలకు అద్దెకు బస్సులు:** ప్రచారంలో రాజకీయ పార్టీలకు బహిరంగసభలు కీలకం. ఆ సభలకు జనాన్ని తరలించేందుకు వాహనాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఏ పార్టీ ఎక్కడ బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయో ముందుగానే తెలుసుకుని ఆ సభలకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు బుక్ అయ్యేలా చూడాలి.
- **నగరంలో ఏ ప్రాంత ప్రజలు ఎక్కడో గుర్తింపు:** నగరంలో ఉండే ఓటర్లలో చాలామంది ఓటు హక్కు వేరే నియోజకవర్గాల్లో ఉంటుంది. పోలింగ్ రోజు వారు ఆయా ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఏ నియోజకవర్గం ఓటర్లు నగరంలోని ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్నారో గుర్తించాలి. వారిని సొంత నియోజకవర్గాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకునేలా ఆయా నియోజకవర్గ నేతలతో మాట్లాడి ఒప్పించాలి.
- **ప్రచార సామగ్రి కోసం బస్సులు:** ప్రచారంలో కీలకమైన సామగ్రిని తరలించేందుకు నేతలు వాహనాలను బుక్ చేసుకుంటారు. ఆర్టీసీ బస్సులను అందుకు బుక్ చేసేలా వారితో మాట్లాడి ఒప్పించాలి.
- **ఓటర్లూ బస్సులే ఎక్కాలి:** వేరే ప్రాంతాల్లో ఉండే ఓటర్లు పోలింగ్ రోజు ఓటు హక్కును వినియోగించుకునేందుకు సొంత ప్రాంతానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులనే ఎక్కేలా చూడాలి. ఇందుకు ప్రచారం చేయటంతోపాటు, కీలక పాయింట్ల వద్ద స్టాఫ్ ఉండి దీనిని సుసాధ్యం చేయాలి.
- **ఈవీఎంలు, సిబ్బంది తరలింపునకు బస్సులు:** పోలింగ్ సిబ్బంది, ఈవీఎంల తరలింపునకు ఎన్నికల సంఘం వాహనాలను బుక్ చేసుకుంటుంది. అందుకు ఆర్టీసీ బస్సులే బుక్ అయ్యేలా చూడాలి. గతేడాది దసరా, దీపావళి సమయాల్లో ఆర్టీసీ రూ.1360.69 కోట్ల ఆదాయాన్ని సాధించింది. ఎన్నికల నేపథ్యంలో ఈసారి గతేడాది కంటే కనీసం 10 శాతం ఆదాయం పెరగాలన్నది సంస్థ లక్ష్యం.



ఈనెల 25న హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనున్న అలయ్-బలయ్ కార్యక్రమానికి హాజరుకావాలని మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ఆహ్వానించిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మి

ఫసల్ బీమా ఎందుకు అమలు చేయడం లేదు?
రాష్ట్ర సర్కారుకు హైకోర్టు ప్రశ్న

సాక్షి, హైదరాబాద్: రైతులకు అధిక ప్రయోజనాలు అందించే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను తెలంగాణలో ఎందుకు అమలు చేయట్లేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. పీఎంఎఫ్‌బీవై పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేలా ఆదేశాలివ్వాలని న్యాయవాది రాపోలు భాస్కర్ రాసిన లేఖను హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. 'ఈ పథకం తెలంగాణ తప్ప అన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది. రాష్ట్రంలో 58.33 లక్షల మంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వరదలు, ఇతర కారణాలతో పంటలు దెబ్బతినడం వల్ల అన్నదాతలు అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నారు. గత మార్చి, ఏప్రిల్‌లోనూ సుమారు 7 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తున్నా.. అది అందరికీ అందడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పీఎంఎఫ్‌బీవై అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలి'అని లేఖలో న్యాయవాది కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం దీనిపై విచారణ చేపట్టింది. 'పంటలతో సంబంధం లేకుండా రూ.10 వేలు ఇవ్వడం కంటే రైతులకు ఎక్కువ లబ్ధి చేకూర్చే ఫసల్ బీమాను అమలు చేయడం మంచిది కదా! కేంద్ర పథకమా? రాష్ట్ర ప్రభుత్వ పథకమా? అని చూడకుండా రైతులకు అధిక ప్రయోజనం చేకూర్చేదై ఉండాలి' అని హైకోర్టు అభిప్రాయపడింది. తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది.

● శ్రీవారి సన్నిధిలో కేసీఆర్ సతీమణి



తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ దర్శించుకున్నారు. అంతకుముందు తిరుమల శ్రీవారికి ఆమె తలనీలాలు సమర్పించారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఏపీ ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, కల్వకుంట్ల శోభ శ్రీకాళహస్తికి వెళ్లి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. - తిరుమల

రామన్ జీవితం స్ఫూర్తిదాయకం

- కెనరా బ్యాంక్ మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఎస్.రామన్
- ఆయన ఆటోబయోగ్రఫీ 'ఫ్రమ్ ఏ కార్ షెడ్ టు ద కార్నర్ రూమ్ అండ్ బియాండ్' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాక్షి, హైదరాబాద్: కెనరా బ్యాంక్ మాజీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రామన్ జీవితం ఆద్యంతం స్ఫూర్తిదాయకమని, జీవితంలో అనేక సంక్లిష్ట పరిస్థితులను, సవాళ్లను ఎదుర్కొని ఉన్నత శిఖరాలను చేరుకున్నారని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్.రామన్ రాసిన 'ఫ్రమ్ ఏ కార్ షెడ్ టు ద కార్నర్ రూమ్ అండ్ బియాండ్' ఆటోబయోగ్రఫీ పుస్తకాన్ని మంగళవారం సికింద్రాబాద్ కెనరాబ్యాంకులో ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామన్ జీవిత చరిత్ర భావితరాలకు ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంలో పనిచేసేవారికి స్ఫూర్తిదాయకమన్నారు. రిటైర్డ్ సీజీఎం ఎస్.ఎస్.భట్ మాట్లాడుతూ ఆవిష్కరణకు ముందే ఈ పుస్తకం ప్రముఖుల ప్రశంసలు అందుకుందన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న రామన్ స్థితప్రజ్ఞుడని చెప్పారు. పుస్తక రచయిత రామన్ మాట్లాడుతూ జీవితంలో విజయాలను వైఫల్యాలను సమంగా స్వీకరించాలన్నారు. క్లిష్ట సమయాల్లో తనకు అండగా నిలిచిన స్నేహితులు, కెనరా బ్యాంకు అధికారులు, ఉద్యోగులకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో రామన్ కుటుంబసభ్యులు, ఆయన స్నేహితులతోపాటు కెనరా బ్యాంకు, ఇతర బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్‌పై వేటు

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హారిక ఆనంద్ గౌడ్‌ను పదవి నుంచి తొలగించారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ హారిక భర్త ఆనంద్ గౌడ్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ప్రధాన అనుచరుడుగా కొనసాగుతున్నారు. మైనంపల్లి సిఫారసుతోనే ఆమెకు చైర్ పర్సన్ పదవి దక్కింది. ఇటీవల మైనంపల్లి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన ప్రధాన అనుచరుడి భార్యను పదవి నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. కాగా.. వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి సైతం మైనంపల్లి వర్గీయుడిగానే గుర్తింపు ఉంది. బీఆర్ఎస్‌పై తిరుగుబాటు చేసిన సందర్భంగా మైనంపల్లి ఏర్పాటు చేసిన సమావేశాల్లో వేణుగోపాల్ రెడ్డి ఆయన వెంటే ఉన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని, మైనంపల్లితో కాంగ్రెస్‌లోకి వెళ్లేది లేదంటూ వేణుగోపాల్ రెడ్డి చెబుతున్నారు.

పనుల విషయంలో అధికార పార్టీ నేతల ఒత్తిడి

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం



యాకూబ్‌పాషా

దోర్నకల్: గ్రామంలో పలుఅభివృద్ధి పనుల కోసం అనుమతి పత్రాలు ఇవ్వాలంటూ అధికార పార్టీ నేతలు ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురైన ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చిలుకొయ్యలపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్‌కు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి మహ్మద్ యాకూబ్‌పాషా చిలుకొయ్యలపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులకు హాజరైన యాకూబ్ పంచాయతీ కార్యాలయంలో పురుగుమందు తాగారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఆయన్ను స్థానికులు గమనించి మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి వీడీసీ (విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ) అనుమతి పత్రం ఇవ్వాలంటూ అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలు తనపై ఒత్తిడి తేవడంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు యాకూబ్ తెలిపారు.

పంటనష్టమొచ్చిందని కౌలు రైతు దంపతుల ఆత్మహత్య

అనాథలైన చిన్నారులు



అశోక్, సంగీత దంపతులు (ఫైల్)



అనాథలైన చిన్నారులు

మంథని (పెద్దపల్లి జిల్లా): ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలతో పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతు దంపతులు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి నెల్లిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కటుకు అశోక్ (35), సంగీత (28) దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు సాయి (5), కూతురు సన (4) ఉన్నారు. గ్రామ శివారులో ఐదెకరాల వ్యవసాయభూమిని కౌలు తీసుకుని రెండెకరాల్లో పత్తి, మూడెకరాల్లో వరి వేశారు. వ్యవసాయ పనులు లేనిసమయాల్లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లింది. పెట్టుబడి కోసం తెచ్చిన ఈ అప్పులు తీర్చేదారిలేకపోవడంతో మనస్తాపం చెందిన దంపతులు...సోమవారం రాత్రి పురుగుమందు తాగారు. మంగళవారం ఉదయం ఇరుగుపొరుగు వారు గమనించగా దంపతులిద్దరూ విగతజీవులుగా పడి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. కాగా, వీరి మృతితో అనాథలైన చిన్నారులు తమ తల్లిదండ్రులకు ఏమైందో తెలియక దిక్కులు చూస్తున్న దృశ్యం గ్రామస్తులను కలచివేసింది.

గాంధీ కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది సమ్మె విరమణ



నర్సింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రతినిధులు

- నేటి నుంచి విధుల్లోకి
- శాంతియుత పోరాటం కొనసాగిస్తాం

గాంధీఆస్పత్రి: వేతనాల పెంపు, ఇతర న్యాయమైన సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని గత 17 రోజులుగా విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టిన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది ఆందోళన విరమించి బుధవారం నుంచి విధులకు హాజరుకానున్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసఫ్, నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి నారాటి ప్రసాద్ మంగళవారం సాయంత్రం నర్సింగ్ సిబ్బందితో సమావేశమై చర్చించారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో సమ్మె విరమించి, శాంతియుత పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేతన సమస్యలతోపాటు ఇతర డిమాండ్ల పరిష్కారమయ్యేంతవరకు వినతిపత్రాలు ఇవ్వడం, ఇతర రూపాల్లో నిరసన చేపట్టాలని నిర్ణయించారు. కోవిడ్ సమయంలో వేతనాలు పెంచి ఇప్పుడు తగ్గించడం సమంజసం కాదని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈనెల 11 నుంచి విధులకు యథావిధిగా హాజరవుతామని కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు నర్సింగ్ అసోషియేషన్ ప్రతినిధులు ఇందిర, సబిత, సుందరమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి
ఓయూలో ముగిసిన మాక్ పార్లమెంట్





మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై, హాజరైన ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ: యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మూడు రోజులుగా ఓయూ, సిటిజన్ యూత్ పార్లమెంట్ ఆధ్వర్యంలో జరిగిన మాక్ పార్లమెంట్ సమావేశాలు మంగళవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి వీసీ ప్రొ.రవీందర్ అధ్యక్షత వహించగా గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా చూడాలని ఓటమిని కూడ ఉత్సవంగా జరుపుకునేంతగా నిగ్రహశక్తిని పెంపొందించుకోవాలన్నారు. భవిష్యత్తు యువతి, యువకులదేనని వివిధ రంగాలతో పాటు చట్ట సభల్లో ప్రవేశించాల్సిన యువత ప్రతి చిన్న సమస్యకు అధైర్యపడకుంగా ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి యువత పై ఉన్నదన్నారు. ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు రాజకీయాలపై ఆసక్తి చూపాలన్నారు. సిటిజన్ ఇండియా సీఈవో స్వాతి చంద్రశేఖర్ మాట్లాడుతూ మాక్ పార్లమెంట్‌కు 180 ఎంపిక కాగా 130 మంది హాజరైనట్లు తెలిపారు. వారిలో రాష్ట్రం నుంచి 17 మంది అభ్యర్థులను ఎంపిక చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే భారత పార్లమెంట్ సమావేశాలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, జర్నలిస్ట్ వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమావేశాల్లో పాల్గొన్న ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేశారు.

వసతులపై అసంతృప్తి

వసతులు, భోజనాలపై మాక్ పార్లమెంట్‌కు హాజరైన విద్యార్థులు, యువకులు అసంతృప్తిని వ్యక్తంచేశారు. వసతులతో పాటు హాజరైన వక్తల్లో కూడా ముందుగా పేర్కొన్న ఎంపీలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరుకాలేదన్నారు. మూడు రోజుల వసతి కోసం రూ.3000, వసతి లేనివారికి రూ.2000 వసూలు చేశారన్నారు. ఓయూ క్యాంపస్ హాస్టల్ గదుల్లో వసతి, లేడీస్ హాస్టల్, బాయ్స్ హాస్టల్‌లో భోజన ఏర్పాట్లు చేశారన్నారు. సర్టిఫికెట్‌పై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంతకం గాని కనీసం గవర్నర్ సంతకం కూడ లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

రూ.468 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు ధ్వంసం
రూ.40 లక్షల విదేశీ సిగరెట్లు సైతం



కస్టమ్స్ అధికారులు ధ్వంసం చేసిన రూ.468 కోట్ల విలువ చేసే మాదక ద్రవ్యాలు

శంషాబాద్ (హైదరాబాద్): ఆర్‌జీఐ విమానాశ్రయంతో పాటు వివిధ ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డ రూ.468 కోట్ల విలువైన మాదకద్రవ్యాలతో పాటు విదేశీ సిగరెట్లను హైదరాబాద్ కస్టమ్స్ అధికారులు ధ్వంసం చేశారు. మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో హైదరాబాద్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అధికారులు మంగళవారం ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ధ్వంసం చేసిన వాటిలో రూ.95.37 కోట్ల విలువ చేసే 27 కేజీల హెరాయిన్, రూ.272.55 కోట్ల విలువ చేసే 136 కేజీల మెఫిడ్రోన్, రూ.కోటి విలువ చేసే 52 కేజీల గంజాయితోపాటు ఆర్‌జీఐ విమానాశ్రయంలో పట్టుబడిన రూ.40 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లు కూడా ఉన్నాయి. నైజీరియా, టాంజానియా, దక్షిణాఫ్రికా, బెనియోనాయస్ దేశాలకు చెందిన పౌరులతో పాటు మనదేశానికి చెందిన వారి నుంచి కస్టమ్స్ అధికారులు, డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు కలిసి వీటిని పట్టుకున్నారు.

ఆ ఖాతాలకు డబ్బు ఎందుకు పంపారు?

- ఆ వ్యక్తులు ఎలా తెలుసు?
- నటుడు నవదీప్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు..
- టాలీవుడ్ డ్రగ్స్‌కేసు, మాదాపూర్ డ్రగ్స్ కేసులపై ఆరా



సాక్షి, హైదరాబాద్: 'ఈ బ్యాంకు ఖాతాకు మీరు డబ్బు ఎందుకోసం పంపారు? ఈ ఆర్థిక లావాదేవీలు జరిపిన వ్యక్తులు మీకు ఎలా తెలుసు? ఎప్పటి నుంచి ఈ బ్యాంకు ఖాతాలకు డబ్బులు పంపుతున్నారు?' ఇలాంటి అనేక కీలక ప్రశ్నలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు నటుడు నవదీప్‌కు సంధించినట్లు సమాచారం. కొందరు నైజీరియన్ల బ్యాంకు ఖాతాలకు నవదీప్ బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు వెళ్లినట్టుగా ఈడీ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. 2017లో నమోదైన టాలీవుడ్ డ్రగ్స్ కేసులతో పాటు ఇటీవల నమోదైన మాదాపూర్ డ్రగ్స్ కేసులలో ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించేందుకు తమఎదుట హాజరుకావాలంటూ ఈడీ అధికా రులు నటుడు నవదీప్‌కు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం ఉదయం 10-40 గంటలకు సైఫాబాద్ లోని ఈడీ కార్యాలయానికి నవదీప్ చేరుకున్నారు. సమన్లలో పేర్కొన్న విధంగా బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్‌కార్డ్ సహా ఇతర డాక్యుమెంట్లను అధికారులకు అందజేశారు. జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ ఆధ్వర్యంలోని ఐదుగురు అధికారుల ప్రత్యేక బృందం నవదీప్‌ను దాదాపు 8 గంటల పాటు విచారించింది. ముఖ్యంగా నవదీప్‌కు చెందిన 3బ్యాంకు ఖాతాల లావాదేవీలపై ప్రశ్నించినట్టు తెలిసింది.

నైజీరియన్లతో ఆర్థిక లావాదేవీలు..

2017లో తెలంగాణ ఎక్సైజ్‌శాఖ నమోదు చేసిన డ్రగ్స్ కేసులలో కీలక నిందితుడు కెల్విన్ పట్టుబడిన తర్వాత టాలీవుడ్ డ్రగ్స్ లింకులు బయటపడ్డాయి. దీంతో హీరో నవదీప్ సహా పలువురిని ఎక్సైజ్ అధికారులు విచారించారు. ఈడీ మనీలాండరింగ్‌పై దృష్టి పెట్టింది. ప్రత్యేకంగా కేసు నమోదు చేసిన అధికారులు 2021లో నవదీప్‌తో పాటు పలువురు టాలీవుడ్ నటులను ప్రశ్నించారు. ఇప్పటికే ఒకసారి నవదీప్‌ను ప్రశ్నించిన ఈడీ అధికారులు తాజాగా మంగళవారం నాటి విచారణలోనూ ఆయన ఆర్థిక లావాదేవీలపై ఆరా తీశారు. నవదీప్‌కు ఇటీవల మాదాపూర్ డ్రగ్స్ కేసులో అరెస్టయిన వరంగల్‌కు చెందిన రామ్‌చంద్ అత్యంత సన్నిహితుడు. రామ్‌చంద్ బెంగళూరులో షెల్టర్ తీసుకుంటున్న నైజీరియన్లు అమోబి చుక్వుడి, మైకేల్, థామస్ అనఘల వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌లో కస్టమర్లకు అమ్మేవాడని తేలింది. కాగా హీరో నవదీప్ కూడా డ్రగ్స్ అందించేవాడని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఈ క్రమంలోనే నైజీరియన్లతో నవదీప్ ఆర్థికపరమైన లావాదేవీలు జరిపినట్టుగా ఈడీ ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది. తాజా డ్రగ్స్ కేసులతో పాటు 2017లో నమోదైన టాలీవుడ్ డ్రగ్స్ కేసులో కూడా నవదీప్ నుంచి వివరాలు రాబడుతున్నట్టు సమాచారం. విచారణ అనంతరం మంగళవారం రాత్రి ఈడీ కార్యాలయం నుంచి తిరిగి వెళుతున్న నవదీప్‌ను మీడియా ప్రతినిధులు పలు అంశాలపై ప్రశ్నించారు. అయితే ఆయన ఏమీ స్పందించకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

No.PSOCII/25/e-auction/2023-24 దీ: 07-10-2023
DIPR RO No.8111-PP/CL/Advt/1/2023-24, Dt. 10.10.2023

క్లుప్తంగా...

రెచ్చగొట్టే ప్రసంగాల కేసులో అరుంధతీ రాయ్‌పై విచారణ



న్యూఢిల్లీ: 2010 నాటి రెచ్చగొట్టే ప్రసంగాల కేసులో ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, కశ్మీర్‌కు చెందిన మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై విచారణకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మంగళవారం అనుమతిచ్చారు. భిన్న గ్రూపుల మధ్య శత్రుత్వం పెంచడం తదితర సెక్షన్ల కింద వారిపై కేసు నమోదైంది. సీఆర్పీసీ సెక్షన్ 196(1) ప్రకారం విద్వేష ప్రసంగాల వంటి కేసుల్లో విచారణకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ కేసులో నిందితులైన వేర్పాటువాద నేత సయ్యద్ అలీ షా గిలానీ, ఢిల్లీ వర్సిటీ లెక్చరర్ సయ్యద్ అబ్దుల్ రెహ్మాన్ జిలానీ ఇప్పటికే మరణించారు. భారత్ నుంచి కశ్మీర్ భారత్‌లో ఎప్పుడూ భాగంగా లేదని, దాని స్వాతంత్ర్యం గురించి అన్ని ప్రయత్నాలూ చేయాలని ఆ సమావేశంలో రాయ్ తదితరులు ప్రసంగాలు చేశారంటూ కశ్మీర్‌కు చెందిన సుశీల్ పండిట్ అనే సామాజిక కార్యకర్త ఫిర్యాదు చేశాడు. ఈ సమావేశంలో పౌర హక్కుల నేత వరవరరావు కూడా పాల్గొన్నారు.

హమాస్ తరహాలో దాడులు చేస్తాం

అట్టావా: సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సంస్థ చీఫ్, ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్ను భారత్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. భారత్ పంజాబ్‌ను ఇంకా తన అధీనంలో ఉంచుకుంటే హమాస్ తరహాలో దాడులు చేస్తామని హెచ్చరిస్తూ ఒక వీడియో విడుదల చేశాడు. ఇజ్రాయెల్ పాలస్తీనా యుద్ధం నుంచి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుణపాఠాలు నేర్చుకోవాలన్నాడు. భారత్ ప్రత్యేక ఖలిస్తాన్ ఏర్పాటు చేయకుండా పంజాబ్‌ను ఇంకా తన అధీనంలో ఉంచుకుంటే హమాస్ తరహాలో భారత్‌లో హింసను సృష్టిస్తామన్నాడు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో మంగళవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్ర వాదులు హతమయ్యారు. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు భద్రతా బలగాలు అల్షిపొరాలో మంగళవారం వేకువజామున గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు లష్కరే తోయిబాకు చెందిన మొరిఫత్ మక్బూల్, జజిమ్ అలియాస్ అబ్రార్ అనే ఉగ్రవాదులు మృతి చెందారు. వీరిలో అబ్రార్‌కు బ్యాంకులో గార్డుగా పనిచేసే కశ్మీరీ పండిట్ సంజయ్ శర్మ హత్యతో సంబంధమున్నట్లు పోలీసులు వెల్లడించారు.

డీఎంకే ఎంపీ బినామీ ఆస్తులు ఈడీ స్వాధీనం

న్యూఢిల్లీ: కేంద్ర టెలీకమ్యూనికేషన్ల శాఖ మాజీ మంత్రి, డీఎంకే ఎంపీ ఎ.రాజాకు చెందినట్లుగా భావిస్తున్న 15 బినామీ స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం తెలిపింది. కోవై షెల్టర్స్ ప్రమోటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఉన్న కంపెనీ ఎంపీకి చెందిన బినామీ ఆస్తిగా భావిస్తున్నామంది. రూ.55 కోట్ల విలువైన ఈ ఆస్తులను అక్రమార్జనగా భావిస్తున్నామని తెలిపింది.

రాజీనామా ఆమోదం కోసం డిప్యూటీ కలెక్టర్ పాదయాత్ర

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఒక మహిళా డిప్యూటీ కలెక్టర్ రాజీనామాను ఆమోదించాలంటూ ఏకంగా సీఎం నివాసానికి పాదయాత్ర చేసి అరెస్టయ్యారు! చత్తర్ పూర్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ గా చేస్తున్న నిషా బాంగ్రే వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతానని ప్రకటించారు. గత జూన్ లోనే రాజీనామా చేశారు. దాన్ని ఇప్పటిదాకా ఆమోదించనందుకు నిరసనగా సెప్టెంబర్ 28నా బేతుల్ జిల్లా నుంచి పాదయాత్ర మొదలు పెట్టారు. సోమవారం సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ నివాసానికి వెళ్తుండగా అరెస్టు చేసినట్టు పోలీసులు చెప్పారు. ఆమెను కోర్టులో హాజరు పరిచారు. బెయిల్ తీసుకోవడానికి నిరాకరించడంతో జైలుకు పంపారు.

ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఇంట్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీలోని అధికార పార్టీఆప్ నేతలు ఇప్పటికే పలు అభియోగాలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. తాజాగా, మనీలాండరింగ్ తదితర కేసులున్న ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌పై మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులు జరిపారు. ఎమ్మెల్యేకు చెందిన మూడు చోట్ల సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీ అసెంబ్లీలోని ఓఖ్లా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అమానతుల్లా ఢిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఉన్నారు. ఆ సమయంలో సిబ్బంది నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఢిల్లీ ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దాని ఆధారంగా మనీలాండరింగ్ కేసు పెట్టింది. ఢిల్లీ ఏసీబీ అధికారులు అమానతుల్లాను 2022 సెప్టెంబర్‌లో అరెస్ట్ చేయగా బెయిల్‌పై బయటకు వచ్చారు.

మహిళా పథకాల ప్రగతిపై మోదీ సమీక్ష

న్యూఢిల్లీ: మహిళల సాధికారత కోసం స్వాతంత్ర్య దిన ప్రసంగం సందర్భంగా ప్రకటించిన పలు పథకాల అమలులో పురోగతిని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం సమీక్షించారు. జనరిక్ ఔషధాల విక్రయానికి స్టోర్లు తెరవడం వంటి పలు పథకాలను మోదీ ప్రకటించిన విషయం తెలిసిందే



గాజా స్ట్రిప్‌లోని ఖాన్‌యూనిస్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన భవనాలు



గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యూనిస్‌లో భవన శిథిలాలను తొలగిస్తున్న పాలస్తీనియన్లు



హమాస్ మిలిటెంట్లు 260 మందిని చంపేసిన మ్యూజిక్ ఫెస్టివల్ ప్రాంతమిదే

శవాల దిబ్బలు.. శిథిల దృశ్యాలు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో 1,800 మందికి పైగా బలి

జెరూసలేం/లండన్/వాషింగ్టన్/గాజా సిటీ/న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ వైమానిక దాడులతో గాజా సిటీ దద్దరిల్లిపోతోంది. వందలాది భవనాలు ధ్వంసమవుతున్నాయి. శిథిలాలు దర్శనమిస్తున్నాయి. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం నాలుగో రోజుకు చేరింది. మంగళవారం తెల్లవారుజాము నుంచే ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు గర్జించాయి. గాజాపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరువైపులా ఇప్పటికే దాదాపు 1,800 మంది మరణించారు. ఇజ్రాయెల్‌లో 1,000 మందికిపైగా, గాజా, వెస్ట్‌బ్యాంకులో 800 మంది మరణించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో శవాల దిబ్బలు కనిపించాయన్నారు. దాడులు, ప్రతిదాడుల్లో వేలాది మంది క్షతగాత్రులుగా మారారు. అంతర్జాతీయ సమాజం నుంచి ఇజ్రాయెల్‌కు మద్దతు వెల్లువెత్తుతోంది. హమాస్ మిలిటెంట్ల ఘాతుకాలను ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండిస్తున్నాయి. శత్రువులపై తమ ఎదురుదాడి కొన్ని తరాలపాటు ప్రతిధ్వనించేలా ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ స్పష్టం చేశారు. ఆయన తాజాగా జాతినుద్దేశించి ప్రసంగించారు. తమ లక్ష్యం కేవలం హమాస్ మాత్రమేనని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ గనుక తమపై వైమానిక దాడులు ఇలాగే కొనసాగిస్తే.. ఇప్పటికే తమ అధీనంలో ఉన్న బందీలను చంపేస్తామని హమాస్ హెచ్చరించడం ఆందోళన కలిగిస్తోంది. దాడులు వెంటనే ఆపాలని హమాస్ డిమాండ్ చేస్తోంది.

ఇక భూభాగం నుంచి యుద్ధం!

దేశ సరిహద్దులపై పూర్తి పట్టు సాధించామని, తీవ్రవాదులు చొరబడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. తమ దేశంలో వందలాదిగా హమాస్ మిలిటెంట్ల మృతదేహాలను గుర్తించామని తెలియజేసింది. తమ దాడుల్లో వారు మృతిచెందినట్లు పేర్కొంది. హమాస్‌తోపాటు ఇతర మిలిటెంట్ గ్రూప్‌లు తమ దేశం నుంచి 150కిపైగా జనాన్ని బందీలుగా తీసుకెళ్లాయని ఇజ్రాయెల్ తెలిపింది. వీరిలో సైనికులు, సాధారణ పౌరులు ఉన్నారని వివరించింది. హమాస్ అధీనంలో ఉన్న తమ వారిని వెంటనే విడిపించాలని బందీల కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బందీలను క్షేమంగా వెనక్కి తీసుకొస్తామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఎలీ కోహెన్ చెప్పారు. బందీలకు ఏమైనా జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హమాస్‌ను హెచ్చరించారు. గాజాపై భూభాగం గుండా దాడి చేయాలని ఇజ్రాయెల్ సైన్యం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం 3 లక్షల రిజర్వ్ సైనికులను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి దాడి గాజాపై చివరిసారిగా 2014లో జరిగింది. ఇదిలా ఉండగా, శనివారం కారులో పారిపోతున్న ఇద్దరు హమాస్ తీవ్రవాదులను ఇజ్రాయెల్ బోర్డర్ పోలీసులు బైక్‌లపై వెంటాడి కాల్చిచంపిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి.

ఇజ్రాయెల్‌కు భారతీయుల అండదండలు: మోదీ

ఉగ్రవాదాన్ని భారత్ బలంగా, నిస్సందేహంగా వ్యతిరేకిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అరికట్టాల్సిందేనని అన్నారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. తమ దేశంపై హమాస్ మిలిటెంట్ల దాడులు, తదనంతర పరిస్థితుల గురించి వివరించారు. అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుత విపత్కర సమయంలో భారతీయులు ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. తమ మద్దతు ఇజ్రాయెల్‌కు ఉంటుందని చెప్పారు. తనకు ఫోన్ చేసి, తాజా పరిస్థితిని వివరించిన నెతన్యాహూకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

మద్దతు ప్రకటించిన యూకే ప్రధాని రిషి సునాక్

ఇజ్రాయెల్‌కు తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. హమాస్ రాక్షసకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. యూకేలోని యూదుల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిషి సునాక్ మంగళవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కాల్జ్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీతో మాట్లాడారు. ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణపై చర్చించారు. వారితో కలిసి ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. హమాస్ ఉగ్రవాద చర్యలను సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, ఆ విషయంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ విమానాల రాకపోకలు బంద్

ఇజ్రాయెల్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పట్లో చల్లారే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఇజ్రాయెల్ నుంచి తమ విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పలు అంతర్జాతీయ విమానయాన సంస్థలు ప్రకటించాయి. టెల్ అవివ్‌లోని బెన్ గురియన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మంగళవారం పలు విమానాలు నిలిచిపోయాయి. కొన్ని ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. అమెరికన్ ఎయిర్‌లైన్స్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్, డెల్టా ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఫ్రాన్స్, కాథీ పసిఫిక్ ఎయిర్‌వేస్, వర్జిన్ అట్లాంటిక్ వంటి సంస్థలు ఇజ్రాయెల్‌కు విమానాలు నడపడం లేదని వెల్లడించాయి. యూరప్, ఆసియాలోని వివిధ విమానయాన సంస్థలు కూడా ఇదే బాటలో నడుస్తున్నాయి.

స్వచ్ఛంద సంస్థల సాయం

గాజాలో యుద్ధంలో చిక్కుకున్న సామాన్య ప్రజలను ఆదుకోవడానికి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. ఇజ్రాయెల్ అష్ట దిగ్బంధనం చేయడంతో గాజాకు నీరు, ఔషధాలు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఆగిపోయాయి. జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈజిప్షియన్ రెడ్ క్రాస్ సంస్థ 2 టన్నులకు పైగా ఔషధాలను గాజాకు పంపించింది. ఆహారం, ఇతర నిత్యావసరాలు కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గాజాలోని ఆసుపత్రుల్లో రోగులకు ఔషధాలు అందిస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. బాధితుల కోసం నిధులు సేకరిస్తున్నామని పేర్కొంది.



గాజా సిటీలో శిథిల భవనాల దారుల్లో పాలస్తీనా పౌరులు



ఇజ్రాయెల్ సైన్యం దాడులతో గాజా సిటీలో చెలరేగిన మంటలు

పాలస్తీనియన్లు చెల్లాచెదురు

హమాస్ మిలిటెంట్ల పాలనలో ఉన్న గాజా స్ట్రిప్ జనాభా 20.3 లక్షలు. వీరంతా పాలస్తీనా జాతీయులు. ఇజ్రాయెల్‌పై హమాస్ ముష్కరుల దాడి తర్వాత వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. హమాస్‌పై ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడుతోంది. వైమానిక దాడులు కొనసాగిస్తోంది. రాకెట్లు, క్షిపణులు ప్రయోగిస్తోంది. దీంతో పాలస్తీనావాసులు ప్రాణభయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. వారంతా చెల్లాచెదురవుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే 1,80,000 మందికిపైగా పాలస్తీనియన్లు ఐక్యరాజ్యసమితి శిబిరాలకు చేరుకున్నారు. అక్కడే తలదాచుకుంటున్నారు. బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. హమాస్ దుశ్చర్య తమకు ప్రాణసంకటంగా మారిందని గాజా స్ట్రిప్ పాలస్తీనియన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కోసం గాజా సిటీలోని పాఠశాలల్లో పదుల సంఖ్యలో తాత్కాలిక శిబిరాలను ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసింది. మరోవైపు నగరంలో విద్యుత్, నీటి సరఫరా నిలిచిపోవడంతో జనం కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఆహారం దొరకడం లేదు. పిల్లల పరిస్థితి చూసి కన్నీళ్లు ఆగడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో ఐక్యరాజ్యసమితి శిబిరాలు కూడా ధ్వంసమవుతున్నాయి. ఆదివారం, సోమవారం జరిగిన దాడుల్లో ఆరు శిబిరాలు దెబ్బతిన్నాయి. ఇక్కడ ఎంతమంది చనిపోయారన్నది తెలియరాలేదు. పొరుగుదేశం ఈజిప్టుకు వలస వెళ్లేందుకు కొందరు బాధితులు ప్రయత్నిస్తున్నారు. ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకున్నవారికే ఈజిప్టు నుంచి అనుమతి లభిస్తోంది. మరోవైపు తమ లక్ష్యం హమాస్ మిలిటెంట్లు మాత్రమేనని, సామాన్య ప్రజలు కాదని ఇజ్రాయెల్ చెబుతోంది. ప్రజలకు నష్టం వాటిల్లకుండా ఆపరేషన్ కొనసాగిస్తున్నామని అంటోంది.

ఏడుగురు ముష్కరులను చంపి..

చిన్నారులను కాపాడుకుని..

సైనిక దంపతుల వీర మరణం

ఇజ్రాయెలీల కన్నీటి సెల్యూట్

జెరూసలేం: వాళ్లిద్దరూ చూడచక్కని జంట. పేర్లు అడర్ బెర్డిచివిస్కీ, ఇటాయ్ బెర్డిచివిస్కీ. ఇజ్రాయెల్ సైన్యంలో కమాండర్లు. అది అక్టోబర్ 7. శనివారం. ఇజ్రాయెల్ ఎన్నటికీ మర్చిపోలేని దుర్దినం. తెలతెలవారుతూనే సరిహద్దులు దాటి చొరబడి సమీప ప్రాంతాలన్నింటిపైనా హమాస్ మెరుపుదాడికి దిగిన వేళ. ముష్కర మూకలు సామూహిక జన హననానికి, కనీ వినీ మారణహోమానికి పాల్పడుతున్నాయి. ఒక్కో ఇంటినే వెదుకుతూ, చిన్నా పెద్దా తేడా లేకుండా పాశవికంగా హతమారుస్తూ సాగుతున్నాయి. ఆ సమయంలో అడర్, ఇటాయ్ తమ ప్రేమకు ప్రతిరూపాలైన 10 నెలల కవలలతో ఇంట్లో సరదాగా గడుపుతున్నారు. రాకెట్ల కలకలం వినగానే కీడు శంకించినా, హమాస్ అడపాదడపా చేసే దాడులుగానే తొలుత భావించారు. కానీ అవి అంతకంతకూ పెరిగిపో తుండటం, పరిసరాలన్నీ విపరీతమైన కాల్పుల మోతతో దద్దరిల్లిపోతుండటంతో పరిస్థితి తీవ్రత అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు. అంతే! వారిలోని సైనికులు మేల్కొన్నారు. ఇంట్లో దాచిన ఆయుధాలు అందుకుని రంగంలోకి దిగారు. అప్పటికే మిలిటెంట్లు వాళ్ల ఇంట్లోకి చొరబడటంతో ముందుగా పిల్లలను వారి బారిన పడకుండా చూడాలని నిర్ణయించుకున్నారు. ఇజ్రాయెలీ చట్టాల ప్రకారం కొత్త ఇళ్లలో తప్పనిసరిగా నిర్మించాల్సిన సేఫ్ స్ట్రాంగ్ రూమ్ మమ్మద్‌లో వారిని సురక్షితంగా దాచారు. మిలిటెంట్లు అటువైపు రాకుండా తెలివిగా వారి దృష్టి మళ్లిస్తూ వచ్చారు. ఇద్దరూ చెరోవైపు విడిపోయి గందరగోళపరిచారు. వీలు చిక్కినప్పుడల్లా ఒక్కో మిలిటెంట్‌నూ మట్టుబెడుతూ వచ్చారు. అలా ఒకరిద్దరిని కాదు, ఏకంగా ఏడుగురిని నేలకూల్చారు. చివరికి హమాస్ ముష్కరుల సామూహిక దాడిలో ఇద్దరూ నేలకొరిగారు! అడర్, ఇటాయ్ దంపతుల ఈ వీరోచిత విషాద గాథను ఉక్రెయిన్‌లో ఇజ్రాయెల్ దౌత్యాధికారి వ్యష్నికోవ్ ఫేస్‌బుక్‌లో పంచుకున్నారు. దీన్ని చదివిన ఇజ్రాయెలీలంతా బరువెక్కిన గుండెలతో ఆ వీర దంపతులకు సెల్యూట్ చేస్తున్నారు.



కొసమెరుపు: ఇంతకూ చిన్నారుల సంగతి ఏమైందంటారా? సుఖాంతమే అయింది. దారిపొడవునా హమాస్ మిలిటెంట్లను ఎదుర్కొంటూ, వీలైనంత మందిని మట్టుబెడుతూ వాళ్ల మామ, తాతయ్య వచ్చి స్ట్రాంగ్ రూమ్ తెరిచి చూసేదాకా 13 గంటలపాటు అందులోనే ఉండిపోయారు. ఇప్పుడు పునరావాస కేంద్రంలో సేదదీరుతున్నారు.

భారత్‌కు దౌత్య పరీక్షే

- ఇజ్రాయెల్, పాలస్తీనా యుద్ధంపై రెండుగా అంతర్జాతీయ సమాజం
- ఇజ్రాయెల్ పట్ల సానుభూతి ప్రకటించిన మోదీ
- ప్రస్తుతానికి సమదూరమే మేలంటున్న నిపుణులు
- 'రష్యా–ఉక్రెయిన్' తరహా వైఖరే సబబని వ్యాఖ్యలు

పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్‌తో ఇజ్రాయెల్ పోరు అంతర్జాతీయ సమాజాన్ని క్రమంగా రెండుగా విడదీస్తోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటివి ఇజ్రాయెల్‌కు, ఇరాన్ పాలస్తీనాకు పూర్తిగా మద్దతుగా నిలుస్తున్నాయి. చైనా కాస్త ఇజ్రాయెల్ వైపు, ఇస్లామిక్ దేశాలు పాలస్తీనాకేసి మొగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ కల్లోలం భారత్‌కు దౌత్యపరంగా అగ్నిపరీక్షే కానుంది. పశ్చిమాసియాతో మనకున్న సంక్లిష్ట రాజకీయ, ఆర్థిక సంబంధాలే ఇందుకు ప్రధాన కారణం. మధ్యప్రాచ్యంలో మరింత క్రియాశీల పాత్ర పోషించే దిశగా రంగం సిద్ధం చేసుకుంటున్న పరిస్థితుల్లో వచ్చి పడ్డ ఈ పోరు మన దౌత్య చాణక్యానికి విషమ పరీక్షే కానుంది.

అధికారికంగా మౌనమే

ఈ కల్లోలంపై విదేశాంగ శాఖ ఇంకా అధికారికంగా ఏమీ స్పందించకపోయినా, 'దాడులను చూసి ఎంతగానో చలించిపోయా. కష్టకాలంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటా'మని శనివారం ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తద్వారా ఇజ్రాయెల్‌కే తమ మద్దతని పరోక్షంగా చెప్పినట్టే అయింది. కాకపోతే ఈ విషయంలో ఇజ్రాయెల్‌కు బాహాటంగా పూర్తిస్థాయి మద్దతివ్వడం మన ప్రయోజనాల రీత్యా శ్రేయస్కరం కాదనే వాదనలే వినిపిస్తున్నాయి. ఇందుకు పలు కారణాలున్నాయి. అరబ్ లీగ్‌లో కీలకమూ, అతి పెద్దదీ అయిన సౌదీ అరేబియాతో భారత సంబంధాలు ప్రస్తుతం దూకుడు మీదున్నాయి. ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. ఆ వెంటనే ఇజ్రాయెల్ ప్రధాని భారత పర్యటనకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే పాలస్తీనా అనుకూల సౌదీతో మన సంబంధాలను అది ప్రభావితం చేయగల దంటున్నారు. అంతేగాక మధ్యప్రాచ్యంలో చైనాకు పూర్తిగా చెక్ పెట్టి అక్కడి రాజకీయ, వ్యూహాత్మక అంశాల్లో నిర్ణాయక పాత్ర పోషించేందుకు కొన్నేళ్లుగా భారత్ ప్రయత్నిస్తూ వస్తోంది. పైగా ఇటీవలే మరో కీలక పరిణామమూ జరిగింది. భారత్–మధ్యప్రాచ్య–యూరప్ ఆర్థిక కారిడార్ ఏర్పాటుకు ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్రంలో నిర్ణయం జరిగింది. చైనా దూకుడుగా వెళ్తున్న బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టుకు చెక్ పెట్టడం వంటివి కూడా దీని వెనక భారత్ లక్ష్యాలు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మాత్రం తప్పటడుగు పడ్డా అరబ్ దేశాలతో ఇన్నేళ్లుగా నిర్మించుకుంటూ వస్తున్న సత్సంబంధాలకు విఘాతం కలిగే ఆస్కారముంది.

ఇప్పటిదాకా ఇలా..

స్వాతంత్ర్యానంతరం నుంచీ ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలో భారత వైఖరి కాస్త సంక్లిష్టంగానే ఉంటూ వచ్చింది. ఇజ్రాయెల్‌ను ఒక దేశంగా 1950లో అన్యమనస్కంగానే భారత్ గుర్తించింది. అనంతరం కూడా చాలా ఏళ్లపాటు ఆ దేశంతో దూరమే పాటిస్తూ వచ్చింది. అదే సమయంలో పాలస్తీనా విముక్తి సంస్థ నేత యాసర్ అరాఫత్ పట్ల సానుభూతి ప్రదర్శించింది. ఇందిరా, రాజీవ్‌గాంధీ ప్రభుత్వాలు కూడా దీన్నే కొనసాగించాయి. కానీ ఇండో చైనా యుద్ధ సమయంలో అరబ్ దేశాలు భారత్‌కు మద్దతివ్వకుండా తటస్థంగా వ్యవహరించడం, అనంతరం పాక్‌తో జరిగిన యుద్ధాల్లో ఆ దేశానికే దన్నుగా నిలవడంతో మన పాలస్తీనా అనుకూల విధానంపై స్వదేశంలోనే పెద్దపెట్టున విమర్శలొచ్చాయి. అనంతరం కువైట్‌ను ఇరాక్ ఆక్రమించడం, అలీన విధానం తెరమరుగు కావడం వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి బాగా మారింది. ఇజ్రాయెల్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. వాజ్‌పేయి హయాంలో ఈ బంధం సుదృఢమైంది. కార్గిల్ యుద్ధ సమయంలో అత్యవసర ఆయుధ సరఫరాల ద్వారా ఇజ్రాయెల్ మనకు నమ్మదగ్గ మిత్రునిగా మారిపోయింది. అయినా 2014 దాకా కూడా అంతర్జాతీయ వేదికలపై పాలస్తీనాకు మన మద్దతు కొనసాగుతూనే వచ్చింది. పాలస్తీనా పోరుకు పూర్తిగా మద్దతిస్తున్నట్టు నాటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలను కొనసాగిస్తామంటూ ముక్తాయించారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

ఆచితూచి అడుగేయాలి

ప్రస్తుత కల్లోలం నేపథ్యంలో ఇజ్రాయెల్, పాలస్తీనాల్లో ఏదో ఒకదానికి భారత్ మద్దతు ప్రకటించక తప్పదన్న అభిప్రాయాలు గట్టిగా విన్పిస్తున్నాయి. కానీ మధ్యప్రాచ్యంతో మన వర్తక, వ్యూహాత్మక బంధాలు, అవసరాల రీత్యా అదంత శ్రేయస్కరం కాదని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయప డుతున్నారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ ఎవరి పక్షమూ వహించని విషయం తెలిసిందే. అమెరికా తదితర దేశాలు ఎంతగా ఒత్తిడి తెచ్చినా ఉక్రెయిన్‌కు మద్దతిచ్చి వ్యూహాత్మకంగా మనకు అత్యంత కీలకమైన రష్యాను దూరం చేసుకునేందుకు ససేమిరా అంది. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని వాటికి సూచిస్తూ వస్తోంది. అదే సమయంలో రష్యా నుంచి చమురు దిగుమతులు తదితరాలను నిర్నిరోధంగా కొనసాగిస్తోంది. ఇజ్రాయెల్, పాలస్తీనా విషయంలోనూ అదే వైఖరిని కొనసాగించడం ప్రస్తుతానికి మేలన్నది పరిశీలకుల భావన. ''మధ్యప్రాచ్యంతో మన సంక్లిష్ట బంధాల దృష్ట్యా కూడా ఇదే మేలు. ఎందుకంటే సౌదీ అరేబియా మనకు నాలుగో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. మరోవైపు ఇజ్రాయెల్‌కు మనం అతి పెద్ద ఆయుధ వినియోగదారులం'' అని వారు గుర్తు చేస్తున్నారు.

బర్త్‌డే బెలూన్.. చిన్నారి ప్రాణం తీసింది!



టెన్నెస్సీ: పుట్టిన రోజు వేడుకలో అందంగా అలంకరించిన బెలూనే చివరికి ఆ చిన్నారి ఉసురుతీసింది. అందుకే, ప్రమాదకరమైన వాయువులతో నింపిన బెలూన్లతో ఆటలొద్దు..జాగ్రత్త..! అంటూ చిన్నారి తల్లి హెచ్చరిస్తున్నారు. అమెరికాలోని టెన్నెస్సీలో ఇటీవల చోటు చేసుకున్న విషాద ఘటన ఇది. అలెగ్జాండ్రా కెల్లీ అనే ఏడేళ్ల చిన్నారి సెప్టెంబర్ 24వ తేదీన ఏడో పుట్టిన రోజు జరుపుకుంది. బర్త్‌డే వేడుకలో ఆమె తల్లి చన్నా కెల్లీ ఏడంకెతో కూడిన పెద్ద బెలూన్‌తోపాటు మరో 10 రబ్బర్ బెలూన్లను అలంకరించారు. అక్టోబర్ ఒకటో తేదీన ఆదివారం నాడు బెలూన్లుంచిన గదిలోకి వెళ్లి ఆడుకుంటోంది. కొద్దిసేపటి తర్వాత వెళ్లి చూడగా గదిలో అలెగ్జాండ్రా పెద్ద బెలూన్‌పై ఉలుకూపలుకూ లేకుండా పడిపోయి ఉంది. వెంటనే కృత్రిమ శ్వాస(సీపీఆర్) కల్పించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బెలూన్‌లోని ప్రమాదకరమైన హీలియం వాయువును పీల్చడం వల్లే ఆమె శ్వాస ఆగిపోయి ఉంటుందని భావిస్తున్నారు. చిన్నారి తల్లి చన్నా కెల్లీ ఈ విషాద వార్తను సోషల్‌మీడియాలో పంచుకోవడంతో తాజాగా వెలుగులోకి వచ్చింది. బెలూన్ల వాడకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులను ఆమె హెచ్చరించారు.

రహస్య పత్రాల విషయంలో బైడెన్ 'విచారణ'

వాషింగ్టన్: అమెరికాలో అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. పలు రహస్య పత్రాల ఉదంతానికి సంబంధించి అధ్యక్షుడు బైడెన్‌ను స్పెషల్ కౌన్సెల్ రాబర్ట్ హర్ 'ఇంటర్వ్యూ'చేశారు. వైట్‌హౌస్‌లో ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగినట్టు అధికారులు వెల్లడించారు. అయితే ఇది ఆయన అంగీకరించి పాల్గొంటున్న స్వచ్ఛంద ఇంటర్వ్యూయేనంటూ ముక్తాయించారు. బైడెన్ ఉపాధ్యక్షునిగా ఉండగా డెలావర్‌లోని ఆయన నివాసంలో, వాషింగ్టన్‌లోని కార్యాలయంలో పలు రహస్య పత్రాలు దొరికినట్టు వైట్‌హౌస్ గత జనవరిలో ప్రకటించడం తెలిసిందే.

చైనా కాన్సులేట్‌లోకి దూసుకెళ్లిన కారు

శాన్‌ఫ్రాన్సిస్కో: అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న చైనా కాన్సులేట్ కార్యాలయంలోకి ఈనెల 9వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి కారుతో దూసుకొచ్చాడు. పోలీసు అధికారి జరిపిన కాల్పుల్లో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు అధికారులు తెలిపారు. కారు ఢీకొనడంతో కాన్సులేట్ వీసా ఆఫీస్ లాబీకి నష్టం వాటిల్లిందని వివరించారు. కారులో ఇతరులెవరూ లేరని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని చెప్పారు. ఈ ఘటనను చైనా విదేశాంగ శాఖ ఖండించింది.

13 వరకు సంజయ్ సింగ్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్‌కు సంబంధించి ఆప్ నేత సంజయ్ సింగ్ ఈడీ కస్టడీని ప్రత్యేక కోర్టు అక్టోబర్ 13 వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ ఎంకె నాగపాల్ ఈ ఆదేశాలను జారీ చేశారు.



దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లోని టాల్‌స్టాయ్ క్షేత్రంలో 8 అడుగుల మహాత్మా గాంధీ మట్టి విగ్రహాన్ని భారత హై కమిషనర్ ప్రభాత్ ఆవిష్కరించారు. 20వ శతాబ్దపు తొలినాళ్లలో గాంధీ లాయర్‌గా చేసే రోజుల్లో ఈ క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు.

ఇందిరా.. ఎన్టీఆర్.. మీటింగ్‌ల మిద్దె..




ఈ ఇంటిని చూశారా! సూర్యాపేట జిల్లా కోదాడ నయానగర్‌లోని వెంకట్రామయ్య నివాసం ఇది. పాతతరం నాయకులందరికీ సుపరిచితమైన ఇల్లు. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ ఇంటి పరిసరాలన్నీ ఆ సమయంలో వ్యవసాయ భూములుగా ఉండేవి. 1980 ప్రాంతంలో కోదాడలో ఏ పార్టీ మీటింగ్ జరిగినా సభావేదికగా ఈ ఇంటినే ఎంచుకునేవారు. ఎన్టీ రామారావు 1982లో తొలిసారి కోదాడకు వచ్చినప్పుడు ఈ ఇంటి మీద నుంచే ప్రసంగించారు. ఆ తర్వాత నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన చింతా చంద్రారెడ్డి.. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీతో మీటింగ్ ఏర్పాటు చేయగా ఆమె కూడా ఇక్కడి నుంచే మాట్లాడారు. మాజీ ఉపప్రధాని దేవీలాల్ ఈ ఇంటినే వేదికగా చేసుకుని మీటింగ్‌లలో పాల్గొన్నారు. - కోదాడ

మూడోసారి.. మూడో తేదీ... ముక్కోణం!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈసారి ఎన్నికలు 'ప్రత్యేకం'

ఖమ్మం.. యూత్ ఫుల్



రాష్ట్రవ్యాప్తంగా యువ ఓటర్లు అత్యధికంగా ఉన్న జిల్లా ఖమ్మం. కొత్త ఓటర్ల నమోదుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి.

ముక్కోణపు పోటీలు తెలుగు రాజకీయాల్లో తక్కువే

ఉమ్మడి ఏపీలో రెడ్డి కాంగ్రెస్, ప్రజారాజ్యం తర్వాత మళ్లీ ఇప్పుడే

ముక్కోణపు పోరులో గెలిచేదెవరన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న

ప్రభుత్వ వ్యతిరేకతపై భిన్నమైన వాదనలు

బీఆర్ఎస్‌ను ఓడించి తీరాల్సిందేనన్న ప్రజాభిప్రాయం రాలేదన్న అంచనా

పుంజుకున్నట్టే కనిపిస్తున్నా తన మార్కు రాజకీయాలే కాంగ్రెస్ పుట్టి ముంచుతాయేమోననే ఆందోళన

కమలనాథుల వ్యూహం ఫలిస్తే సంచలనమే

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత మూడోసారి జరుగుతున్న ఎన్నికల ఫలితాలు మూడో తేదీనే రావడం.. అందునా ఈసారి ముక్కోణపు పోరు జరుగుతుండటం 'ప్రత్యేకత'ను సంతరించుకుంటోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుంచి చూసినా ముక్కోణ పోటీలు మనకు తక్కువే. 1978, 2009లలో మినహా మూడు పార్టీల మధ్య ఎన్నికల పోరాటం జరగలేదు. కాంగ్రెస్–జనతా పార్టీ, కాంగ్రెస్–కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్–తెలుగుదేశం పార్టీల మధ్యనే ఎన్నికల్లో పోటీ ఉండేది. అప్పుడో పార్టీ, ఇప్పుడో పార్టీ పోటీలోకి వచ్చినా ద్విముఖ పోటీలో చొరబడేంత స్థాయిలో ప్రభావం చూపకపోయేది. 1978లో మాత్రం ఇందిరా కాంగ్రెస్, రెడ్డి కాంగ్రెస్, జనతా పార్టీల మధ్య హోరాహోరీగా ముక్కోణపు పోటీ జరిగింది. నిరుపేద వర్గాలు అండగా నిలవడంతో ఆ ఎన్నికల్లో ఇందిరమ్మ పార్టీ సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఇక 2009లో ప్రజారాజ్యం పార్టీ మూడో పక్షంగా నిలబడి 18 శాతం ఓట్లను తెచ్చుకున్నది. తెలంగాణ ప్రాంతంలో అయితే అంతకంటే తక్కువే వచ్చాయి. సరిగ్గా అలాంటి ముక్కోణం పోటీ మళ్లీ ఇప్పుడు జరగబోతుందనే అంచనాలు వెలువడుతున్నాయి.

జంగ్ తెలంగాణ

తండ్రి కోసం కొడుకు త్యాగం

కొడుకు భవిష్యత్తు కోసం తండ్రి త్యాగం చేయడం కామన్... కానీ ఈసారి రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో తండ్రి కోసం కొడుకు త్యాగం చేయాల్సి వస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా రాజకీయాలు చేసే ఓ మాజీ ఎంపీ ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాలనుకున్నారు. రాజధాని నడిబొడ్డున ఉండే ఓ నియోజకవర్గాన్ని కూడా ఎంచుకున్నారు. అయితే, అక్కడ గత ఎన్నికల్లో ఆ మాజీ ఎంపీ కుమారుడు పోటీ చేశారు. ఇప్పుడు ఆ టికెట్ కోసమే తండ్రి, కొడుకులు దరఖాస్తు చేసుకున్నారు కూడా. అయితే, ఇద్దరిలో ఎవరికి అన్నప్పుడు పాపం కొడుకే తండ్రి కోసం త్యాగం చేసేందుకు సిద్ధమయ్యాడట. నువ్వు పోటీ చేస్తే నేనొద్దంటానా? అని తాను పోటీ నుంచి తప్పుకున్నాడంట. తండ్రి కోసం కొడుకు త్యాగం వృథా కాబోదనే అంచనాతోనే ఆయన పోటీ నుంచి విరమించుకున్నాడనే చర్చ జరుగుతోంది. తండ్రి గెలిచి పుసుక్కున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బలహీన వర్గాల కోటాలో తండ్రి మంత్రి అవుతాడనే నమ్మకంతోనే ఆయన విరమించుకున్నాడని, భవిష్యత్తు మీద గట్టి అంచనాతోనే స్వామికార్యం స్వకార్యం నెరవేర్చుకుంటున్నాడని గాంధీభవన్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

బంగారు కడియాలు తెచ్చా.. సార్



అసెంబ్లీ టికెట్ అంటే ఈ సీజన్‌లో మామూలు ముచ్చట కాదు. టికెట్ వస్తే చాలు... అది కూడా ప్రధాన పార్టీ టికెట్ అంటే హాట్ కేకే. టికెట్ వచ్చిందంటేనే సగం ఎమ్మెల్యే అయినంత హ్యాపీ. మరి ఆ టికెట్ ఇచ్చేవాళ్లను ఏదో రకంగా ప్రసన్నం చేసుకోవాలనుకునే వారు లేకుండా ఉంటారా? అలాంటి వారుంటేనే కదా టికెట్ల కేటాయింపు సీజన్‌లో మాల్‌మసాలా వార్తలు బయటకు వచ్చేది. ఏం జరిగినా జరగకపోయినా రాజకీయ నాయకులు తమ మీద పడిన బురద కడుక్కోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ప్రసన్నం చేసుకునే పాట్లలోనే ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మహిళా కాంగ్రెస్ ఆశావహురాలు కంగు తిన్నారట. తనకు టికెట్ కచ్చితంగా వస్తుందన్న అంచనాతోనే విదేశాల నుంచి తెచ్చిన రెండు బంగారు కడియాలను ఢిల్లీలోని ఓ పెద్ద నాయకుడికి ఇవ్వబోయారట. ఇదేంటమ్మా.. అంటే 'ఏదో నా తృప్తి సార్.. ఫలానా ఆయనకు ఇచ్చా.. ఇంకో ఆయనకు కూడా ఇచ్చాను'అంటూ ఇద్దరి ముగ్గురి పేర్లు చెప్పిందంట. అంతా విన్న ఆ ఢిల్లీ పెద్ద నాయకుడు 'ఇలాంటివి పెట్టుకోకమ్మా... నీ 'బంగారు'భవిష్యత్తుకు దెబ్బ పడుతుంది' అని చెప్పి పంపించేశాడట.

మూడు సీట్ల 'మహరాజ్'!

వామపక్షాలతో పొత్తు ఓ నాయకుడికి అరుదైన ఖ్యాతిని తెచ్చిపెట్టబోతోందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. వామపక్షాలు, కాంగ్రెస్ పొత్తు ఖరారైతే రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఓ నియోజకవర్గాన్ని పెద్ద కమ్యూనిస్టు పార్టీకి ఇవ్వాల్సి వస్తుందని, అప్పుడు అక్కడ ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేను పక్కనే ఉన్న మరో చోటకు పంపిస్తారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అలా పంపిస్తే మాత్రం ఆయన 'మూడు సీట్ల మహరాజ్'అనే కీర్తిని మూటగట్టుకోబోతున్నారనే టాక్ కూడా నడుస్తోంది. గతంలోనే పొరుగు జిల్లా నుంచి ప్రస్తుతమున్న సీట్లోకి వచ్చిన ఆయన ఇప్పుడు పొత్తు ముచ్చటలో మళ్లీ పక్కకు జరుగుతారని, అలా జరిగితే మాత్రం రికార్డేనని అంటున్నారు. గతంలో రెండు చోట్ల గెలిచిన ఆయన ఇక్కడ కూడా గెలిస్తే ఒకే పార్టీ తరఫున మూడు చోట్ల చట్టసభలకు ఎన్నికైన నేతగా జాతీయ స్థాయి గుర్తింపు దక్కించుకున్నా ఆశ్చర్యం లేదని గాంధీభవన్‌లో టాక్. మరి ఏమవుతుందో... ఆ మూడు సీట్ల మహరాజ్‌కు విజయమో... 'వీర'నిష్క్రమణమో... చూద్దాం.!



'మూడో' పార్టీనే కీలకమా?

ప్రజల 'మూడ్' ఏమిటో?

ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల నడుమ ఆసక్తికర పోటీ జరగనుంది. గత రెండు ఎన్నికల్లోనూ గట్టిగానే తలపడిన బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు తోడు ఈసారి బీజేపీ వచ్చిచేరింది. ఇప్పటికే పదేళ్ల అధికారంలో ఉన్నందున బీఆర్ఎస్‌పై ప్రజావ్యతిరేకత ఉందనేది ఒక అభిప్రాయం. అయితే ప్రభుత్వాన్ని ఓడించి తీరాలన్నంత వ్యతిరేకత మాత్రం కనిపించడం లేదన్నది క్షేత్రస్థాయి అంచనా. ఐదేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, కేసీఆర్ నాయకత్వం, రేసు గుర్రాల్లాంటి కేటీఆర్, హరీశ్‌రావుల ప్రచార తోడ్పాటు వెరసి ముచ్చటగా మూడోసారీ తామే అధికారంలోకి వస్తామని గులాబీ దళం గట్టిగా నమ్ముతోంది. ఇక కాంగ్రెస్ బలం పుంజుకుంటున్నట్లు కొందరు పరిశీలకులు అంచనా వేస్తుండగా ఆ పార్టీలోని వర్గ విభేదాలు, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన చరిత్ర, కేసీఆర్‌కు దీటైన నేత లేకపోవడం బలహీనతలుగా కనిపిస్తున్నాయి. కానీ బీఆర్ఎస్‌పై వ్యతిరేకత ఉపయోగపడుతుందని ఆ పార్టీ నేతలు ధీమాగా ఉన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా తమకు ఈసారి ప్రజలు పట్టం కడతారనే విశ్వాసంతో ముందుకెళుతున్నారు.

కొంతకాలం కింద బలపడినట్లు కనిపించిన బీజేపీ ఇప్పుడు బలహీనపడిందని, ప్రధాన పోటీదారు కాకపోవచ్చని సర్వే రాయుళ్లు చెబుతున్నారు. కానీ సంచలనాలకు మారుపేరైన బీజేపీ... తెలంగాణలో ఒక 'ప్రత్యేక'వ్యూహంతో 35 స్థానాలపై బలంగా గురిపెట్టబోతున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించే లక్ష్యంతో ఆ పార్టీ పావులు కదుపుతోంది. కమలనాథుల ప్రయత్నాలు సఫలమైతే కచ్చితంగా త్రిశంకు సభ (హంగ్) ఏర్పడుతుంది. అప్పుడు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ వరుసగా మూడు స్థానాల్లో ఉండవచ్చు. ఈ పరిస్థితి తెలంగాణలో ఆసక్తికర రాజకీయాలకు తెరతీయవచ్చు. కానీ చారిత్రకంగా స్పష్టమైన తీర్పులనే ఇచ్చే సంప్రదాయం తెలుగు ప్రజలకున్నది. ఈ నేపథ్యంలో ఈ మూడు పార్టీల్లో ప్రజలు ఎవరివైపు మొగ్గు చూపుతున్నారది ఇప్పుడు మిలియన్ డాలర్ల క్వశ్చన్. ఈ మూడు పార్టీలు పోను ఉభయ కమ్యూనిస్టులు, టీజేఎస్, వైఎస్సార్‌టీపీ, బీఎస్పీ లాంటి పార్టీలు తెచ్చుకొనే ఓట్లు చాలా తక్కువ చోట్ల అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేయొచ్చని అంచనా. నంబర్ గేమ్‌ను కొంచెం అటుఇటుగా మార్చవచ్చనే అంచనాలున్నా ఫైనల్‌గా బీజేపీ సాధించే ఓట్లు, సీట్లు ఎన్నికల తుది ఫలితాలను శాసించవచ్చన్నది రాజకీయ వర్గాల అభిప్రాయంగా కనిపిస్తోంది.

ఓట్ దిస్ పాయింట్

ఈ నెలాఖరు వరకు ఓటరు నమోదుకు అవకాశం

''దేవాన్ష్‌కు అక్టోబరు 15వ తేదీతో 18 ఏళ్లు నిండుతాయి. కానీ, ఓటు నమోదు ప్రక్రియ సెప్టెంబరులోనే ముగిసింది. దీంతో అతను ఓటేయాలంటే మరో ఐదేళ్లు ఆగాల్సిందేనా? అంటే అవసరం లేదని అంటోంది ఎన్నికల సంఘం.''సెప్టెంబరులో ఓటు దరఖాస్తు చేసుకోలేని వారందరికీ ఇంకా నమోదుకు అవకాశం ఉందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో నవంబర్ 30న శాసనసభ ఎన్నికలు జరగనుండగా ఓటరు నమోదుకు అక్టోబరు 31వరకు మరో అవకాశం చేసుకునే వెసులుబాటు కల్పించింది.

తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు

ఓటరుగా నమోదు కావాలనుకునేవారు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఫారం-6 తీసుకుని అందులో వివరాలను పొందుపరిచి అక్కడే కార్యాలయంలో సమర్పించాలి. ఆధార్ కార్డు, ఇంటి చిరునామాను సూచించే కరెంట్ బిల్లు, ఇతరత్రా ఏదేనీ ఆధారాన్ని జత చేయాల్సి ఉంటుంది. బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విచారించి ఓటరుగా నమోదు చేస్తారు.

ఓటరు నమోదుకు వివిధ మార్గాలు

క్యాంపెయిన్‌కు వెళ్లలేనివారు అరచేతిలోనే ఓటరుగా నమోదు కావచ్చు. http:///voters.eci.gov.in (హెచ్‌టీటీపీ://వీవోటీఈఆర్ఎస్.ఈసీఐ.జీవోవీ.ఐఎన్) వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో మొబైల్ నంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

యాప్‌తో కూడా

బీఎల్వో వద్దకు వెళ్లలేని వారు.. వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా.. లేదా చూసుకునే అవకాశం కూడా కల్పించారు.

– సాక్షిప్రతినిధి, కరీంనగర్



అప్పటి ఓటు.. ఇంకా గుర్తుంది

నాకు ఓటు వచ్చే సరికి 40 ఏళ్లు. ఇప్పుడు 110 ఏళ్ల వరకు ఉంటాయనుకుంటా. అప్పుడు ఎండాకాలం. ఊరోళ్లమంతా నడుచుకుంటూ వెళ్లి ఓటు వేసినం. ఇంకా నాకు గుర్తుంది. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో ఓటు తప్పకుండా వేస్తున్న.

- జరుపాటి రాములమ్మ, లక్ష్మాపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా

తొలి ఓటర్లు 52,02,214

సాయుధ తెలంగాణకు ఓటు ఆయుధమై..

శ్రీగిరి విజయ్‌కుమార్‌రెడ్డి

అది 1952 మార్చి 27... కాలినడకన కొందరు, ఎడ్ల బండ్లపై మరికొందరు సుదూరాన ఉన్న పోలింగ్ బూత్‌లకు ఒకరెనక ఒకరు వెళ్లి తమ ఓటుతో తొట్టతొలి ఎంపీ, ఎమ్మెల్యేలను ఎన్నుకున్న రోజు. సుమారు 224 ఏళ్ల అసఫ్‌జాహీల రాచరికం, ఆపై నాలుగేళ్ల సైనిక పాలన అనంతరం హైదరాబాద్ రాష్ట్రంలో ఓటు వేసేందుకు జనం వస్తారో లేదోనన్న అధికారుల అనుమానాలను పటాపంచలు చేస్తూ తొలి ఎన్నికలోనే జనచైతన్యం ఓటెత్తింది. అప్పటివరకు తుపాకుల నీడలో అభద్రత, భయం నీడలో తలదాచుకున్న వారంతా ఊరూరా కదిలి మొత్తంగా 52,02,214 మంది ఓటు వేయడంతో అధికార యంత్రాంగం సంబురపడింది. నాటి ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా లక్ష్మాపూర్‌కు చెందిన జరుపాటి రాములమ్మ (110) తొలి ఓటు వేసి తమకు స్వాతంత్ర్యం రావడం నిజమేనని నమ్మినట్టు పేర్కొంది.

1952 తొట్టతొలి సాధారణ ఎన్నికల్లో ఓటెత్తిన తెలంగాణ చైతన్యం

మరాఠీ, కన్నడ ప్రాంతాల్లో కాంగ్రెస్, తెలంగాణలో విపక్షాల విజయం

నాటి శాసనసభలోకి పోరాట యోధులు, విద్యావంతులు



బూర్గుల రామకృష్ణారావు కేబినెట్

మిశ్రమ ఫలితాలు...

నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థులు విజయం సాధించగా సత్యాగ్రహ పోరాటాలు జరిగిన హైదరాబాద్, ఔరంగాబాద్, గుల్బర్గా డివిజన్లలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. మొత్తంగా తెలుగు ప్రజలు ప్రభావం చూపే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ 44 స్థానాలు, పీడీఎఫ్ 35 స్థానాల్లో, సోషలిస్టు పార్టీ 11 చోట్ల, మరో 10 చోట్ల స్వతంత్రులు విజయం సాధించారు. బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ (ఎస్‌సీఎఫ్) 5 చోట్ల గెలవగా అందులో తెలంగాణలోని ద్విసభ నియోజకవర్గాలైన జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్ స్థానాలను కైవసం చేసుకుంది. అంటే మొత్తంగా తెలుగు మాట్లాడే ప్రాంతాల్లోని ఓటర్లు 66 స్థానాల్లో కాంగ్రెసేతర అభ్యర్థులను గెలిపించారు.

తొలి సభలో అత్యధికం విద్యావంతులే..

హైదరాబాద్ తొలి శాసనసభకు ఉన్నత విద్యావంతులే అత్యధికంగా ఎన్నికైయ్యారు. బ్రిటన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదివిన మాసూమాబేగం శాలీబండ స్థానం నుంచి ప్రముఖ కవి ముగ్దూం మొహియొద్దీన్‌ను ఓడించారు. 1927లో ఉస్మానియాలో గోల్డ్ మెడల్ సాధించిన డాక్టర్ జీఎస్ మెల్కొటే ముషీరాబాద్ నుంచి విజయం సాధించారు. చాదర్‌ఘాట్ నుంచి జస్టిస్ గోపాలరావు ఎక్బోటే, సోమాజిగూడ నుంచి మెహిది నవాజ్ జంగ్, వనపర్తి నుంచి సురవరం ప్రతాపరెడ్డి, షాద్‌నగర్ నుంచి బూర్గుల రామకృష్ణారావు, వికారాబాద్ నుంచి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, బేగంబజార్ నుంచి కాశీనాథ్ వైద్య గెలుపొందారు.

అజ్ఞాతం నుంచి చట్ట సభకు..

తొలుత నిజాం, ఆపై భారత సైన్యంపై తుపాకులు ఎక్కుపెట్టిన కమ్యూనిస్టు పార్టీల నాయకులు అనేక మంది అజ్ఞాతం వీడిన అనంతరం అసెంబ్లీకి ఎన్నికయ్యారు. భువనగిరి అసెంబ్లీ నుంచి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన రావి నారాయణరెడ్డి జైలు నుంచే నామినేషన్ వేసి స్వయానా తన బావమరిది భూదాన్ రామచంద్రారెడ్డిపై విజయం సాధించారు.

ఓటు వేయకపోవడం చనిపోవడంతో సమానం..



నాకిప్పుడు 103 ఏళ్లు. తొలి ఎన్నికలప్పుడు మా ఊర్లో దప్పు చాటింపు వేసి ఓటు వేసేందుకు పిలుచుకొనిపోయిండ్రు. అప్పటి నుంచి ఓటు తప్పకుండా వేస్తున్న. ఓటు వేయకపోతే చనిపోవడంతో సమానమని నమ్ముత. వచ్చే ఎన్నికల్లోనూ ఓటు వేస్త.

- మల్లుం బాలవ్వ, చిట్యాల, కామారెడ్డి

గత 70 ఏళ్లలో ఓటు తప్పలేదు..



నాకిప్పుడు 98 ఏళ్లు. రజాకార్ల బాధలు ప్రత్యక్షంగా చూసినం. వారిపై తిరగబడినం. స్వతంత్రం వచ్చినంక తొలి ఎన్నికలో ఓటు వేసేందుకు ఎడ్లబండిలో పోయినం. 1952 ఎన్నికల నుంచి ప్రతిసారీ ఓటు వేస్తూనే ఉన్న...

- చల్లారం మధురవ్వ, తిమ్మాయపల్లి, సిద్దిపేట

హైదరాబాద్ స్టేట్ 1952 తొలి ఎన్నికల్లో పార్టీల బలాబలాలు

మొత్తం స్థానాలు: 175 (33 ద్విసభ స్థానాలు కలుపుకొని)

పార్టీ	కాంగ్రెస్	పీడీఎఫ్	స్వతంత్రులు	'పెసెంట్స్ అండ్ వర్కర్స్'	ఎస్పీ	ఎస్సీఎఫ్
పోటీ	173	77	136	21	97	24
విజయం	93	42	14	10	11	5

మేనిఫెస్టో ప్రిపరేషన్..

చాట్ జీపీటీతో చాటింగ్!

ఎన్నికల నగారా మోగింది.

అన్ని పార్టీలూ సన్నాహాలు మొదలుపెట్టాయి.

రేపోమాపో మేనిఫెస్టో ప్రకటించేసి ఇంకా ఇంకా ఓటర్లను ఆకర్షించాలంటే ఏం చేయాలి?

చాట్ జీపీటీ ఇప్పుడు కొత్తగా వచ్చింది కదా. దాని మెమొరీలో ఇప్పటివరకూ వచ్చిన పథకాల వివరాలుంటాయి. దాంతో పని ఈజీ అవుతుందేమో?

గత పథకాల రెసిపీలు ఆల్రెడీ ఉన్నాయ్ కాబట్టి... చాట్ తిని మూతి తుడుచుకునేలోపు, చాట్ మసాలా అంతటి టేస్టీ టేస్టీ పథకాలు రెడీ చేస్తుందేమో, కొత్త కొత్త ఆకర్షణీయమైన పథకాలు వేడివేడిగా రెడీ చేస్తుందేమో అనిపించి... రోబో చిట్టీతో చాటింగ్ మొదలుపెట్టారు ఓ పార్టీవారు. అడగడం అడగడమే పథకాల పేర్లు లొపెల్మంటూ ఆకట్టుకునేలా ఉండాలి. ఆల్రెడీ తెలిసిన, అందరిలో నలిగిన పేర్లయితే బాగుంటుందేమో... జనాల్లోకి ఈజీగా వెళుతుందని కూడా ఓ డైరెక్షనిచ్చేశారు. అంతేకాదు... అది సక్సెస్ అయి తీరాలి. అందుకే గతంలో సక్సెస్ ఫార్ములా ట్రాక్ రికార్డులున్నవాటిని పరిశీలించి మరీ కొత్తవి సజెస్ట్ చేయమనీ అడిగారు.



విత్ ఇన్ ఫ్రాక్షన్ ఆఫ్ సెకండ్స్ అదీ ఆన్సర్లు ఇవ్వడం మొదలుపెట్టింది.

చాట్ జీపీటీ అటాచ్ అయి ఉన్న చిట్టీ రోబో సజెషన్స్ ఇవి...

ఉదాహరణకు...

మీ ఇంట పుట్టిన బుజ్జిపాపాయిలూ, చిన్నారులకు చెందేలా ఓ పథకం ఉండాలి. అది వాళ్ల కేరింతలు కొట్టేలా, పులకింతలు పెట్టేలాంటి పథకం అనుకోండి..అప్పుడు దాని పేరు 'కేరింత లక్ష్మి','పులకింత లక్ష్మి'.

మరి ఇచ్చేది బుజ్జాయిలకు కదా అనిపిస్తే 'బుజ్జాయి బంధు' అనే పేరు బెటర్.

అన్నింటికీ లక్ష్మి అయితే రొటీన్‌గా ఉంటుంది. 'లక్ష్మి' అన్నా 'శ్రీ' అన్నా ఒకటే కాబట్టి... కొన్నింటికి చివర్న 'శ్రీ' వస్తే ఇంకా బెటర్. దీనంత హిట్ అయ్యేదీ, గతంలో అయ్యిందీ ఇప్పటివరకు వేరేదేదీ లేదు. ఉదాహరణకు పంచదార ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దాని బదులు ప్రతి కుటుంబానికీ బెల్లం పంపిణీ చేద్దామని మన ప్రపోజల్ అనుకోండి. 'బెల్లం శ్రీ'. అదే కొర్రలింకా ఆరోగ్యం కాబట్టి... దాని పేరు 'కొర్రశ్రీ'. ఈ లెక్కన జొన్నశ్రీ, సజ్జశ్రీ... అంటూ 'సిరి' ధాన్యాలన్నీ పంపిణీ చేయాలన్న మంచి మంచి పేర్లు పెట్టొచ్చు. అలాగే 'బొబ్బశ్రీ'... అంటుండగా చిట్టిని ఆపరేట్ చేస్తున్న ఇంజనీర్ కాస్త కన్ఫ్యూజ్ అయ్యాడు. ఇదేదో ప్రమాదంలో బొబ్బలెక్కినట్టుగా కాస్త నెగెటివ్‌గా ఉందే అని డౌటొచ్చి...

'ఇదేమిటిదీ... ఈ బొబ్బశ్రీ ఏమిటీ'? అని అడిగాడు.

''అదేనండీ మీరు బొబ్బర్ల పంపిణీకి పెట్టుకోవాల్సిన పేరిదీ!''

చాట్ జీపీటీతో చాటింగ్ ఆపేస్తూ...

'అన్నట్టు... నీ పేర్లో 'జీపీటీ'అంటే ఏమిటో తెల్సా'?

'తెలుసు... జనరేటివ్ ప్రీ-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్' అన్నాడు చిట్టి.

కాదురా బాబూ...

'జీ'... గంపెడంత ఆశతో
'పీ'... ప్రశ్నించడమేనా
'టీ'... తప్పు?''

ఆ నాలుగు రోజులే!

నవంబర్ 3, 4, 8, 9 తేదీలు భేషుగ్గా ఉన్నాయంటున్న పండితులు

అప్పుడే నామినేషన్ల ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్న నేతలు

ఎన్నికల షెడ్యూల్ వెలువడి రెండు రోజులు గడిచాయో లేదో, చాలా మంది ఆశావహులు నామినేషన్ల మీద దృష్టి సారించేశారు. నమ్మకమైన పండితులను సంప్రదించి ఏ రోజు నామినేషన్ వేస్తే బాగుంటుందో వాకబు చేసేస్తున్నారు. వచ్చే నెల 3 నుంచి 10వతేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఈ ఎనిమిది రోజుల్లో నాలుగు రోజులు తిథి, నక్షత్ర బలం రీత్యా కీలకంగా ఉన్నాయి. ఆ నాలుగు రోజుల్లోనే ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉందని పండితులు పేర్కొంటున్నారు. ఇక కొందరు నామ బలం రీత్యా ఇతర రోజుల్లో నామినేషన్లు వేసే అవకాశం ఉన్నా, ఎక్కువ మంది మాత్రం ఆ నాలుగు రోజుల్లోనే వేస్తారని అంచనా వేస్తున్నారు. -సాక్షి, హైదరాబాద్

మొదటి స్థానంలో..

NOVEMBER 9

ఉత్తర నక్షత్రంతో కూడిన గురువారం ఆ రోజు. విష్ణు తిథిగా పేర్కొనే ఏకాదశి. ఆరోజు ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా నామినేషన్ దాఖలు చేయనున్నారని పార్టీ వర్గాలు ప్రకటించాయి. ఇది నామినేషన్ల ఘట్టం ముగియటానికి సరిగ్గా ముందు రోజు కావటం విశేషం.

రెండో స్థానంలో

NOVEMBER 8

పుబ్బ నక్షత్రంతో కూడిన బుధవారం. దశమి తిథి. ఆరోజు గురు, కుజ బలం బాగా ఉన్న రోజుగా పంచాంగం చెబుతోంది. ధన బలం కూడా మెండుగా ఉండే రోజుగా పండితులు పేర్కొంటున్నారు. ఆ రోజు నామినేషన్ వేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతారని చెబుతున్నారు.

మూడో స్థానంలో

NOVEMBER 3

శ్రీరామ చంద్రుల వారి నక్షత్రం అయిన పునర్వసు ఉన్న శుక్రవారం రోజు కావటంతో ఈ రోజుకు ప్రాధాన్యం ఉందని పండితులు పేర్కొంటున్నారు. నామినేషన్ల పర్వం తొలిరోజు అయిన మూడో తేదీన ముస్లిం మైనారిటీలు కూడా ఆసక్తి చూపే అవకాశం ఉంది. వారు పవిత్రంగా భావించే శుక్రవారం కావటమే దీనికి కారణం.



నాలుగో స్థానంలో

NOVEMBER 4

సప్తమి తిథితో కూడిన శనివారం. ఆ రోజు పునర్వసు-పుష్యమి నక్షత్రాలు ఆ రోజుపై ప్రభావం చూపుతున్నాయి. ఇలా ఈ రెండు తిథులు కలిసి ఉండటం మహారాజయోగంగా భావిస్తారు. ఈ నాలుగు రోజుల్లో ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేస్తారని, ఇప్పటికే నేతలు ఈమేరకు వివరాలు తెలుసుకుని ఖాయం చేసుకున్నారని ప్రముఖ జ్యోతిష పండితులు కిరణ్ శర్మ చెబుతున్నారు.

మంగళవారానికే వారి మొగ్గు..

మంగళవారం మంగళకరమైన రోజుగా భావించి ఆ రోజే పనులు చేపట్టేందుకు మొగ్గుచూపేవారూ ఉన్నారు. ఆ కోవలో కొందరు రాజకీయ నేతలు మంగళవారం రోజే నామినేషన్లు వేస్తారు. ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఇద్దరు మంత్రులు, వికారాబాద్ జిల్లాకు చెందిన ఓ నేత, ధనిక వర్గాలు ఎక్కువగా ఉండే ఓ నియోజకవర్గానికి చెందిన నేత, బీజేపీ కీలక నేత ఒకరు, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన ఓ సీనియర్ నేత ఇలా కొందరు ఈరోజుకు ప్రాధాన్యం ఇస్తారు.

అప్పుడే పరిహారాలకు కూడా ఏర్పాట్లు..

రాజకీయ భవిష్యత్‌ను ఓటర్లు ఎలా నిర్ణయించే అవకాశం ఉందో చెప్పమని నేతలు పండితుల వద్ద క్యూ కడుతున్నారు. పుట్టిన తేదీ, వారి నక్షత్రం.. ఇలా గోచార బలాన్ని తెలుసుకుంటున్నారు. సిటీకి చెందిన ఓ మంత్రికి ఈసారి అనుకూల యోగం లేదన్న సమాచారంతో వారి కుటుంబం పరిహార పూజలు ప్రారంభించిందట. ఇక బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఓనేత తరఫున ఆయన భార్య పూజల్లో నిమగ్నమయ్యారట.

"మా స్టీరింగ్ మా చేతుల్లోనే ఉంది"
కారు గుర్తు కేటీఆర్ మాట ఇది.

"డ్రైవింగ్ ఎవరు చేస్తుంటే, స్టీరింగ్ వాళ్ల చేతుల్లోనే ఉంటది? ఇందులో ఆశ్చర్యం ఏముంది?"కామన్‌మేన్ సందేహం.

Q A
కోట్స్ & ఎటాక్స్

"అభివృద్ధికి అరడజన్ సూత్రాలు చాలు..
అంటే, ఆరు గ్యారంటీలు చాలు"కాంగ్రెస్

"అరడజన్ సీఎంలలో అందరూ ఎలిజిబుల్స్... ఈ బుల్స్ మధ్య రేపు బుల్‌ఫైట్ జరిగి... రాష్ట్రం రాష్ట్రమంతా 'బుల్ ఇన్ చైనా షాప్'కాదని గ్యారంటీ ఏమిటీ"... మళ్లీ కామన్‌మేన్ సంశయం.

అందోల్‌లో గెలిస్తే..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా అందోల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ సెంటిమెంట్ ఉంది. 1989 నుంచి ఆ సెంటిమెంట్ కొనసాగడం గమనార్హం. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఈ స్థానం నుంచి ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తే.. అదే పార్టీ రాష్ట్రంలోనూ అధికారాన్ని అందుకోవడం ఆనవాయితీగా మారింది. 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున సినీనటుడు బాబూమోహన్ గెలుపొందారు. ఈ రెండు పర్యాయాలు రాష్ట్రంలోనూ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది.

- 2009, 2004 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ వరుస విజయాలు సాధించారు. ఈ రెండు పర్యాయాలు కూడా మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకుంది. దామోదరకు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా దక్కడం గమనార్హం.
- 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బాబూమోహన్ విజయం సాధించారు. అప్పుడు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి మాల్యాల రాజయ్య విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రంలోనూ టీడీపీ అధికారంలోకి వచ్చింది. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దామోదర గెలుపొందగా, అప్పట్లో కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకుంది. 1984 ఎనికల్లో టీడీపీ తరఫున అల్‌దేకర్ లక్ష్మణ్ విజయం సాధించారు. అప్పుడు కూడా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చింది. కొన్ని దశాబ్దాలుగా ఈ సెంటిమెంట్ కొనసాగుతూ వస్తోంది. ఈసారి ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ ఎంతమేరకు పనిచేస్తుంది. ఇక్కడ గెలిచిన అభ్యర్థి పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందా..? అనేది ఎన్నికల ఫలితాల తర్వాత తేలుతుంది.
- అందోల్ అసెంబ్లీ నియోజకవర్గం 1957లో ఏర్పడింది. తొలి రెండు పర్యాయాలు జనరల్ స్థానంగా ఉండేది. 1967లో ఎస్సీ రిజర్వుడ్‌గా మారింది. ఈ నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ ఎనిమిదిసార్లు, టీడీపీ నాలుగుసార్లు గెలిచింది. ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక టీఆర్ఎస్ రెండుసార్లు గెలుపొందింది.



కులగణన దేశానికి ఎక్స్‌రే

కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్న రాహుల్

బియోహరి: కులగణన దేశానికి ఎక్స్‌రే తీయడం లాంటిదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఇది చేపట్టడం వల్ల దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీల వాస్తవ పరిస్థితులు తెలుసుకోవచ్చునని అన్నారు. ఏది ఏమైనా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టేలా కాంగ్రెస్ ఒత్తిడి తీసుకువస్తుందన్నారు. మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లా బియోహరిలో మంగళవారం జరిగిన ఎన్నికల సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. ''మన దేశంలో కులగణన చేపట్టడం అత్యవసరం.



షాదోల్ జిల్లాలో ప్రచార సభలో రాహుల్, మధ్యప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్

గాయాలపాలై ఉన్న ఆదివాసీలు, దళితులు, ఓబీసీలు ఎలా ఉన్నారో తెలుసుకోవాలని కులగణన చేయాలి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం. రాజస్తాన్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు కులగణన ప్రక్రియను మొదలు పెట్టాయి'' అని రాహుల్ చెప్పారు. దళితులు, ఆదివాసీలు తమ హక్కుల్ని పొందడానికే ఈ కులగణన అవసరమని వ్యాఖ్యానించారు. కులగణనపై మాట్లాడకుండా ప్రధాని మోదీ తప్పించుకుంటున్నారని, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌ల గురించి మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని నడిపించే, బడ్జెట్‌ను నియంత్రించే 90 మంది ఉన్నత స్థాయి అధికారుల్లో ముగ్గురు మాత్రమే ఓబీసీ కేటగిరీకి చెందిన వారని రాహుల్ వెల్లడించారు. ఓబీసీలు నిర్ణయాత్మక పదవుల్లో లేకపోవడం వల్లే వారిలో నిరుద్యోగం అధికంగా ఉందన్నారు. ఆరెస్సెస్, బీజేపీలకు మధ్యప్రదేశ్ ఒక ల్యాబొరేటరీ వంటిదని, ఈ విషయాన్ని ఆ పార్టీ అగ్రనాయకుడు ఎల్.కె అద్వానీయే తాను రాసిన ఒక పుస్తకంలో వెల్లడించారని అన్నారు.

అందరిదీ ఉచిత జపమే!

మధ్యప్రదేశ్‌లో పార్టీలన్నింటిదీ అదే దారి | ఎలాగైనా ఓటర్లను ఆకట్టుకునేందుకు పాట్లు

దేశానికి హృదయ స్థానమైన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పోరు ఉచితాల జాతరను తలపిస్తోంది. ప్రజలకు ఉచిత పథకాలు ప్రకటించడంలో ప్రధాన పార్టీలైన అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్ రెండూ నువ్వా నేనా అన్నట్టుగా పోటాపోటీగా దూసుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓటరు ఎవరిని 'సముచిత'ంగా ఆదరిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది...

మధ్యప్రదేశ్‌లో దీర్ఘకాలంగా బీజేపీ, కాంగ్రెస్ ద్విముఖ పోరు కొనసాగుతూ వస్తోంది. ఈసారి బీఎస్పీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా బరిలో ఉన్నా ప్రధాన పోరు మాత్రం మళ్లీ ఆ రెండింటి మధ్యేనని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయం కోసం సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (64), పీసీసీ చీఫ్ కమల్‌నాథ్ (76) సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. ముఖ్యంగా దక్షిణాదిన తాము అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం కర్ణాటక కాంగ్రెస్‌కు చేజారిన అనంతరం జరుగుతున్న కీలక అసెంబ్లీ ఎన్నిక కావడంతో దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కేంద్ర మంత్రులతో పాటు పలువురు సీనియర్ ఎంపీలను కూడా ఇప్పటికే అసెంబ్లీ బరిలో దింపింది. తద్వారా మధ్యప్రదేశ్‌లో విజయం తనకెంత ముఖ్యమో చెప్పకనే చెప్పింది. వీటన్నింటికీ మోదీ చరిష్మా తోడై ఈసారి కూడా గట్టెక్కిస్తుందని ఆశిస్తోంది. 'ఎంపీ కే మన్ మే మోదీ...'నినాదంతో ఊరూవాడా హోరెత్తిస్తోంది. అంతేగాక సీనియర్లలో విభేదాలు తలెత్తకుండా, ప్రభుత్వ వ్యతిరేకత నేరుగా పార్టీ విజయావకాశాలపై పడకుండా చూసేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే చౌహాన్‌ను సీఎం అభ్యర్థిగా కూడా ప్రచారం చేయకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. నిన్నటితరం బీజేపీ దిగ్గజాలైన ఎల్‌కే అద్వానీ కాలానికి చెందిన నేటికీ బీజేపీలో చురుగ్గా ఉన్నది బహుశా ఆయనొక్కరే. ఇక కాంగ్రెస్ కూడా వర్గాలవారీగా ఓట్ల వేటలో పడింది. దళితుడైన పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే 35 ఎస్సీ స్థానాలపై లోతుగా దృష్టి సారించినట్టు సమాచారం.

బీజేపీ..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గట్టి పోటీ ఇచ్చిన నేపథ్యంలో ఈసారి ఏ చిన్న అవకాశాన్నీ వదలకూడదన్న అభిప్రాయంలో బీజేపీ ఉంది. అందుకే గిరిజన, ఓబీసీ, మహిళా... ఇలా ఓటర్లను సెగ్మెంట్లవారీగా విభజించుకుని మరీ లోతుగా దృష్టి పెడుతోంది. వీటికి తోడుగా హిందుత్వ కార్డు ఎలాగూ అండగా ఉంటుందని ఆశిస్తోంది. సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రధానంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని పలు ఉచిత పథకాలు ప్రకటించారు.

- లాడ్లీ బెహనా యోజన కింద రాష్ట్రంలోని 1.32 కోట్ల మహిళలకు అందుతున్న నెలవారీ ఆర్థికసాయాన్ని ఏకంగా రూ.3,000కు పెంచుతామని పేర్కొన్నారు.
- గత జూన్‌లో ఈ పథకాన్ని మొదలు పెట్టినప్పుడు ఈ సాయం తొలుత రూ.1,000 ఉండగా రూ.1,250కి, తర్వాత రూ.1,500కు పెంచారు. ఆర్థికంగా వెనకబడ్డ మహిళలకు ఉద్దేశించిన ఈ పథకంపై సర్కారు ఇప్పటికే ఏకంగా ఏటా రూ.16,000 కోట్లు వెచ్చిస్తోంది.
- రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ప్రకటించారు.

కాంగ్రెస్..

పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ కూడా వరుసబెట్టి ఇప్పటికే పలు ఉచిత పథకాలు ప్రకటించారు. ఓబీసీ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- మహిళలకు నారీ సమ్మాన్ నిధి'పేరుతో నెలకు రూ.1,500 అందజేస్తామని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ప్రకటించారు.
- ప్రతి ఇంటికీ రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందజేస్తామని పేర్కొన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ పథకాన్ని తిరిగి తెస్తామని ప్రకటించారు.
- రాష్ట్రంలో ఏకంగా 45 శాతమున్న ఓబీసీలకు రిజర్వేషన్లను 14 శాతం నుంచి 27 శాతానికి పెంచుతామని కమల్‌నాథ్ ప్రకటించారు. ఆయన సీఎంగా ఉండగా ఈ మేరకు నిర్ణయం తీసుకోగా కోర్టు దాన్ని కొట్టేసింది.
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని కూడా ప్రకటించారు.

ప్రచారంలో పెద్దలు...

రాష్ట్రంలో ఎన్నికల ప్రచార బరిలో అన్ని పార్టీల నుంచీ అగ్రనేతలు ఇప్పటికే బరిలో దిగారు. బీజేపీ నుంచి ప్రధానిమోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా సుడిగాలి పర్యటనలు చేయనున్నారు.

- కాంగ్రెస్ ప్రచార భారాన్ని ఖర్గేతో పాటు రాహుల్, ప్రియాంక మోస్తున్నారు. కమల్‌నాథ్‌కు దన్నుగా వెటరన్ నేత దిగ్విజయ్ సింగ్ నిలుస్తున్నారు.
- ఆప్ నుంచి కేజ్రీవాల్, భగవంత్ మాన్ మరిన్ని సభలూ, సమావేశాలకు ప్లాన్ చేస్తున్నారు.



పార్టీల భక్తి బాట...

- ఓట్ల వేటలో భాగంగా మధ్యప్రదేశ్‌లో బీజేపీతో పాటు కాంగ్రెస్ కూడా ఈసారి భక్తి బాట పట్టడం విశేషం.
- ఆలయాల పునర్నిర్మాణం, సుందరీకరణపై చౌహాన్ పెద్ద ఎత్తున దృష్టి పెట్టారు. ఇందుకు రూ.3,000 కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రఖ్యాత ఉజ్జయినీ మహాకాళేశ్వర మందిరాన్ని, దాని అనుబంధ మ్యూజియాలను మెరుగు పరుస్తున్నారు.
- ఖాండ్వా జిల్లాలోని ప్రఖ్యాత ఓంకారేశ్వర్‌లో 108 అడుగులతో ఆది శంకరుల విగ్రహాన్ని ఇటీవలే ఆవిష్కరించారు.
- కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ కూడా ఇటీవల జబల్‌పూర్‌లో నర్మదా నదిలో పాల్గొన్నారు. జై నర్మద, జై బజరంగబలి అంటూ నినాదాలతో ఆకట్టుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ కూడా పలు మతపరమైన కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

ఆప్, బీఎస్పీ కూడా...

ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ కూడా ఈసారి బలంగా ఉనికి చాటుకునే ప్రయత్నంలో ఉన్నాయి. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే ఆ పార్టీ పాలిత పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌తో కలిసి రాష్ట్రంలో నాలుగుసార్లు పర్యటించారు. ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించారు.

- ఉచిత విద్య, వైద్యం, కరెంటు అందిస్తామని ఆప్ ప్రకటించింది.

బీజేపీ ఐఏఎస్

బ్యూరోక్రసీ టూ పాలిటిక్స్

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వేళ బీజేపీలో బ్యూరోక్రాట్ల ప్రభ వెలిగిపోతోంది. మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొందరు, ఉన్న పదవుల్ని వదులుకొని మరికొందరు కొద్ది నెలలుగా కాషాయం కండువా కప్పుకుంటున్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఈ ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. పార్టీలో పట్టున్న నాయకుల్ని కూడా కాదనుకొని కమలనాథులు బ్యూరోక్రాట్లకు టికెట్‌లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.

త్రిమూర్తులకు టికెట్లు

- రాజస్తాన్ అసెంబ్లీలో బస్సి నియోజకవర్గం నుంచి 1980 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి చంద్రమోహన్ మీనాను బీజేపీ ఎన్నికల బరిలోకి దింపింది. గత జూన్‌లో పార్టీలో చేరిన మీనాకు టికెట్ ఇస్తున్నారన్న ప్రచారం మొదలవగానే నియోజకవర్గానికి చెందిన కీలక నాయకులు ఢిల్లీకి వెళ్లి పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దగ్గర తమ అసంతృప్తి ప్రకటించినా బీజేపీ పెద్దలు మీనా వైపే మొగ్గుచూపించారు.
- ఛత్తీస్‌గఢ్‌లో రాయగఢ్ నియోజకవర్గం నుంచి యువతరానికి ప్రతినిధిగా నిలిచే మాజీ ఐఏఎస్ అధికారి ఒ.పి. చౌధరి పోటీకి దిగారు. 2005 బ్యాచ్‌కు చెందిన చౌధరి గత కొన్నేళ్లుగా బీజేపీలో మంచి పాపులారిటీ సంపాదించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- ఛత్తీస్‌గఢ్‌లో నీల్‌కాంత్ టికమ్ ఆగస్టులో ఐఏఎస్‌గా రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సారి కేష్‌కల్ నియోజకవర్గం నుంచి ఆయనకు టిక్కెట్ దక్కింది. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండే బస్తర్ జిల్లాకు చెందిన అధికారి అయి న నీల్‌కాంత్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకి సేవ చేయకుండా తన చేతులు కట్టేసిందని ఆరోపించారు.




ఛత్తీస్‌గఢ్‌లో ప్రచారం చేస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి నీల్‌కాంత్ (ఫైల్)

ఎందుకీ ప్రాధాన్యం ?

పరిపాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టైలే వేరు. ప్రభుత్వానికి కార్పొరేట్ కలర్ ఇవ్వడానికి ఆయన నిరంతరం తాపత్రయపడుతుంటారు. ఇందుకోసం ఆయన ఎన్నుకున్న మార్గం మాజీ ఐఏఎస్ అధికారుల్ని పార్టీ గూటిలోకి చేర్చుకోవడం. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు కూడా మోదీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై అచంచల విశ్వాసం కలిగి ఉండేవారు. గత ఏప్రిల్‌లో జరిగిన సివిల్స్ సర్వీస్ డేలో బ్యూరోక్రాట్లు మార్పుకి ఏజెంట్లు అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. సమర్థుడైన అధికారి లేకుండా రాజకీయ పార్టీకి కూడా గుర్తింపు ఉండదని బలంగా నమ్మే ప్రధాని మోదీ ఐఏఎస్‌లను అక్కున చేర్చుకుంటున్నారు. కార్పొరేట్ స్టైల్‌లో పని చేయడం వ్యవస్థలో ప్రతీ ఒక్కరిని జవాబుదారీగా చేయడమే లక్ష్యంగా ఉన్న మోదీ ఐఏఎస్‌లను అధిక సంఖ్యలో చేర్చుకుంటున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇప్పటికే కేంద్రంలో అత్యంత కీలకమైన రైల్వే, విదేశీ వ్యవహారాలు, పెట్రోలియం శాఖలకు మంత్రులైన అశ్విని వైష్ణవ్, జై శంకర్, హర్‌దీప్ పూరి ఐఏఎస్ అధికారులుగా పనిచేసిన అనుభవంతోనే రాజకీయాల్లో రాణిస్తున్నారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా బ్యూరోక్రాట్ల తెలివితేటలు, సమర్థతని పార్టీ ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలన్న వ్యూహంతో ప్రధాని మోదీ అడుగులు వేస్తున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

మూడు రాష్ట్రాల్లో 'ఆప్' పోటీ: కేజ్రీవాల్



న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు. మూడు రాష్ట్రాల్లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను రంగంలోకి దించుతామని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని ఆప్ సీనియర్ నేత సందీప్ పాఠక్ పేర్కొన్నారు. మూడు రాష్ట్రాల్లో ప్రజలు వేర్వేరు పార్టీలకు అవకాశం ఇచ్చారని, ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాలన్న ఆలోచనలో ఉన్నారని ఉద్ఘాటించారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల ఎజెండాలో విద్య, వైద్యం, విద్యుత్, నీటి సరఫరా వంటి కీలక అంశాలకు స్థానం లేకుండాపోవడం దారుణమని విమర్శించారు.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 11 । అక్టోబర్ । 2023

15 నుంచి కేసీఆర్ పర్యటన

- ఉమ్మడి జిల్లా హుస్నాబాద్ నుంచి ప్రచారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ విడుదలవటంతో పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. సిరిసిల్ల, మంథని, పెద్దపల్లి, హుస్నాబాద్, కోరుట్ల, పెద్దపల్లి నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే ఎన్నికల శంఖారావం పూరించేందుకు గులాబీ బాస్ సిద్ధమయ్యారు.

సభల వివరాలు

తేదీ	సభ జరిగే నియోజకవర్గం
15 అక్టోబర్	హుస్నాబాద్
17అక్టోబర్	సిరిసిల్ల
02 నవంబర్	ధర్మపురి
03 నవంబర్	కోరుట్ల
07 నవంబర్	మంథని, పెద్దపల్లి



న్యూస్‌రీల్

వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



వివరణ ఇస్తున్న వేణుగోపాలాచారి

కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులతో విద్యుత్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని టీఎస్ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం (లోకల్ కోర్టు) చైర్‌పర్సన్ ఎన్వీ.వేణుగోపాలాచారి సూచించారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్–2 కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సు (లోకల్ కోర్టు)కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది సమన్వయం పాటిస్తూ, పనితనం మెరుగు పర్చుకోవాలన్నారు. తిమ్మాపూర్ మండలంలో ఇంటి అనుమతుల్లేకున్నా వ్యవసాయ భూమిలో ఇండ్ల నిర్మాణానికి 43మీటర్లకు ఎలా అనుమతులిచ్చారని, లూజ్‌వైర్లు తొలగించడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో పునరుద్ధరించడం లేదని, ఏసీడీచార్జీలు తదితర విద్యుత్ సమస్యలపై కిసాన్ సంఘ్ ప్రతినిధులు సంపత్‌రావు, సంజీవరెడ్డి ఫోరం చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు. సీజీఆర్ఎస్ సభ్యులు ఎన్.నరేందర్, ఆర్.చరణ్‌దాస్, డీఈ రాజం, ఏఈ రాజేశం, రూరల్ ఏఏఈ సునీత, ఏడీఈలు ఎస్.సుధీర్‌కుమార్, నరేందర్ పాల్గొన్నారు. కాగా.. విద్యుత్ వినియోగదారుల సదస్సు (లోకల్ కోర్టు)కు స్పందన కరువైంది.

ముగిసిన న్యాక్ బృందం పర్యటన



కాలేజీ అధ్యాపకులు, ఉద్యోగులు

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో న్యాక్‌పీర్ బృందం పర్యటన ముగిసింది. సోమ, మంగళవారాల్లో న్యాక్ చైర్మన్ హిమాన్స్ పాండ్యా అధ్వర్యంలో బాలగురు స్వామి వనిత, సోనాలి ఫడ్నెకర్ పర్యటించారు. న్యాక్ బృందానికి 2017 నుంచి ఐదేళ్ల పాటు కళాశాలలో జరిగిన వివిధ కార్యక్రమాలను ఏడు విభాగాలుగా విభజించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించామని ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. వివిధ విభాగాలతో పాటు కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్(సీసీఈ) సభ్యులు, కాలేజీ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(సీపీడీసీ) సభ్యులు న్యాక్‌పీర్ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారని తెలిపారు. ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలు, ల్యాబ్‌లు, కాలేజీలో ఉన్న వివిధ రకాల క్లబ్ సభ్యులతో సంభాషించారని తెలిపారు. ఎగ్జిట్‌మీటింగ్‌లో రిపోర్ట్‌ను సీల్డ్‌కవర్‌లో అందించారని తెలిపారు. మరో ప్రతిని బెంగుళూర్‌లోని న్యాక్ కార్యాలయంలో సమర్పించిన తర్వాత ఏ గ్రేడ్ వస్తోందో తెలుస్తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

అగ్నివీరులుగా ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



అగ్నివీరులను అభినందిస్తున్న సీపీ

కరీంనగర్‌సిటీ: భారత సైనికదళంలో అగ్నివీర్ జవాన్లుగా ఎంపికైన కరీంనగర్ ఎస్ఆర్ఆర్ విద్యార్థులను సీపీ సుబ్బారాయుడు మంగళవారం అభినందించారు. కళాశాలకు చెందిన శ్రీనివాస్, వంశీ, సి.రాకేశ్, పి.శ్రావణ్‌కుమార్, ఎల్.ధర్మ, జి.అనిల్ కుమార్, జె.మహేశ్, బి.పవన్, ఎ.అఖిల్, ఇ.అరుణ్ కుమార్ అగ్నివీర్ నియామకాల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎన్సీసీ అధికారి రాజు తెలిపారు. వీరిని సీపీ అభినందించారు. స్టాఫ్‌క్లబ్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, కె.మల్లారెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త ఓదెలుకుమార్, ఆర్మీ అధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

13న ఎస్జీఎఫ్ వాలీబాల్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 13న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి అండర్–14, 17 వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను 67వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 16 మండలాలకు చెందిన జట్లు క్రీడాకారులు ఎలిజిబిలిటీ ఫారం, స్టడీ సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులతో రిపోర్టు చేయాలన్నారు.

ఒక్క చాన్స్ ఇవ్వండి..!

- ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల విన్నపాలు
- విజయం కోసం బండి సంజయ్, మక్కాన్ సింగ్, ఆది శ్రీనివాస్, అడ్లూరి, కేకే ఆరాటం
- బీఆర్ఎస్ నుంచి చల్మెడ, కౌశిక్, సంజయ్‌లది అదే బాట..
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర రాజకీయం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: విజయం.. వేదిక ఏదైనా బరిలో ఉన్నవారితో దోబూచులాడే అనుభూతి. ఆఖరి క్షణం వరకు పోరాటం చేసినా.. ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ. అందు కే, ఓటమిని తలచుకొని బాధ పడకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా చివరి వరకు పోరాడాలి అంటారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు నాయకులు అసెంబ్లీకి పోటీ పడుతున్న తీరు కూడా అలాగే కనిపిస్తోంది. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే ఆశావహులు తమను ఈసారైనా గెలిపించాలని.. ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ ప్రజల ముందుకు వస్తున్నారు. విపక్షాల మాటలు నమ్మితే మోసపోతారని, తమను తిరిగి గెలిపిస్తే అభివృద్ధి కొనసాగిస్తామని.. తమకు మరో అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త ఆశావహులు ప్రచారం ప్రారంభించారు.

వరుస ఓటములు.. అయినా బరిలో..

ఉమ్మడి జిల్లాలో పలువురు వరుస ఓటములు ఎదురైనా ఏమాత్రం కుంగిపోకుండా విజయం కోసం బరిలో నిలుస్తూనే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచే ఉండటం గమనార్హం.

- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆది శ్రీనివాస్(వేములవాడ), అడ్లూరి లక్ష్మణ్(ధర్మపురి), కేకే మహేందర్‌రెడ్డి(సిరిసిల్ల) నాలుగు సార్లు బీఆర్ఎస్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా, వీరంతా ఏమాత్రం వెరవకుండా ఈసారి ఎలాగైనా గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.
- కరీంనగర్ నుంచి 2014, 2018 ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్(బీజేపీ), పొన్నం ప్రభాకర్ (కాంగ్రెస్)లు రెండుసార్లు ఓడారు. అయినా మూడోసారి బరిలో దిగి, గెలుపు రుచి చూడాలనుకుంటున్నారు.
- హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి 2018లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి, ఓడిపోయారు. ఇప్పుడు అసెంబ్లీకి తిరిగి పోటీ చేస్తున్నారు.
- మానకొండూరు నుంచి 2009లో ప్రజారాజ్యం, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి రామగుండం బరిలో నిలిచిన మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్‌కు నిరాశ ఎదురైంది. ఈసారి కర్ణాటక ఎన్నికల ప్రభావం, ప్రభుత్వ వ్యతిరేకత అనుకూలిస్తుందని విజయంపై ధీమాగా ఉన్నారు.
- కోరుట్ల నియోజకవర్గం నుంచి 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావు పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కూడా పోటీకి సిద్ధంగా ఉన్నారు.
- 2009లో పెద్దపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయరమణారావు గెలిచారు. తర్వాత 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినా విజయం వరించలేదు. ఈ సారీ ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.
- 2014లో, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి పోటీ చేసిన చల్మెడ లక్ష్మీనరసింహారావు ఓడిపోయారు. ప్రస్తుతం పార్టీ మారి, బీఆర్ఎస్ అభ్యర్థిగా వేములవాడ నుంచి బరిలో నిలిచారు.
- మంథని నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పుట్ట మధు పోటీచేసి, ఓడిపోయారు. 2014లో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించారు. 2018లో పరాజయం పాలైనా.. ఈసారి విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.

అభివృద్ధిపై సిట్టింగ్‌ల హామీ

మరోవైపు ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలకుగానూ 11 స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే బరిలో ఉన్నారు. వీరిలో 8 మంది సీనియర్లు కాగా.. ముగ్గురు కొత్తగా పోటీలో నిలిచారు. తమకు మరో చాన్స్ ఇస్తే.. రైతుబంధు, రైతు బీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి/షాదీముబారక్, పింఛన్లు, గృహలక్ష్మి, బీసీబంధు తదితర సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయడంతోపాటు మరింత అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇస్తున్నారు.

- కేటీఆర్ (2009, 2010, 2014, 2018) నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో తన మార్క్ చూపించారు. సిరిసిల్ల నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని ధీమాగా ఉన్నారు.
- గంగుల కమలాకర్ 2009లో టీడీపీ, 2014, 2018లో బీఆర్ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించి, కరీంనగర్‌లో కొత్త రికార్డు సృష్టించారు. స్మార్ట్‌సిటీ, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్ వంటి రూ.వందల కోట్ల ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో మంత్రిగా నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. నాలుగోసారి విజయంపై కన్నేశారు.
- కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి వరుసగా విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ధర్మపురి నుంచే బరిలో నిలిచారు.
- 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ (మానకొండూరు), దాసరి మనోహర్‌రెడ్డి (పెద్దపల్లి), వొడితెల సతీశ్‌బాబు (హుస్నాబాద్) తాజా ఎన్నికల్లో గెలిచి, హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు.
- 2018 ఎన్నికల్లో డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), కోరుకంటి చందర్(రామగుండం), సుంకె రవిశంకర్(చొప్పదండి) గెలిచారు. రెండోసారి విజయం సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు.
- ఈటల రాజేందర్ హుజూరాబాద్ నుంచి 2004, 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు బీఆర్ఎస్ కారు గుర్తుపై గెలిచారు. అనూహ్యంగా పార్టీ మారి, 2021 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యారు.
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983 టీడీపీ నుంచి శాసనసభకు వెళ్లిన ఆయన.. 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలవనున్నారు.
- డాక్టర్ సంజయ్ కోరుట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు కొత్తగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కౌశిక్, చల్మెడ గతంలో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినవారే.
- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా గెలిచిన కోరుట్ల ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రమేశ్‌బాబు మాత్రం 2009లో టీడీపీ నుంచి గెలవగా, కోరుట్ల నుంచి విద్యాసాగర్‌రావు నాలుగుసార్లు కారు గుర్తు మీదనే గెలవడం గమనార్హం.

కోరుట్ల బరిలో నిజామాబాద్ ఎంపీ?

- పోటీ చేసేందుకు ధర్మపురి అర్వింద్ సుముఖత!
- ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి హామీ
- పసుపు బోర్డు ప్రకటనతో బీజేపీ కేడర్‌లో జోష్



ఎంపీ అర్వింద్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగుతారన్న ప్రచారం ఊపందుకుంది. ఎంపీలను ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పరిధిలోని ఏదో ఒక అసెంబ్లీ స్థానంలో పోటీ చేయాల్సిందేనని బీజేపీ అధిష్టానం ఆదేశించడంతో తమకు అనుకూలమైన స్థానంలో బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలోనే ఎంపీ అర్వింద్ తన పార్లమెంట్ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ నియోజకవర్గంలో ఎంపీ సామాజిక వర్గ ఓట్లు అధికంగా ఉన్నాయి. దీనికితోడు ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అదే సమయంలో ఏళ్లక్రితమే మూతపడిన షుగర్ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ, అమిత్‌షాల దృష్టికి తీసుకెళ్లానని, త్వరలోనే పునఃప్రారంభించేలా చూస్తానన్న హామీతో ఓట్లు అడిగేందుకు అర్వింద్ సమాయత్తమవుతున్నట్లు సమాచారం. కోరుట్ల నియోజకవర్గంలో పసుపు, చెరుకు పండించే రైతులు అధికంగా ఉండడం.. అటు పసుపుబోర్డు, ఇటు షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం అంశం ఎన్నికల్లో కలిసొస్తుందన్న ఆలోచనలో అర్వింద్ ఉన్నట్లు తెలిసింది. గతంలో మెట్‌పల్లి నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలిచిన చెన్నమనేని విద్యాసాగర్‌రావు ఈ ప్రాంత అభివృద్ధి కోసం శ్రమించారు. దీంతో ఆ పార్టీకి క్షేత్రస్థాయి ఓటు బ్యాంకు.. కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. ఇది కూడా తన గెలుపునకు దోహదపడుతుందని, ఆ ర్యూమర్‌తో పోలిస్తే కోరుట్లలోనే విజయం సాధించడం సులువనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

మానసిక వికలాంగులకు జడ్జి పరామర్శ

కరీంనగర్‌క్రైం: సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ మంగళవారం నగరంలోని మనోవికాస మానసిక వికలాంగుల పాఠశాల, వృత్తి విద్యా కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. న్యాయ సేవ అవసరమైనప్పుడు సంప్రదించవలసిందిగా నిర్వాహకులను ఆదేశించారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్ పాల్గొన్నారు.

భూ మాఫియా నయా దందా

- ఇంటి నంబర్లతో భూ కబ్జా
- కిసాన్‌నగర్‌లో రూ.20 కోట్ల భూమికి ఎసరు
- సహకరిస్తున్న కొందరు బల్దియా అధికారులు?

కరీంనగర్ కార్పొరేషన్:



నగరంలో భూ మాఫియా సరికొత్త పంథాను ఎంచుకుంది. గతంలో మాదిరిగా ఖాళీ జాగాల్లో షెడ్లు నిర్మించి ఆక్రమిస్తే, బయటకు పొక్కుతుండడంతో, కాగితాల్లోనే అధికారికంగా ఆక్రమించే నయా ఎత్తుగడ వేస్తోంది. నగరపాలకసంస్థ విస్తరించడంతో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతుండగా, భూములను ఆక్రమించేందుకు కబ్జాదారులు ఇంటినంబర్లను పాచికగా వేస్తున్నారు. స్థల యజమానికి కూడా తెలియకుండా కాగితాల్లోనే నిర్మాణాలున్నట్లు ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు సృష్టించి, ప్రభుత్వ, ప్రైవేట్ భూమిని సొంతం చేసుకోవడం నయా ట్రెండ్‌గా మారింది. ఇందుకు కొంతమంది నగరపాలకసంస్థ అధికారులు దన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొన్న వల్లంపహాడ్ తరహాలోనే నేడు కిసాన్‌నగర్‌లో భూ ఆక్రమణదారులు ఇంటి నంబర్లతో సుమారు రూ.20 కోట్ల విలువైన ఎకరానికి పైగా భూమిని కాజేసేందుకు రంగంసిద్ధం చేసుకున్న వ్యవహారం స్థానికంగా హాట్‌టాపిక్‌గా మారింది.

- మున్సిపల్ మాజీ ప్రజాప్రతినిధి ఒకరికి సంబంధించి నగరంలోని పలు చోట్ల భూములున్నాయి. అవి చాలా మట్టుకు ఖాళీగా ఉన్నాయి. కిసాన్‌నగర్‌లోనూ ప్రధాన రహదారిని ఆనుకొని ఎకరానికి పైగా ఉంది. సంవత్సరాలుగా ఇది ఖాళీగానే ఉంటోంది.
- మాజీ ప్రజాప్రతినిధి కుటుంబం స్థానికంగా ఉండకపోవడం భూ కబ్జాదారులు రంగంలోకి దిగారు. ఖాళీగా ఉంటున్న విలువైన భూమిని ఎలాగైనా సొంతం చేసుకోవాలని పావులు కదిపారు.
- ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇచ్చి కబ్జాకు అధికారిక ముద్ర వేసే నగరపాలకసంస్థ అధికారులు కొంతమందిని సంప్రదించారు. ఇందుకు వారు సరేననడంతో ఇంటినంబర్లు సృష్టించే పనిలో పడ్డారు.
- మారిన నిబంధనల ప్రకారం యజమానులే స్వీయ అంచనా వేసి ఇంటినంబర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నగరపాలకసంస్థ రెవెన్యూ ఉద్యోగులు క్షేత్రస్థాయికి వెళ్లి, అక్కడ దరఖాస్తు ప్రకారం వివరాలు ఉన్నాయా, ఇల్లు ఉందా లేదా అనేది చూసి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.
- కానీ కనీస నిర్మాణాలు లేకున్నా ఖాళీ స్థలాలకు కూడా ఇంటినంబర్లు ఇచ్చిన వైనం ఇటీవల వల్లంపహాడ్‌లో బయటకురావడం తెలిసిందే. ఈ క్రమంలోనే కిసాన్‌నగర్‌లోని ఖాళీగా ఉన్న భూమికి సంబంధించి కూడా ఇంటినంబర్లు పుట్టుకొచ్చాయి.
- సదరు స్థల యజమానికి కూడా తెలియకుండా కాగితాల్లోనే భూ యజమానులు శరవేగంగా మారుతున్నారు. కరీంనగర్, మంచిర్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ స్థలం విలువైనది.
- రోడ్డు వైపు ఉన్న 121 గజాల స్థలం రూ.80 లక్షల నుంచి రూ.కోటి ఉండగా, కనీసం రూ.20 కోట్లకు తగ్గకుండా ఈ భూమి విలువ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.
- అందుకే అత్యంత విలువైన ఈ భూమిని అధికారికంగా కాజేసేందుకు ఖాళీ స్థలానికి ఇంటినంబర్లు సృష్టించే ప్రక్రియను భూకబ్జాదారులు నిరాటంకంగా పూర్తి చేశారు.
- ఇప్పటివరకు ప్రభుత్వ భూమిని సొంతం చేసుకొనేందుకు ఇంటినంబర్లను వాడేవాళ్లు, కానీ మారిన పరిస్థితులతో ప్రైవేట్ భూములనూ ఇంటినెంబర్లతో కాజేస్తున్న వైనం నగరంలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. దీనితో నగరంలో ఖాళీ స్థల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.
- తమ స్థలం కళ్లముందు కనిపిస్తున్నా, ఎవరు ఇంటినంబర్ వేసి కాజేశారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మొత్తానికి నగరంలోని భూ మాఫియా సరికొత్త ఎత్తుగడలతో భూ ఆక్రమణలకు పాల్పడుతుండగా, అందుకు నగరపాలకసంస్థ ఉద్యోగులు కొంతమంది సహకరిస్తుండడం సమస్యగా మారింది.
- ఇప్పటికైనా ఉన్నతాధికారులు నగరంలో జరుగుతున్న ఈ నయా దందాపై దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే నగరంలోని ఖాళీ స్థల యజమానులు తమ భూములపై ఆశలు వదులుకోవాల్సిందే.

ఆర్టీసీ ప్రయాణికులకు దసరా ధమాకా

విద్యానగర్(కరీంనగర్): దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు సంస్థ గిఫ్ట్‌స్కీం ప్రకటించినట్లు ఆర్ఎం ఎన్.సుచరిత తెలిపారు. ఈనెల 21 నుంచి 23వరకు, 28 నుంచి 30వరకు ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించే వారు టికెట్ వెనకాల పేరు, ఫోన్‌నంబర్ రాసి, వాటిని బస్టాండ్‌ల్లో ఏర్పాటుచేసిన డ్రాప్‌బాక్సుల్లో వేయాలని తెలిపారు. ప్రతీ రీజియన్‌లో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుష ప్రయాణికులను ఎంపిక చేసి లక్కీడ్రా విజేతకు రూ.9,900 విలువైన బహుమతి ఇవ్వడం జరుగుతుందని, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు సైతం ఈ స్కీంకు అర్హులేనని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి బి.గోపి



మాట్లాడుతున్న కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: భారత ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల విధులపై స్పష్టమైన అవగాహన ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్‌టీటీ, సీ–విజిల్, వీడియో సర్వెలైన్ బృందాలకు విధులపై అవగాహన కల్పించారు. గోపి మాట్లాడుతూ.. కోడ్ అమల్లోకి వచ్చిన నాటినుంచి కోడ్ ముగిసే వరకు ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, గోడప్రతులు, వాల్ రైటింగ్‌లను తొలగించాలని అన్నారు. సీ–విజిల్ యాప్‌ను ప్రతీఒక్కరు రిజిష్టర్ చేసుకుని వాటిద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. వివిధ టీంలలో నియమించిన వారందరికి ఐడీ కార్డులు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరు కూడా రూ.50వేలకు పైబడి నగదుతో ప్రయాణం చేయకూడదని, పట్టుబడితే వాటిని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎక్కడైనా పొలిటికల్ సమావేశం జరిగినట్లయితే దానిని వీడియో రికార్డు చేసి పొలిటికల్ పార్టీ ఖర్చుగా నమోదు చేయాల్సి ఉంటుందని, సమస్యాత్మక ప్రాంతాలలో తనిఖీ చేయడం ఇబ్బందులు కలిగే సందర్భాలల్లో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీపీ సుబ్బారాయుడు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీఓలు కుందారపు మహేశ్వర్, సోలిపేట రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాప్‌తోనే అనుమతులు

ఎన్నికల్లో అనుమతులు, నామినేషన్ ప్రక్రియకు ఈ–సువిధ యాప్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ బి.గోపి తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు, అనుమతులు, నామినేషన్ ప్రక్రియలను సులభతరం చేసేలా సీ–విజిల్, ఈ–సువిధ యాప్‌లను వాడాలన్నారు. ఈ–సువిధ యాప్ ద్వారా పార్టీ సమావేశాలకు సంబంధించి ముందస్తు అనుమతులను పొందవచ్చని, నామినేషన్ కూడా యాప్ ద్వారా వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలు పొలిటికల్ పార్టీల సామగ్రిపై ప్రెస్‌పేరు, సెల్‌నంబర్, వివరాలను తప్పక అచ్చువేయాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై మంగళవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్, సౌండ్ పొల్యూషన్, పెండింగ్ ఈ చలాన్‌కు సంబంధించి 127 వాహనదారుల నుంచి జరిమానాలు వసూలు చేశారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్, సీఐలు పర్శ రమేశ్, కరీముల్లాఖాన్, ఆర్ఎస్సైలు రాజు, సాగర్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట: రైలు కిందపడి గుర్తు తెలియన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. మండల పరిధిలో బిజిగిరిషరీఫ్, పొత్కపెల్లి రైల్వేస్టేషన్ల మధ్య 45ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ముఖం గుర్తు పట్టడానికి వీలులేకుండా ఉందని, ఎలాంటి గుర్తింపుకార్డులు లభించలేదని తిరుపతి తెలిపారు. ఒంటిపై నలుపు కలర్ ప్యాంట్ ఉందని అన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వఆస్పత్రిలో భద్రపరిచారు. వివరాల తెలిసినవారు రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి.తిరుపతి, సెల్‌నంబర్ 9949304574, 8712658604కు సంప్రదించాలని సూచించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: ఇంట్లో చొరబడి చంపుతామని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సదయ్య జమ్మికుంటలోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ స్థానికంగానే నివాసం ఉంటున్నాడు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి, అతడిపై దాడిచేసి చంపుతామని బెదిరించారు. అయితే సదయ్యతో అతనిభార్య స్వరూపకు గొడవల కారణంగా దూరంగా ఉంటున్నారు. సదయ్య పట్టణానికి చెందిన ఓ మహిళతో సహజీవనం చేస్తున్నాడు. భార్య తరఫు గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గుట్ట పైనుంచి పడి కార్మికుడి దుర్మరణం

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ ఎస్ఎల్‌వీ క్వారీలో ఒడిశాకు చెందిన కార్మికుడు గోపీనాథ్ హన్సల్(20) మృతిచెందాడు. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని చింతల్వాడ గ్రామానికి చెందిన గోపినాథ్ హన్సల్ ఉపాధి కోసం మల్లాపూర్‌లోని క్వారీకి వచ్చాడు. మంగళవారం పనుల్లో ఉండగా దాహం వేయడంతో నీళ్లు తాగేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు కాలు జారి, గుట్టపై నుంచి రాళ్లపై పడ్డాడు. ఈ ఘటనలో అతని తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు క్వారీకి చెందిన వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువు శంబొనత్ శర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రతిభకు 'ఉపకారం'



- ఈ నెల 13వరకు ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు
- ఎంపికైతే ఏడాదికి రూ.12వేల ఉపకార వేతనం
- ఉపాధ్యాయులు చొరవ చూపితే ఎక్కువ మందికి మేలు
- డిసెంబర్ 10న పరీక్ష

కరీంనగర్: ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచేందుకు కేంద్రం అందిస్తున్న జాతీయ ఉపకార వేతనాలకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం(ఎన్ఎంఎంఎస్)ప్రకటన విడుదలైంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 13నాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా.. ఈ అవకాశాన్ని ఏటా తక్కువ మంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. ఈ సారైనా ఎక్కువమంది వినియోగించుకునేలా ఇప్పటి నుంచే ఉపాధ్యాయులు దృష్టిసారిస్తే పేద విద్యార్థులకు మేలు జరగనుంది.

2008 నుంచి అమలు..

చురుకుదనం, తెలివితేటలు, చదువుపై మంచి పట్టు ఉన్న విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కారాదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2008నుంచి జాతీయ ఉపకార వేతనాల పథకం అమలు చేస్తోంది. ఏటా ఉమ్మడి జిల్లా నుంచి చాలా మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతూ ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. గతంలో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.6వేల చొప్పున 9,10, ఇంటర్‌కు రూ.24 వేల చొప్పున అందించేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని రెండింతలు చేసింది. ఏటా ఇచ్చే మొత్తాన్ని రూ.12 వేలకు పెంచింది. అంటే నాలుగేళ్లకు కలిపి విద్యార్థులు రూ.48 వేలు అందుకోనున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు డిసెంబర్ 10న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

చొరవ చూపితే ఎంతో లబ్ధి

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అన్ని కులాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ చాటితే వారికి 9వ తరగతి నుంచి ఏటా ఉపకార వేతనం అందజేస్తారు. ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపికలో కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలు రాష్ట్రంలో అగ్రభాగాన నిలుస్తున్నాయి. కొత్తపల్లి మండలంలోని ఎలగందల్, పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మొదటి ఐదు స్థానాలలోపు నిలుస్తున్నారు. జిల్లాలో గత ఏడాది 69మంది ఎంపికయ్యారు. ఏటా నిర్వహించే పరీక్షకు ప్రచారం లేకపోవడం ఫలితంగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే లబ్ధికి నోచుకోవడం లేదు.

అర్హులు ఎవరంటే..

జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. 7వ తరగతిలో ఓసీ, బీసీలు 55, ఎస్సీ,ఎస్టీలు 50శాతం మార్కులు పొంది తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3.50 లక్షలలోపు వారంతా అర్హులు. దరఖాస్తు పూరించి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఆధార్, ఆదాయ, కుల, నివాసం పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ,బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50తో బ్యాంకులో డీడీ తీసి డీఈవో కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది.

ఎంతో ఉపయోగం



జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థులు ఎంపికైతే ఉన్నత చదువుల కోసం తల్లిదండ్రులపై భారం ఉండదు. ప్రస్తుతం ఈ ప్రోత్సాహకాన్ని రెట్టింపు చేయడంతో మరింత మేలు జరుగుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ప్రకటన వెలువడింది. జిల్లాలో ఈ ఏడాది అత్యధిక విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకునేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తాం. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందుతుంది.

– జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

ఆయనతోనే ఆమె..

- కలిసి నడిచారు.. కలిసే 'పోయారు'
- భర్తతో కలిసి భార్య ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు
- మంథనిలో విషాదం నింపిన కౌలురైతు దంపతుల ఆత్మహత్య



రోదిస్తున్న అశోక్ తల్లిదండ్రులు

మంథని: పుట్టినిల్లు.. మెట్టినిల్లు రెండూ నిరుపేద కుటుంబాలే.. కూలీపని చేసుకుంటేనే పూట గడిచేది.. వరద మిగిల్చిన దుఃఖం ఆ రెండు కుటుంబాలను చిదిమేసింది.. భర్తకు అన్నింటా చేదోడువాదోడుగా, ఎంతో అన్యోన్యంగా ఉండే భార్య.. భర్త వెంటే తనువు చాలించింది.. అదే సమయంలో ఆమె తన ఇద్దరు చిన్నారుల భవితవ్యం గురించి ఒక్కసారైనా ఆలోచన చేయలేదు.. విషాదం మిగిల్చిన ఈ ఘటన కన్నీరు తెప్పించింది. మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి నెల్లిపల్లిలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించిన కటుకు అశోక్(35)అంటే ఆయన భార్య సంగీత(28)కు అమితమైన ప్రేమ అని స్థానికులు అనుకుంటున్నారు. భర్తను ఎవరైనా చిన్నమాట అంటే వారించేదని, తన కూతురు, కుమారున్ని సైతం ఎంతోఅల్లారుముద్దుగా పెంచుకుందని, అలాంటి దంపతులిద్దరూ తన ఇద్దరు చిన్నారులను వదిలి కానరాని లోకాలకు వెళ్లడంపై స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రెండుసార్లు పంట మునక

గ్రామానికి చెందిన కటుకు రాయమల్లు– రమాదేవికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. రాయమల్లుకు ఉన్న కొద్ది పాటి భూమిని తానే సాగు చేసుకుంటున్నారు. ఓ కుమారుడు ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అశోక్ ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగు చేసుకుంటున్నాడు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో అశోక్ సాగు చేసిన వరి, పత్తి పంటలు రెండుసార్లు నీటమునిగి నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.2లక్షల వరకు అప్పు ఎలా తీర్చేదనే మనస్తాపంతో తన భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు, స్థానికులు భావిస్తున్నారు.

పిల్లల ముఖాలకు పసుపు ఎందుకు రాసినట్లు?

దంపతులిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వారి పిల్లలు సాయి, సన ముఖాలకు పసుపు ఉందని, అలా ఎవరు, ఎందుకు రాసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ పనిమాని.. వ్యవసాయం వైపు..

అశోక్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడని, రెండుమార్లు ప్రమాదం నుంచి బయటపడడంతో ఆ పనిమానేసి వ్యవసాయం వైపు దృష్టి సారించినట్లు స్థానికులు తెలిపారు. కాగా అశోక్‌కు వ్యవసాయం కూడా అచ్చిరాలేదని, గతంలో కూడా మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు అనుకుంటున్నారు.

క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: నగరంలోని మంకమ్మతోటలోని శివాని డిగ్రీ పీజీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. 600మంది డ్రైవ్‌లో పాల్గొనగా.. 15 కంపెనీలు 186 మందిని ఎంపిక చేసుకున్నాయి. ఆయా కంపెనీల హెచ్‌ఆర్‌ల ఆధ్వర్యంలో అభ్యర్థులకు నియామక పత్రాలు కళాశాల డైరెక్టర్లు ఎర్రంశెట్టి మునీందర్, సిరిపురం ప్రసాద్ అందించారు. ఎంపికైనవారు వెంటనే ఉద్యోగంలో చేరాలని డ్రైవ్ కో–ఆర్డినేటర్ తాళ్లపల్లి అశోక్ సూచించారు. శాతవాహన విద్యాలయం పాలకమండలి సభ్యులు వంగపల్లి ఉమాదేవి– సతీశ్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో ప్రతీ రెండేళ్లకోసారి రెండు, మూడుసార్లు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించడం అభినందనీయం అన్నారు.

రైతులు సంఘటితం కావాలి

- అధునాతన వ్యవసాయంతో ఆర్థిక వెసులుబాటు
- కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ సుగుణాకర్‌రావు



మేళాలో మాట్లాడుతున్న సుగుణాకర్‌రావు

కరీంనగర్‌టౌన్: రైతులు, రైతు సహకార సంఘాలు సంఘటిత శక్తిగా ఎదిగినప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారని, ప్రభుత్వాలు కూడా రైతు సమస్యలకు ప్రాధాన్యమిస్తాయని కిసాన్ గ్రామీణ మేళా కన్వీనర్ పి.సుగుణాకర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని పద్మనాయక కల్యాణమండపంలో నిర్వహిస్తున్న కిసాన్ గ్రామీణ రైతు మేళా రెండోరోజు కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు తమ పంటలను మార్పిడి చేసి విలువలను జోడించి వ్యాపారులుగా మారాలని తెలిపారు. 70శాతం ప్రజలు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతంలోనే ఉన్నారని వ్యవసాయ రంగం సంక్షోభంతో ఏటా 10 లక్షల మంది రైతులు వ్యవసాయాన్ని వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిసాన్ గ్రామీణ మేళా ద్వారా కొత్త పద్ధతులు యంత్రాలు పనిముట్లు, రైతులకు తెలియజేస్తున్నామని తెలిపారు. నాబార్డ్ అధికారి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా రైతు గ్రామీణ వృత్తులు రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలతో రైతు గ్రామీణ ప్రజల ఆర్థిక శక్తికి పాటుపడుతున్నాయని తెలిపారు. గ్రామీణ భారతి అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ... గ్రామ అభ్యున్నతికి ప్రభుత్వాలతో పాటు సామాజిక సంస్థలు కృషి చేయాలన్నారు. పత్తి పంట పురుగుల నివారణ పై డాక్టర్ శ్రీధర్ వివరించారు. ప్రభుత్వ పశు వైద్య కళాశాల డీన్ మాధవరావు పశుపోషణ గురించి వివరించారు. వెటర్నరీ విద్యా అవకాశాల గురించి డాక్టర్ సంతోషిని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు అధిక వరి, పత్తి పంటల గురించి వివరించారు. ఉత్తమ రైతులు వెంకట్‌రెడ్డి,మాధవరెడ్డి వారి అనుభవాలను వివరించారు. మంజీర సంస్థ ప్రతినిధి ఉదయ్‌భాస్కర్ చేపల పెంపకంతో కలిగే లాభాలను వివరించారు. రెండవ రోజు సుమారు పదివేల మంది రైతులకు పైగా కిసాన్ గ్రామీణ మేలని సందర్శించారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరుగనున్న 67వ రాష్ట్రస్థాయి అండర్–17 రగ్బీ పోటీలకు స్థానిక వివేకానంద రెసిడెన్సియల్ (సీబీఎస్ఈ) పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన సిరిచందన, సంయుక్త ఎంపికై నట్లు తెలిపారు. వీరిని పాఠశాల చైర్మన్ పొల్సాని సుధాకర్‌రావు, అకాడమిక్ డైరెక్టర్ లలిత కుమారి, పీఈటీ బత్తిని శ్రీధర్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం

- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి



మాట్లాడుతున్న అంబటి జోజిరెడ్డి

కరీంనగర్: బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓట్లు, సీట్ల రాజకీయాలు తప్ప అభివృద్ధి, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి జోజిరెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే నేతాజీ స్థాపించిన ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 119 స్థానాల్లో పోటీ చేయబోతున్నామని, మూడు పార్టీలకు గట్టిపోటీ ఇస్తామన్నారు. 2018లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మళ్లీ ప్రజల ముందుకు వస్తున్న బూర్జువా రాజకీయ పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి అసెంబ్లీ అభ్యర్థి ముత్యాల విజయ్ కుమార్, నాయకులు పెద్దెల్లి శేఖర్, పులిమాటి సంతోష్ కుమార్, శంకర్, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

సరిహద్దులపై పోలీస్ ఫోకస్



హుజూరాబాద్‌లో వాహన తనిఖీలో సీపీ సుబ్బారాయుడు

- ఎన్నికల వేళ 5 చెక్‌పోస్టుల ఏర్పాటు
- జిల్లాకు వచ్చే మార్గాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు
- నగదు, లిక్కర్ ఇతరత్రాల సరఫరాపై ప్రత్యేక నజర్

కరీంనగర్‌క్రైం/హుజూరాబాద్/ఇల్లందకుంట/జమ్మికుంట/తిమ్మాపూర్/చొప్పదండి/వీణవంక: అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలో మొత్తం 5 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అవి హైదరాబాద్ రూట్‌లో రేణికుంట టోల్‌ప్లాజా, పెద్దపల్లి మార్గంలో మొగ్దుంపూర్, జమ్మికుంట వైపు సిరిసేడు, వరంగల్ రూట్‌లో పరకాల ఎక్స్‌రోడ్ వద్ద, మంచిర్యాల రూట్‌లో చొప్పదండి ఆర్నకొండ వద్ద ఉన్నాయి. ఒక్కో చెక్‌పోస్టులో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ స్థాయి అధికారి, ఒక ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లు, ఎక్సైజ్ శాఖ నుంచి ఒకరు, అటవీశాఖ నుంచి ఒకరు, రవాణా శాఖ నుంచి ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల వేల డబ్బులు, మద్యం, ఇతరత్రాలను కట్టడి చేసేందుకు వాహన తనిఖీలు చేపడుతున్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సుబ్బారాయుడు అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌శివారులోని కేసీక్యాంపు, ఇల్లందకుంట మండలం సరిసేడు, తిమ్మాపూర్ మండలం రేణికుంట వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్నకొండ చెక్‌పోస్టును రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తనిఖీ చేశారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యం నగదు, బంగారం తీసుకెళ్లేవారు రశీదులు వెంట ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి, ఎలాంటి ఆధారాలు లేని నగదు, బంగారాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో అనుమతి పొందిన ఆయుధాలపై నిషేధాజ్ఞలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. గన్స్‌ను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్ చేయాలని తెలిపారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

రూ.1.50 లక్షలు సీజ్

కరీంనగర్ టూటౌన్ పరిధిలోని తెలంగాణచౌక్ వద్ద మంగళవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి వద్ద నుంచి ఎలాంటి ఆధారాలు లేని రూ.1.5 లక్షలు సీజ్ చేశారు. 10మంది పాతనేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. త్రీటౌన్ పరిధిలోని కాపువాడలో ఓ బెల్ట్‌షాపులో 23 మద్యం బాటిళ్లు చేశారు. జమ్మికుంట మండలం కోరపల్లిలో ఓ బెల్టుషాపు నుంచి రూ.3,800 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. వీణవంక మండలంలో 13మందిని తహసీల్దార్ తిరుమల్‌రావు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. మండలంలోని మామిడాలపల్లి గ్రామంలోని ఓ బెల్టుషాపులో మద్యంబాటిళ్లను సీజ్ చేశారు.

ప్రభుత్వ భూమిలో వెంచర్ రోడ్డు

- నష్టపోతున్నామని అడ్డుకున్న రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తాహసీల్దార్ విచారణ



వ్యవసాయ భూమిలో రియల్ వెంచర్ దారి




అధికారులను నిలదీస్తున్న రైతులు(ఫైల్)

జమ్మికుంట: జమ్మికుంట విస్తరిస్తుండడంతో రోజురోజుకు భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పట్టణ పరిసరాల్లో వ్యవసాయ భూములను చదును చేసి రియల్ వెంచర్లుగా మార్చేస్తున్నారు. కాగా కొందరు సర్కారు భూమిని సైతం తమ వ్యాపారానికి వినియోగిస్తున్నారు. జమ్మికుంట పరిధిలోని రామన్నపల్లిలో ఏర్పాటుచేసిన ఓ వెంచర్‌కు కెనాల్ కాలువ భూమిని రోడ్డుగా వినియోగించడంతో చుట్టుపక్కల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు.

విషయం ఇదీ..

జమ్మికుంట పరిధిలోని రామన్నపల్లి గ్రామ శివారులో ఎస్సారెస్పీ డీబీఎం–16 ఉప కాలువ 1ఆర్‌బీఎల్ ఉంది. గ్రామ శివారులో ప్రారంభమై 1.5 కిలోమీటర్ల పరిధిలో ఉప కాలువను అనుకుని వ్యవసాయ భూమిలు ఉన్నాయి. సర్వేనంబర్ల 394,395లో ఓ వ్యాపారి వెంచర్ ఏర్పాటు చేశాడు. కాలువ కోసం వినియోగించాల్సిన దారిని వెడల్పుచేసి వెంచర్‌కు వినియోగించడంతో రైతులు ఆందోళనకు దిగారు. కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 1.5 కిలోమీటర్ల వరకు కాలువ దారిగా తీయాలని తహసీల్దార్ సూచించారని రైతులు తెలిపారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని వివరించారు. 'ప్రస్తుతం రైతులు వెళ్లేందుకు కొంతమేర దారి తీశాం. పంటల అనంతరం కాలువ పక్కన పూర్తిస్థాయిలో దారితీస్తాం' అని ఎస్సారెస్పీ ఏఈ నవీన్ వివరించారు.


పొలం ధ్వంసం చేశారు



కాలువపక్కనే మా పొలం ఉంది. నెలన్నర క్రితం మా భూమి పక్కన రియల్ వెంచర్ ఏర్పాటు చేశారు. కాలువ భూమిని రోడ్డుగా వాడుకుంటున్నారు. మేము లేని సమయంలో మా పొలం ధ్వంసం చేసి, రోడ్డు వేశారు. రెండు వైపుల ఎత్తుగా మట్టిపోయడంతో వర్షాకాలంలో వరదతో మా పోలం మునిగిపోతుంది. మాకు న్యాయం జరిగేలా చూడాలి.

– మేడిపల్లి భావన, రామన్నపల్లి


పరిశీలించాం



మండలంలోని రామన్నపల్లి గ్రామంలో రోడ్డు విషయంలో కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు. మేము క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లాం. ఆ వివాదం కాలువ రోడ్డు కోసం వచ్చిందని గమనించాం. కాలువ పక్కన పూర్తిస్థాయిలో రోడ్డు తీయాలని అధికారులకు సూచించాం. ఉన్నతాధికారులకు అదే సమాచార్ని అందించాం.

– రజని, తహసీల్దార్, జమ్మికుంట

చర్యలు తీసుకుంటాం



నిబంధనలు పాటించని అక్రమవెంచర్లపై చర్యలు తీసుకుంటాం. లేవుట్ లేని ప్లాట్ల అమ్మకాలపై పురపాలక సంఘం చట్టం 2019 ప్రకారం చట్టరీత్యా చర్యలు ఉంటాయి. ఆ భూమి కొనుగోలు చేసిన వారికి ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వము. మౌలిక వసతులు కల్పించడం జరగదు.

– శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, జమ్మికుంట

అ'విశ్రాంత' సేవకులు!

- వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు
- సాహితీ సేద్యం చేస్తున్న 'దాస్యం'
- సేంద్రియ వ్యవసాయంపై జనార్దన్ చైతన్యం
- సమాజ హిత కార్యక్రమాల్లో మనోహరాచారి..

విద్యానగర్(కరీంనగర్): వయసు ఆరు పదులు దాటినా తరగని ఉత్సాహం, చెదరని చిరునవ్వు వారి సొంతం. నిన్నటి వరకు కుటుంబం కోసం సర్వస్వాన్ని ధారపోసిన వయోవృద్ధులు తమ ఉద్యోగాలకు, వయస్సుకే రిటైర్‌మెంట్ తప్ప తమ మనస్సుకు కాదని చెబుతున్నారు. ఇంకా తమలో ఓపిక ఉన్నంత వరకు తమవంతు బాధ్యతగా సమాజానికి కూడా ఎంతో కొంత సేవలందిస్తున్నారు.

అనుభావాలను పంచుతున్న వయోవృద్ధులు

యవ్వనంలో నిత్యవిద్యార్థిగా శ్రమించి జీవితపాఠాలు నేర్చుకుంటాం. అనేక అనుభవాలను పోగుచేసుకుంటాం. వృద్ధాప్యంలోకి అడుగుపెడతాం. అప్పటి వరకు సంపాదించిన అనుభవం, జ్ఞానా న్ని తనతోపాటు చుట్టుపక్కల వారి మేలు కోసం ఉపయోగించగలగాలి. అలా కాకుండా 60 ఏళ్లు రాగానే సంపాదించుకన్న జ్ఞానాన్నింతా ఆటక ఎక్కిస్తే ప్రయోజనం ఏముంది. అందుకే రిటైరయ్యాక శరీరం సహకరించిన విధంగా ఏదో ఉద్యో గం, వ్యాపకం పెట్టుకుని తమ అనుభవాన్ని అందరికి పంచుతున్న వయోవృద్ధుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

కొత్త జీవితం

చాలా మంది అరవై ఏళ్లు దాటినా భౌతికంగా, మానసికంగా బలంగా ఉంటున్నారు. మానసిక ఒత్తిళ్లను అధిగమించే నైపుణ్యంతో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత మళ్లీ ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించిన వారి గురించి మాటల్లో..

అవిశ్రాంత సాహితీ ప్రస్థానం



దాస్యం సేనాధిపతి

అధ్యాపకుడిగా విశ్రాంతి తీసుకున్న దాస్యం సేనాధిపతి ప్రవృత్తి రీత్యా తెలుగు రాష్ట్రాలకు ప్రముఖ కవి, రచయిత, సాహితీ విమర్శకులు. 1984లో సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ విభాగాధిపతిగా 2013లో ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి 2014లో శాతవాహన విశ్వవిద్యాలయం అదనపు పరీక్షల కంట్రోలర్‌గా నియమించగా రెండేళ్లు ఆ పదవిలో కొనసాగారు. ఉద్యోగ నిర్వహణ సమయంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యా కమిషనరేట్ అకాడమిక్ అడ్వయిజర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా, ఇగ్నో కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అధ్యాపకుడిగా చేరినప్పటి నుంచి సాహిత్యంపై మక్కువ. అప్పటి నుంచి సంపాదక లేఖలు రాస్తూ సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన ఇప్పటివరకు వెయ్యికి పైగా సంపాదకీయాలు రాశారు. వివిధ ప్రక్రియలో 20 గ్రంథాలు వెలువరిచారు. ఉద్యోగ విరమణ తర్వాత సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తూ గ్రంథ సమీక్షలు, సాహితీ వ్యాసాలు రాస్తూ పత్రికలకు పంపిస్తున్నారు.

ప్రశ్నించే గొంతుగా..



సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన ముదుగంటి సుధాకర్‌రెడ్డి గ్రంథాలయ పాలకుడిగా బాధ్యతలు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. తర్వాత వివిధ సేవా సంస్థలను స్థాపించి ప్రశ్నించే గొంతుగా మారి తన దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారంలో కృషి చేస్తున్నారు. ప్రస్తుతం పుడమి సాహితీ వేదిక జాతీయ గౌరవాధ్యక్షుడిగా, తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ జనసత్తా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న అయన ప్రజాహిత కార్యక్రమాల్లో భాగం పంచుకుంటున్నారు.

సమాజ హిత కార్యక్రమాల్లో..



ఎస్. మనోహరాచారి

కరీంనగర్ జిల్లా వరికోలు గ్రామానికి చెందిన ఎస్. మనోహరాచారి ఎంఏ ఎకనామిక్స్ చేశారు. 1982లో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ఎస్సారార్ కాలేజీలో చేరారు. 1984లో ప్రభుత్వ లెక్చరర్ ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఇదే కాలేజీలో 2014 డిసెంబర్‌లో రిటైర్డ్ అయ్యారు. 32ఏళ్ల విధి నిర్వహణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్‌మెంట్ తర్వాత రెండేళ్లు ఈ కాలేజీలో పీజీ క్లాసులు తీసుకున్నారు. ఉద్యోగ సమయంలోనే వివిధ సంస్థలతో అనుబంధం పెంచుకొని పన్నెండు ఏళ్ల నుంచి సమాజహిత కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం..



తోట లక్ష్మణ్‌రావు

తోట లక్ష్మణ్‌రావు కరీంనగర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా 2004లో రిటైర్డ్ అయ్యారు. మానేరు పర్యావరణ సమితి ఏర్పాటు చేసి వాతావరణం కాలుష్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పర్యావరణంపై రచనలు చేసి పుస్తక రూపం ఇచ్చారు. ప్రస్తుతం సర్వోదయ నవ నిర్మాణ సమితి ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణతో పాటు పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు.

శక్తి మేరకు కృషి..



జనార్దన్‌రావు

జనార్దన్‌రావుది ఉమ్మడి కరీంనగర్ జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి. 1968లో బీఎస్సీ అగ్రికల్చర్ పట్టా పొంది అదే సంవత్సరం డిసెంబర్ 10న వ్యవసాయ అధికారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖలో ఖమ్మం జిల్లాలోని బూర్గంపాడులో ఉద్యోగంలో చేరారు. చివరగా పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సంయుక్త వ్యవసాయ సంచాలకులుగా ఏప్రిల్ 2003లో ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ తర్వాత వివిధ సంస్థల్లో ఉద్యోగం చేసిన ఆయన 2008లో సేవా కార్యక్రమాలకు స్వీకారం చుట్టి మానేరు పర్యావరణ సమితిలో ఉపాధ్యక్షుడిగా చేరి పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్, వర్షపు నీటి సంరక్షణ, నీటి పొదుపు గురించి అవగాహన కార్యక్రమలు నిర్వహించారు. 2008లో కరీంనగర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం స్థాపించారు. గ్రామభారతి కరీంనగర్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా 2014లో నియమితులైన ఆయన ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయంలో శక్తి మేరకు కృషి చేస్తున్నారు.

విశ్రాంతి లేదు



బి. వెంకటేశం

ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాము. ఇక విశ్రాంతే అన్న ఆలోచన సరికాదు అని బి.వెంకటేశం చివరి మజిలే విశ్రాంతి అంటారు. అనుభవాలు, ఆలోచనలను యువతరానికి పంచాలి అన్న ధోరణిలో ముందుకు సాగుతున్న ఆయన సింగరేణిలో క్లర్క్‌గా 1983లో ఉద్యోగంలో చేరి డిప్యూటీ సూపరింటెండెంట్ జూన్ 30, 2018లో రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం కరీంనగర్‌లో స్థిరపడిన ఆయన భక్తి కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొంటూ యువతలో అధ్యాత్మికత పెంపొందించడంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు



నగరంలోని కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం గజానన కిట్టి పార్టీ మహిళలు ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. వేడుకల్లో కిట్టి పార్టీ సభ్యులు తొడుపునూరి నీరజ, తాటి అమల, దివ్య, శాంతి, లావణ్య, ఉమా, వనజ, అన్నపూర్ణ, నాగలత, లక్ష్మీ, మమత, ఉషా, రమ్య తదితరులు పాల్గొన్నారు. - విద్యానగర్(కరీంనగర్)

బీటీ రోడ్డు ఎప్పుడు వేస్తారో..?



కరీంనగర్ మండలం మొగ్దుంపూర్-ఎలబోతారం రోడ్డుపై బీటీ వేయకపోవడంతో రైతులతో పాటు ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఆర్ఆర్ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను గతేడాది ఆగస్టులో మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. కొత్తగా రహదారి నిర్మించిన కాంట్రాక్టరు మూడు నెలల క్రితం కంకరపోసి వానాకాలం సాకుతో బీటీ వేయడంలో జాప్యం చేస్తున్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బీటీ వేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. - కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

తాటి విత్తనాలు నాటిన గీతకార్మికులు



తాటి విత్తనాలు నాటుతున్న శంకర్‌గౌడ్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఇరుకుల్లలోని తాటివనంలో మంగళవారం బీహార్ రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన పొట్టిరకం తాటి చెట్టు విత్తనాలను గీతకార్మికులు నాటారు. ఈ తాటిచెట్టు ఐదు నుంచి ఎనిమిది సంవత్సరాల్లో కల్లు పారుతుందని, కేవలం పది అడుగుల ఎత్తు మాత్రమే ఉంటుందని ఉప సర్పంచ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, ప్రతినిధులు బుర్ర మల్లేశం, బాబు, చంద్రయ్య, సంజీవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి'

విద్యానగర్(కరీంనగర్): అసెంబ్లీ సీట్ల కేటాయింపులో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కరీంనగర్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కెళిపెద్ది శ్రీధర్‌రాజు, కన్వీనర్ మియాపురం రవీంద్రాచారి, నాయకులు నర్సింగోజు శ్రీనివాస్, బత్తుల మల్లేశం, లింగం పల్లి శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో అధిక శాతం బీసీ ఓటర్లు ఉన్నారని బీసీల ప్రాధాన్యతను గుర్తించి బీసీలకు పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మూడురోజుల జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌కేసులో ఒకరికి కోర్టు మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 12మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. కరీంనగర్‌కు చెందిన రాజ్‌కుమార్‌కు మూడు రోజుల జైలు, రూ.2 వేల జరిమానా విధించారు. మిగితా 11 మందికి రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రతిభను వెలికితీసేందుకు దోహదం



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రావు

కొత్తపల్లి: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీయడానికి ప్రాజెక్టు ఆధారిత అభ్యసనం దోహదపడుతుందని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. మంగళవారం పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రాజెక్టు ఆధారిత అభ్యసన ప్రదర్శన ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు అవార్డులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి సత్కరించారు. విద్యార్థుల్లో ఉన్న పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు ప్రోత్సహించాలని కోరారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ డా.మంజులత, ఎంఈవో మధుసూదనాచారి, పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, వినోదరావు, వీయూఎం.ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్ మెహత, బాలాజీ, ఎం.శ్రీకర్, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, పీబీఎల్ హెడ్ లలిత్‌మోహన్ సాహూ, పీబీఎల్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం పీబీఎల్ 2022–23 పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సంప్రదాయాల పరిరక్షణకు దేశభక్తిని జోడించాలి

కరీంనగర్‌కల్చరల్: హిందూ సమాజాన్ని ఏకీకృతం చేయడానికి, హిందువుల్లో సౌభ్రాతృత్వాన్ని పెంచేందుకు, సంప్రదాయాల పరిరక్షణకు భక్తిని, దేశభక్తిని జోడించాలని హిందూ వాహిని ప్రాంత సదస్యులు రుద్రోజు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మార్కెట్ రోడ్ వేంకటేశ్వర ఆలయంలో హిందూ వాహిని, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్భావన సదస్సులో మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోమళ్ల రాజేందర్ మాట్లాడుతూ అర్చకులు ఏకమైతే సమాజస్థితిగతులను మార్చవచ్చని అన్నారు. వీహెచ్‌పీ జాతీయ సంయుక్త కార్యదర్శి గమ్మళ్ల సత్యం మాట్లాడుతూ త్వరలోనే అయోధ్యలో శ్రీరాముని దివ్యమందిరం పునఃప్రారంభమవుతుందన్నారు. వేద పండితుడు పురాణం మహేశ్వరశర్మ మాట్లాడుతూ సనాతన వైదిక ధర్మాన్ని మించింది ప్రపంచంలో మరేది లేదని, సర్వమానవ సమానత, జీవకారుణ్యం, భూతదయ మన ధర్మంలో తప్ప మరే ధర్మంలో లేదన్నారు. అనంతరం అర్చకులకు వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ నిరంజనాచారి, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇనుగంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాగటి నారాయణకు నివాళి



నివాళి అర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

కరీంనగర్: యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు, ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత నాగటి నారాయణ ప్రథమ వర్ధంతిని మంగళవారం కరీంనగర్‌లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావెద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపిన ఉద్యమ శిఖరం నారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.రాజమౌళి, ఎస్.శ్రీపాల్, చిరంజీవి, మద్దెల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలతో ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జయపాల్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో కరీంనగర్‌లో కాంగ్రెస్ నాయకుడు కొత్త జయపాల్‌రెడ్డి మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఎల్ఎండీ కట్టపై వాకర్స్‌ను పలకరిస్తూ కాంగ్రెస్ ప్రకటించిన హామీలను వివరిస్తూ అవగాహన కల్పించారు. మరో 100 రోజుల్లో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలు పదేళ్లుగా మోసపోయారని, ఈ ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన బుద్ది చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, జయపాల్‌రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

కోడ్ ఎఫెక్ట్

గోడలపై రాతల తొలగింపు

సప్తగిరికాలనీ(కరీంనగర్)/కరీంనగర్‌రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అధికారులు ఎన్నికల పనిలో పడ్డారు. ప్రజాప్రతినిధుల వాల్‌పోస్టర్లు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పోస్టర్లను తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం ప్రభుత్వ కార్యాలయాలు, గోడలపై ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వాల్‌పోస్టర్లు, ప్రచారహోర్డింగ్‌లు, వాల్‌రైటింగ్‌లను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం మంకమ్మతోటలో గోడలకు అంటించిన రాజకీయ నాయకుల వాప్‌పోస్టర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించి సున్నం వేశారు. దుర్శేడ్ సబ్‌స్టేషన్ ప్రహరీ, బొమ్మకల్‌ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడలపై రాసిన రాజకీయపార్టీల రాతలపై సిబ్బంది సున్నం వేసి కనిపించకుండా చేశారు. రాజీవ్‌రహదారిలోని బొమ్మకల్ సమీపంలో భవనాలపై ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల హోర్డింగ్‌లను తొలగించారు.



కరీంనగర్‌లోని మంకమ్మతోటలో..



దుర్శేడ్ సబ్‌స్టేషన్ ప్రహరీపై..



బొమ్మకల్ ఫ్లై ఓవర్‌బ్రిడ్జి గోడపై..

14 నుంచి దుర్గాభవానీ శరన్నవరాత్రోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పురాణం మహేశ్వర శర్మ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఈనెల 14వ తేదీ నుంచి శరన్నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. మంగళవారం శరన్నవరాత్రులకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. 14న ఉదయం 5.30గంటలకు అమ్మవారికి విశేష ద్రవ్య ఫలపంచామృత మహాభిషేకాలు, విశేష హారతులు, ధ్వజారోహణతో ఉత్సవాలు ఆరంభమై 15న ఉదయం 6.30 గంటలకు గురు వందనం, గోపూజ, పుణ్యహవచనం, గ్రహారాధన, కలశస్థాపన, చండీపారాయణ చతుష్షష్ట్యుపచారపూజ, చండీహోమం, మంగళహారతి, కన్యాసువాసిని పూజలు జరుగుతాయని తెలిపారు. అమ్మవారు బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, సాయంత్రం బతుకమ్మ పల్లకీ సేవ, కోలాటం, రాజోపచార పూజలు జరుగుతాయన్నారు. 16న మహేశ్వరీ అలంకరణలో నంది వాహనంపై, 17న కౌమరీ అలంకరణలో నెమిలి వాహనంపై, 18న వైష్ణవీ అలంకరణలో గరుడ వాహనంపై, 19న లలిత త్రిపుర సుందరిగా, 20న సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై, 21న అన్నపూర్ణ అలంకరణలో, 22న దుర్గా అలంకరణలో సింహవాహనంపై, 23న విజయలక్ష్మి అలంకరణలో గజవాహనంపై అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. చండీహోమం మహాపూర్ణాహుతి, సాయంత్రం దసరా వేడుకలు, జమ్మిపూజ, రాంలీల జరుగుతుందని వివరించారు. 24న మంగళవారం అర్ధనారీశ్వర అలంకరణలో నంది, సింహవాహనలతో అమ్మవారు దర్శనమిస్తారని, సాయంత్రం 4గంటలకు సందరేశ్వరుల దుర్గాభవానీల పట్టాభిషేకం, రథోత్సవం జరుగుతుందని తెలిపారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ ఉదయం చండీహోమం, శ్రీచక్రపూజ, చతుష్షష్ట్యుపచార పూజ, విశేష హారతి, పూర్ణాహుతి, కుంకుమార్చనలు, చండీపారాయణం, సహస్ర నామార్చన తదితర పూజలు జరుగుతాయని ఈ ఉత్సావాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణలో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, కమిటీ సభ్యులు ముక్క ప్రభాకర్, నీరుమల్ల తిరుపతి, శానగొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక బృందాలు

- కరీంనగర్ నియోజకవర్గంలో 12 బృందాలు ఏర్పాటు

కరీంనగర్‌రూరల్: కేంద్రం ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ప్రకటించడంతో కరీంనగర్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.మహేశ్వర్ ప్రత్యేక బృందాలను నియమించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు–4, స్టాటిక్ సర్వైలైన్ బృందాలు–4, వీడియో సర్వేలైన్ బృందాలు–2, వీడియో వ్యూయింగ్ బృందాలు–2 చొప్పున నియమించారు. ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలైన్ బృందాల్లో రెండు టీమ్‌లను ఏర్పాటు చేసి ఒక్కో టీమ్‌కు ప్రత్యేక అధికారిని నియమించి 24గంటల పాటు విధుల్లో ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ స్క్వాడ్‌లో వీడియోగ్రాఫర్‌తో పాటు ఇద్దరు పోలీస్‌కానిస్టేబుళ్లుంటారు. అదేవిధంగా వీడియో సర్వైలైన్, వ్యూయింగ్ బృందాల్లో రెండు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌కు ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించారు.

అవినీతిని కాపాడటానికా సెక్షన్ 17ఏ?

తప్పు చేసిన వాళ్లంతా ఈ చట్టాన్ని చూపించి అనుమతులు తెమ్మంటే ఎలా? • ఇలాగైతే దర్యాప్తు చేయడానికి ఏ అధికారి అయినా ముందుకొస్తారా?

- నిజాయితీపరులకు మద్దతివ్వటానికే ఈ చట్టాలు... వాటికి సవరణలు
- అంతేతప్ప అవినీతిని, అవినీతిపరుల్ని కాపాడటానికి కాదు?
- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదన



(సాక్షి, న్యూఢిల్లీ)

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి జైల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు... గవర్నరుకు సమాచారమివ్వకుండా తనను అరెస్టు చెయ్యటం చెల్లదు కనక ఈ కేసును కొట్టేయాలంటూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో మంగళవారం కూడా ఎలాంటి ఉపశమనం లభించలేదు. మంగళవారమే దీన్ని ముగించాలని చంద్రబాబు నాయుడి తరపు న్యాయవాదులు పట్టుబట్టినప్పటికీ... ధర్మాసనం ఈ కేసు విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. విశేషమేంటంటే తాను స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి పాల్పడలేదని కానీ... షెల్ కంపెనీల ద్వారా నిధులను కొల్లగొట్టడం జరగలేదని కానీ మొదటి నుంచీ ఒక్క ముక్క కూడా చెప్పని చంద్రబాబు... తాజా విచారణలో సైతం అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద తన అరెస్టు చెల్లదని, కాబట్టి కేసును కొట్టేయాలనే సాంకేతిక అంశాలనే సుప్రీంకోర్టు ధర్మాసనానికి వినిపించారు. నిజానికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ)ను 2018లో సవరించారు. కొన్ని పదవుల్లో ఉన్నవారికి అరెస్టు విషయంలో రక్షణ ఉండేలా... తగిన అనుమతితో అరెస్టు చేసేలా ఈ సవరణ చేశారు. కాకపోతే స్కిల్ కుంభకోణం 2018కి ముందే జరగటం... ఈ కేసులో పలు ఐపీసీ సెక్షన్లు కూడా ఉండటం వల్ల సెక్షన్ 17ఏ వర్తించదని ప్రతి కోర్టులోనూ చెబుతున్నా... సుప్రీంకోర్టులో సైతం ఇదే విషయంపై చంద్రబాబు లాయర్లు వాదనలు వినిపించటం గమనార్హం.

సెక్షన్ 17ఏ అవినీతి కేసుల నుంచి కాపాడటానికా?

అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ అనేది అవినీతి కేసుల నుంచి కాపాడటానికి కాదని మంగళవారం నాటి వాదనల్లో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పారు. మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీతో కూడిన ధర్మాసనం ఎదుట ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ నేరం కొన్నేళ్ల తర్వాత బయట పడితే అప్పటి చట్టాలకు లోబడే దర్యాప్తు జరుగుతుందని రోహత్గి ధర్మాసనానికి చెప్పారు. ''చంద్రబాబు నాయుడి కేసు విషయానికొస్తే ఈ చట్ట సవరణ 2018లో జరిగింది. కానీ నేరం 2018 కంటే ముందు జరిగింది. మరి అప్పట్లో జరిగిన నేరాన్ని అప్పటి చట్టాల ప్రకారమే దర్యాప్తు చేస్తారు కదా? 17ఏ అనేది ఈ కేసులో ఒక భాగం మాత్రమే''అని వివరించారు. దర్యాప్తు అధికారి వద్ద ఉన్న సాక్ష్యాలు, ఆధారాలను బట్టి కోర్టు నిర్ణయం తీసుకోవాలని చెప్పారాయన. ఈ సందర్భంగా ఇరు పక్షాలనూ ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది. ప్రధానంగా ఈ కేసుకు సెక్షన్ 17ఏ వర్తించడంపై ఇరు పక్షాల న్యాయవాదులనూ తీసింది.

తొలుత చంద్రబాబు నాయుడి తరపున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే సోమవారం నాటి వాదనలను కొనసాగించారు. తనకు మరో గంట సమయమివ్వాలని ధర్మాసనాన్ని కోరగా అనుమతించింది. మూడు రోజులుగా వేచి చూస్తున్నామని ఇది ఇప్పటికే కొట్టేయాల్సిన కేసు అని ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు. అసలు నోటీసులివ్వకుండా మరోసారి వాదనలు వినిపించడానికి అవకాశం ఇవ్వకూడదన్నారు. క్రిమినల్ కేసులకు కౌంటరు అఫిడవిట్ అక్కర్లేదని హరీశ్ సాల్వే పేర్కొనగా... ముకుల్ రోహత్గీ విభేదించారు. కోర్టు ప్రొసీజర్‌ను అనుసరించాలని కోరారు. నిందితుడికి రక్షణ కల్పించే అంశాలు కోర్టుకు వివరిస్తానని, గంట సేపు వాదనలకు అవకాశం ఇవ్వాలని సాల్వే మరోసారి కోరగా ధర్మాసనం అనుమతించింది.

గవర్నరు అనుమతి లేకుండా అరెస్టు చేశారు: సాల్వే

సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నర్ అనుమతి లేకుండా దర్యాప్తు చేయడం సరికాదని సాల్వే తెలిపారు. ముందుగా అనుమతి తీసుకున్నాకే చర్యలు చేపట్టాలన్నారు. సెక్షన్ 17ఏ దుర్వినియోగం కాకుండా ఉండాలనే తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు కేసులో యశ్వంత్ సిన్హాపై దాఖలైన కేసుతో సహా మూడు కేసుల్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తు అనేది హక్కు కాదని అవినీతి నిరోధక చట్టం చెబుతోందంటూ... ఆర్టికల్ 20(1)కి సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కూడా సాల్వే ఉదహరించారు. సాల్వే ఇలా పలు తీర్పులను ప్రస్తావిస్తుండగా... జస్టిస్ బోస్ వారించారు. చంద్రబాబు అరెస్టుకు గవర్నర్ అనుమతి ఉండాలని చెప్పడమే తన ఉద్దేశమని సాల్వే వ్యాఖ్యానించారు. దీంతో అసలు ఎఫ్ఐఆర్‌లో ఉన్న అభియోగాలేంటని జస్టిస్ బేలా ఎం త్రివేదీ ఆరా తీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో కుట్రకు పాల్పడ్డారన్నది ప్రధాన అభియోగం అని సాల్వే తెలిపారు. ఐపీసీ సెక్షన్ 120బీ, సెక్షన్ 420, సెక్షన్ 465 , అవినీతి నిరోధక (పీసీ) చట్టం సెక్షన్ 12, సెక్షన్ 13 వంటివి ఈ కేసులో ఉన్నాయన్నారు. ''ఈ కేసు పూర్తిగా అవినీతి నిరోధక చట్టం కిందనే ఉంది. ఆ చట్టం లేకపోతే మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచాల్సి వచ్చేది''అన్నారు. అయితే ఈ అభియోగాలన్నీ మేజిస్ట్రేట్ ముందు విచారణ చేయతగిన అభియోగాలేనా? అని జస్టిస్ బోస్ ప్రశ్నించారు. పీసీ చట్టం మినహాయిస్తే ఇవన్నీ మేజిస్ట్రేట్ పరిధిలోవేనని సాల్వే తెలిపారు. మధ్యప్రదేశ్‌లో కొన్ని అంశాల్లో సెషన్స్ కోర్టు వెళ్లిన ధాఖలాలున్నాయని చంద్రబాబు తరపు మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా చెప్పగా... జస్టిస్ త్రివేది జోక్యం చేసుకొని దేశమంతా ఒకే విధంగా ఉంటుందని, మేజిస్ట్రేట్ పరిధిలోనే ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో చంద్రబాబు తరపున వాదనలు ముగించారు.

సవరణల పేరుతో కేసు కొట్టేయమంటే ఎలా?: రోహత్గి

ఏపీ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ... చంద్రబాబుపై నమోదైన కేసులో ఎలాంటి రాజకీయ కక్షా లేదని మరోసారి స్పష్టం చేశారు. ''ఎఫ్ఐఆర్ 2021లో నమోదయింది. 2023లో చంద్రబాబును నిందితుడిగా చేర్చారు''అంటూ సెప్టెంబరు 8 నుంచీ జరిగిన పరిణామాలు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ''చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టేసింది. ఈ కేసు పీసీ చట్టంలోని సెక్షన్ 17ఏకు లోబడే ఉందని కూడా హైకోర్టు స్పష్టం చేసింది. అయినా అరెస్టయిన వెంటనే బెయిలు గురించో, రిమాండ్ వద్దనో కాకుండా నేరుగా పూర్తి కేసును కొట్టేయాలంటూ క్వాష్ పిటిషన్ వేశారంటే చంద్రబాబు ఏంటో అర్థం చేసుకోవాలి. రెండు రోజుల్లోనే హైకోర్టు ముందుకు క్వాష్ పిటిషన్ విచారణకు వచ్చిందంటే నిందితుడి ఉద్దేశాలను కోర్టు ఆలోచించాలి. కాకపోతే హైకోర్టు ఈ క్వాష్ పిటిషన్ కొట్టేసింది'' అని రోహత్గీ వివరించారు. ఒకే కేసులో అవినీతి నిరోధక చట్టం, ఐపీసీ సెక్షన్లు ఉన్నప్పుడు ఏం చేయాలనే దానిపై కోర్టుకు రోహత్గీ వివరణ ఇచ్చారు. చేసిన నేరానికి రెండు సెక్షన్లు వర్తింపజేసినప్పుడు ఏసీబీ కోర్టుకి రెండింటినీ విచారించే పరిధి ఉంటుందన్నారు. అయితే, సాల్వే చెప్పినట్లుగా అవినీతి నిరోధక చట్టాన్ని తొలగిస్తే.. సీఆర్‌పీసీ సెక్షన్ 3 కింద పేర్కొన్న నేరంతోపాటు ఇతర అభియోగాలు కూడా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పరిశీలించవచ్చునని చెప్పారు. ఈ దశలో జస్టిస్ త్రివేది జోక్యం చేసుకొని అవినీతి నిరోధక చట్టం తొలగించినప్పుడు సెక్షన్ 4(3) కూడా వర్తించదు కదా? అని ప్రశ్నించారు. అందుకే ఒకే కేసులో వేర్వేరు అభియోగాలుంటే ఏం చేయాలనే దానిపై సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చిందని రోహత్గీ చెప్పారు. చంద్రబాబు కేసులో పీసీ చట్టాన్ని తొలగించినా మిగతా అభియోగాలపై ప్రత్యేక కోర్టు దర్యాప్తు చేయొచ్చని వివరించారు. ''చంద్రబాబు న్యాయవాది సాల్వే ప్రకారం ఈ కేసులో పీసీ చట్టం అభియోగాలు తొలగిస్తే.. సెక్షన్ 4(3) అభియోగాలకు అర్హత లేదు. అప్పుడు ప్రత్యేక కోర్టు పరిధి... ఆ కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల సంగతేంటి''అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించారు. సెక్షన్ 420 కింద అభియోగాలు ఉంటే వాటిని తొలగించలేమని, అదే విధంగా ఈ కేసులో పీసీ చట్టాన్ని కూడా తొలగించలేమని రోహత్గీ చెప్పారు. ''ఒక వ్యక్తి మరో వ్యక్తిని కొడితే ఆ కేసులో ఉద్దేశపూర్వకంగా కొట్టడంతో పాటు స్వచ్ఛందంగా హాని కలిగించడానికి సంబంధించిన సెక్షన్ 323 కూడా ఉంటుంది. ఆ సెక్షన్‌ను గనక తొలగిస్తే అభియోగాలు పోతాయా? చట్ట ప్రకారం సదరు వ్యక్తికి శిక్ష పడాలి కదా? సవరణల ద్వారా వచ్చిన కొత్త సెక్షన్లు చట్టానికి బలం చేకూర్చాలి తప్ప సవరణ పేరుతో కేసును కొట్టేయమంటే ఎలా?''అని రోహత్గీ ప్రశ్నించారు.

ఎప్పటి నేరాలకు అప్పటి సెక్షన్లు...

2018 కన్నా ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17ఏ వర్తించదని రోహత్గీ చెప్పారు. ''సెక్షన్ 17ఏ వల్ల దర్యాప్తునకు కొన్ని మినహాయింపులు వచ్చాయి. అంతే!. 2018లో పీసీ చట్టంలో కొన్ని సెక్షన్లు తొలగించారు. కానీ అంతకు ముందు జరిగిన నేరాలకు తొలగించిన సెక్షన్లు కూడా వర్తిస్తాయి. బాబు కేసు కూడా అంతే. చంద్రబాబుపై పీసీ చట్టం సెక్షన్ 13(1), (సీ), (డీ) అభియోగాలు ఉన్నాయి''అన్నారు. ఆ సెక్షన్లను చట్టం నుంచి తొలగించారుగా? అని జస్టిస్ త్రివేదీ ప్రశ్నించగా... ఇంతకు ముందు తాను చెప్పిన అంశం ఇదేనని, సవరణకు ముందు జరిగిన నేరాలకు తొలగించిన సెక్షన్లు వర్తిస్తాయని రోహత్గీ వివరించారు. చంద్రబాబు నిర్ణయాలు, అక్రమాల వల్ల రాష్ట్ర ఖజానాకు నష్టం వచ్చిందన్నారు. ఈ అంశాలు దర్యాప్తు సంస్థ ఎప్పుడు గుర్తించిందో తెలపాలని జస్టిస్ త్రివేదీ కోరారు. ట్రయల్ దశలోనే గుర్తించారని రోహత్గి తెలిపారు. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ కొత్త విషయాలు తెరపైకి వచ్చాయని, భారీ స్థాయిలో అవినీతి జరిగినప్పుడు ప్రాథమికంగానే కేసు కొట్టేయాలని కోరడం సరికాదని రోహత్గీ తెలిపారు.

చట్ట సవరణ ఎప్పుడు చేయాలి? దాన్ని ఎప్పటి నుంచి అమలులోకి తేవాలి? అనేది పార్లమెంటు అధికారమని, అయితే ఈ కేసులో 2018 కన్నా ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17ఏ ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలని సవరణలో ఎక్కడా లేదని రోహత్గీ వివరించారు. ''తప్పు చేసిన వారంతా సెక్షన్ 17ఏను చూపించి అనుమతులు తీసుకురమ్మంటే ఎలా? ఇలాగైతే దర్యాప్తు చేయడానికి అధికారులు ముందుకొస్తారా? మన పార్లమెంటు విధానమే అవినీతి రహిత దేశం... ఇందులో భాగంగానే చట్టాలు, సవరణలు వచ్చాయి. కాబట్టి అవినీతికి పాల్పడే వారికి సెక్షన్ 17ఏ అండ కాకూడదు. అది ఉన్నది నిజాయితీ పరులకు మద్దతు ఇవ్వటానికి''అని రోహత్గీ వివరించారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్ వేశారు కనక ఈ దశలో మెరిట్స్‌లోకి వెళ్లకూడదని ముకుల్ రోహత్గి పేర్కొన్నారు. అధికారిక విధులంటే ఏంటి? సిఫార్సులు అంటే ఏంటి? నిర్ణయాలంటే ఏంటి? ఇవన్నీ సాక్ష్యాల మీద ఆధారపడి ఉంటాయని, మౌఖికంగా వాదించేది కాదని రోహత్గీ తెలిపారు. సెక్షన్ 17ఏ రక్షణ కల్పిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నించగా.. గతంలో జరిగిన వాటికి రక్షణగా ఉండదని, కానీ పిటిషనర్ అదే కోరుకుంటున్నారని రోహత్గీ తెలిపారు.

ఎప్పుడైనా కేసు నమోదు చేయొచ్చు...

ఈ దశలో జస్టిస్ త్రివేదీ జోక్యం చేసుకొని సవరణ తర్వాత సదరు చట్టంనుంచి సెక్షన్‌ను తొలగిస్తే.. ఆ సెక్షన్ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చా? అని ప్రశ్నించారు. దానికి వెసులుబాటు ఉందని రోహత్గీ చెప్పారు. ''ఫలానా నేరానికి ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడని ఏ చట్టమూ చెప్పలేదు. కాబట్టి సెక్షన్ తొలగించారని అనడం సరికాదు''అన్నారు. దీన్ని వివరించాలని జస్టిస్ త్రివేది కోరగా... ''ఆర్టికల్ 20(1) ప్రకారం ఓ వ్యక్తి నేరం చేసిన విషయం కొన్నేళ్ల తర్వాత తెలిసినా కూడా కేసు నమోదు చేయొచ్చని చట్టం చెబుతోంది. దీనికి కొన్ని పరిధులు ఉండొచ్చు కానీ కేసు నమోదుకు ఆటంకమేమీ ఉండదు. మూడేళ్లకు మించి శిక్ష పడే కేసులకు ఏదో ఒక దశలో ఎఫ్ఐఆర్ ఉండాలని సీఆర్‌పీసీ సెక్షన్ 468 చెబుతోంది''అంటూ సీఆర్‌పీసీ సెక్షన్ 6 గురించి రోహత్గీ చెప్పబోతుండగా.. విచారణ అవసరం లేదంటోందిగా?! అని జస్టిస్ త్రివేది అడిగారు. ''అవును నిజమే. కానీ ఇక్కడ ఎఫ్ఐఆర్ నమోదయిందా లేదా అనేది ముఖ్యం''అని రోహత్గీ చెప్పారు. భోజన విరామ అనంతరం మధ్యాహ్నం వేరే కేసులు ఉన్నాయని విచారణను శుక్రవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే వాదనలు మంగళవారమే ముగించాలని లూథ్రా కోరగా ధర్మాసనం నిరాకరించింది.

తత్తరపాటు.. బిత్తర చూపులు!

ఏపీ సీఐడీ విచారణలో లోకేశ్ తడబాటు.. అసహనం

'ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ గురించి నాకేం తెలీదు.. అసలు ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని భూములను హెరిటేజ్ ఫుడ్స్ కొనడం గురించి నాకేం తెలియదు' - నారా లోకేశ్

'భూముల కొనుగోలుకు తీర్మానిస్తూ హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ మీటింగ్‌లో చేసిన తీర్మానం ఇదిగో. ఆ మీటింగ్‌లో మీరూ పాల్గొన్నారు. మినిట్స్ రికార్డుల్లో సంతకం కూడా చేశారు. అయినా కూడా మీకు భూముల కొనుగోలు గురించి తెలీదంటారా?'
- సీఐడీ అధికారుల సూటి ప్రశ్న



సాక్షి, అమరావతి: సీఐడీ సంధించిన సూటి ప్రశ్నలకు తత్తరపాటుకు గురై బిత్తరపోవడం లోకేశ్ వంతైంది. మాజీ సీఎం చంద్రబాబు తరహాలోనే ఆయన తనయుడు నారా లోకేశ్ కూడా సీఐడీ దర్యాప్తునకు సహకరించకుండా మొండికేసేందుకు శతవిధాలుగా ప్రయత్నించారు. అయితే సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతో ప్రశ్నించేసరికి తడబాటుకు గురై అసహనం ప్రదర్శించారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో ఏ–14గా ఉన్న నారా లోకేశ్ సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణకు మంగళవారం హాజరయ్యారు. సిట్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన్ను అధికారులు విచారించారు. కోర్టు ఆదేశాల ప్రకారం లోకేశ్‌కు సమీపంలో న్యాయవాది ఉండేందుకు అవకాశమిచ్చి మరీ విచారించారు. ముందుగా సిద్ధం చేసుకున్న ప్రశ్నావళిని బట్టి సీఐడీ అధికారులు ఒక్కో ప్రశ్న అడుగుతూ విచారణ కొనసాగించారు. సుహృద్భావ వాతావరణంలో విచారణ ప్రక్రియ కొనసాగించేందుకు ప్రాధాన్యమిచ్చారు. లోకేశ్ సహకరించడం లేదని స్పష్టమవుతున్నా ఓపిగ్గా ప్రశ్నలు సంధిస్తూ 6 గంటలపాటు విచారించారు. మరింత సమాచారాన్ని రాబట్టేందుకు బుధవారం మరోసారి విచారణకు హాజరు కావాలని లోకేశ్‌కు నోటీసులిచ్చారు.

మరిన్ని ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అన్నింటా బాబు బాటలోనే..

అవినీతికి పాల్పడటంలోనే కాదు సీఐడీ దర్యాప్తునకు సహకరించకుండా మొండికేయడంలో తండ్రి చంద్రబాబు బాటనే లోకేశ్ అనుసరించారు. విచారణను తప్పించుకునేందుకు చేసిన యత్నాలు బెడిసికొట్టడంతో అనివార్యంగా లోకేశ్ సీఐడీ ఎదుట హాజరయ్యారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సంబంధించి సీఐడీ అధికారులు ఏ ప్రశ్న అడిగినా తనకు తెలీదనే చెబుతూ వచ్చారు. అలైన్‌మెంట్‌ను మూడు సార్లు మార్చిన విషయంపై ప్రశ్నిస్తే అసలు తనకు ఆ విషయమే తెలియదని చెప్పుకొచ్చారు. హెరిటేజ్ ఫుడ్స్ భూముల కొనుగోలుకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు తనకు తెలీయదని..గుర్తు లేదని చెప్పడం గమనార్హం. హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్ హోదాలో మీరు ఎలాంటి విధులు నిర్వహించారు..? ఎలాంటి నిర్ణయాల్లో భాగస్వామి అయ్యారనే ప్రశ్నలకు సమాధానాలను దాటవేశారు. సీఐడీ అధికారులు విచారణ నియమావళి ప్రకారం అడిగిన ప్రశ్నలకు సమాధానాలు గూగుల్‌లో సెర్చ్ చేసినా దొరుకుతాయని లోకేశ్ వ్యాఖ్యానించడం గమనార్హం. తాను నిందితుడిననే కనీస స్పృహ కూడా లేకుండా అధికారులను దబాయించేందుకు యత్నించినట్లు సమాచారం.

ఇవిగో ఆధారాలు.. మరేమంటారు?

విచారణకు సహకరించకుండా కేసు దర్యాప్తును తప్పుదారి పట్టించేందుకు లోకేశ్ యత్నిస్తుండటంతో ఒక దశలో సీఐడీ అధికారులు ఇక లాభం లేదని గేర్ మార్చారు. అంతవరకు ఏ ప్రశ్న అడిగినా తనకు తెలియదని చెబుతూ వచ్చిన వాటికి సంబంధించి ఆధారాలను ఒక్కొక్కటిగా చూపుతూ ఆరా తీయడంతో లోకేశ్ కంగుతిన్నారు. హెరిటేజ్ ఫుడ్స్ భూములను కొనుగోలు చేసిన విషయం తనకు తెలియదని లోకేశ్ మొదట బుకాయించారు. అయితే ఆయన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల మీటింగులో పాల్గొన్నట్టు నిరూపించే రికార్డులను చూపించడంతోపాటు భూముల కొనుగోలుకు ఆమోదించిన తీర్మానం కాపీని కూడా అధికారులు ప్రదర్శించడంతో తత్తరపాటుకు గురయ్యారు. వాటిపై సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించడంతో తన న్యాయవాదితో మాట్లాడి చెబుతానన్నారు. అందుకు సీఐడీ అధికారులు అనుమతించడంతో సమీపంలోనే ఉన్న న్యాయవాదితో మంతనాలు జరిపారు. అనంతరం తిరిగి వచ్చి ఆ సమావేశంలో చాలా అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారని, అయితే అవేవీ తనకు గుర్తు లేదని సమాధానమిచ్చారు. రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పుల విషయంపై తనకు తెలియదని బుకాయించేందుకు లోకేశ్ చేసిన యత్నాలు బెడిసికొట్టాయి. ఎందుకంటే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకుని ఉన్న భూములనే కొనుగోలు చేయాలని హెరిటేజ్ ఫుడ్స్ నిర్ణయించింది. అక్కడ భూములను కొనుగోలు చేయడం వ్యాపార విస్తరణకు ఉపయోగపడుతుందని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. రాజధాని కోసం భూసమీకరణకు ప్రభుత్వం భూములను తీసుకుంటున్న ప్రాంతంలో భూములు కొనుగోలు చేయడం వ్యాపార విస్తరణకు ఎలా దోహదపడుతుందని భావించారని సీఐడీ అధికారులు సూటిగా ప్రశ్నించారు. అంటే ఆ ప్రాంతంలోని భూములు భూసమీకరణకు కిందకు రావని మీకు ముందే తెలుసా? అని సూటిగా నిలదీసేసరికి లోకేశ్ నీళ్లు నమిలారు. హెరిటేజ్ ఫుడ్స్ కొనుగోలు చేయాలని నిర్ణయించిన భూములను ఆనుకునే లింగమనేని కుటుంబానికి చెందిన భూములున్న విషయం మీకు తెలుసా అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. మీ తండ్రి చంద్రబాబుతో కలసి మీరు నివసిస్తున్న కరకట్ట బంగ్లా లింగమనేని కుటుంబం ఇచ్చిందనే విషయంపై మీకు అవగాహన ఉందా? అని ప్రశ్నించగా ఆయన చాలా సేపు మౌనం వహించారు. క్విడ్‌ప్రోకో కిందే ఆ కరకట్ట నివాసం మీకు వచ్చిందన్న అభియోగంపై మీ అభిప్రాయం ఏమిటని ప్రశ్నించినా సరే లోకేశ్ సూటిగా సమాధానం చెప్పకపోవడం గమనార్హం. దీనిపై సీఐడీ అధికారులు గట్టిగా నిలదీయడంతో తన న్యాయవాదితో చర్చించి చెబుతానన్నారు. న్యాయవాదితో మాట్లాడిన తరువాత కూడా కరకట్ట నివాసంపై సమాధానం చెప్పకుండా దాటవేత వైఖరి అవలంబించారు. కరకట్ట నివాసం గురించి తనకేమీ తెలియదని, తాము అద్దె చెల్లించినట్లు గుర్తుందని, పూర్తి వివరాలు లింగమనేని రమేశ్‌నే ప్రశ్నించాలంటూ కప్పదాట వైఖరి అనుసరించారు.

వెళ్లండి... రేపు రండి

లోకేశ్ నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు ఆయన్ను మరోసారి విచారించాలని సీఐడీ అధికారులు నిర్ణయించారు. కేసు సమగ్ర దర్యాప్తు కోసం భూసమీకరణ, మాస్టర్‌ప్లాన్, నారాయణ తదితరుల పాత్రపై విచారించాలని భావిస్తున్నారు. ఈమేరకు బుధవారం విచారణకు రావాలంటూ సెక్షన్ 41 ఏ కింద లోకేశ్‌కు నోటీసులు ఇచ్చారు.

గూగుల్‌లో వెతికితే చాలు: లోకేశ్

తన గురించి గూగుల్‌లో వెతికినా లభించే సాధారణ సమాచారాన్నే సీఐడీ అధికారులు విచారణలో ప్రశ్నించారని లోకేశ్ వ్యాఖ్యానించారు. తొలిరోజు విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో సీఐడీ వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. కక్ష సాధింపు కోసమే తమపై కేసు నమోదు చేశారని ఆరోపించారు.

ప్రజల్లోకి మరింత ఉధృతంగా..

- 52 నెలలుగా ప్రతి ఇంటికీ మన ప్రభుత్వం చేస్తున్న మంచిపై మరింతగా ప్రచారం చేయండి
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలకు పార్టీ అధ్యక్షులు, ఏపీ సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 52 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు.. విప్లవాత్మక మార్పులతో సుపరిపాలన ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేస్తున్న మంచిని చాటిచెప్పడానికి పార్టీ శ్రేణులు మరింత ఉధృతంగా ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. విజయవాడలో సోమవారం జరిగిన పార్టీ ప్రతినిధుల సదస్సులో నిర్దేశించిన అంశాలపై నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించాలని సూచించిన విషయం తెలిసిందే. దసరా పండుగ తర్వాత ఈనెల 26 నుంచి సామాజిక న్యాయ యాత్ర పేరుతో మూడు ప్రాంతాల్లో



చేపట్టే బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో.. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలతో సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సదస్సులో నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై వారితో చర్చించి.. వాటిని ప్రజల్లోకి ప్రభావవంతంగా తీసుకెళ్లాలని చెప్పారు.

ఇది నా పార్టీ అని పేదలు భావించాలి..

దసరా పండుగ ముగిశాక.. అక్టోబర్ 26 నుంచి సామాజిక న్యాయ యాత్ర పేరుతో బస్సుయాత్ర మొదలుపెట్టాలని ప్రాంతీయ సమన్వయకర్తలకు సీఎం జగన్ సూచించారు. ఈ యాత్రను విజయవంతం చేయడానికి ప్రాంతాల వారీగా బాధ్యులను నియమిస్తామన్నారు. ఈ యాత్ర సందర్భంగా మూడు ప్రాంతాల్లో నిర్వహించే బహిరంగసభల ఏర్పాట్లను సమన్వయపరచడానికి కూడా ముగ్గురు బాధ్యులను నియమిస్తామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బస్సు యాత్ర నిర్వహించి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఒక్కోటి చొప్పున ప్రతిరోజూ మూడు సమావేశాలు నిర్వహించాలని స్పష్టంచేశారు. ఇది అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని.. ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని సమావేశాలు విజయవంతమయ్యేలా చూడాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు ఈ సమావేశాల్లో మాట్లాడతారని చెప్పారు. 52 నెలల పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు చేసిన మేలును ఈ సమావేశాల ద్వారా వివరించి.. ఆ వర్గాలకు పార్టీని మరింత చేరువ కావాలన్నారు. ఇక వచ్చే ఎన్నికలు పేదవాడికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధమని జగన్ చెప్పారు. జరుగుతున్నది కులాల వార్ కాదు, ఇది క్లాస్‌వార్ అని పునరుద్ఘాటించారు. పేదవాడు మన పార్టీని తన పార్టీగా ఓన్ చేసుకునేలా బస్సుయాత్రలు ప్రభావవంతంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. వచ్చే 2 నెలలపాటు ఈ బస్సు యాత్ర జరగాలన్నారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించే సమావేశాలపై తేదీ, స్థలం సహా పక్కా ప్రణాళిక తయారుచేసుకోవాలని ప్రాంతీయ సమన్వయకర్తలను సీఎం వైఎస్ జగన్ సూచించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధం అంశాలను ప్రస్తావిస్తూ ఈ బస్సు యాత్ర జరగాలన్నారు.

14న భేటీ తర్వాత అభ్యర్థుల జాబితా

▶ మొదటి పేజీ తరువాయి

స్థానాల్లో ఇద్దరేసి అభ్యర్థుల పేర్లతో జాబితాను రూపొందించింది. ఒక్కో స్థానంలో ఖరారైన అభ్యర్థుల జాబితాపై సీఈసీలో ఎలాంటి అభ్యంతరాలు లేనిపక్షంలో వాటిని యథావిధిగా ఆమోదించనున్నారు. ఏవైనా అభ్యంతరాలుంటే సహేతుక కారణాలను చూపి మరో అభ్యర్థిని ముందుకు తెచ్చే అవకాశాలుంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఇద్దరేసి అభ్యర్థులున్న చోట్ల ఎంపిక నిర్ణయానికి సీఈసీ కొన్ని మార్గదర్శకాలు సూచిస్తుందని, వాటికనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెబుతున్నాయి. ఈ నెల 16 లేదా 18న తొలి జాబితా విడుదల చేసేలా ఇప్పటికే నేతల నుంచి హైకమాండ్‌కు ఒత్తిళ్లు పెరిగాయి. దానికి అనుగుణంగా వారంలోనే జాబితా విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఆరు నెలలకు ముందు నిర్ణయాలు, నియామకాలపై సమీక్ష

- అధికారంలోకి రాగానే రద్దు చేస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడి
- బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం
- ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- గాంధీ భవన్‌లో భేటీ అయిన కాంగ్రెస్ పీఏసీ



గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి. చిత్రంలో మధుయాష్కీ, భట్టి విక్రమార్క, సంపత్‌కుమార్, అంజన్‌కుమార్ యాదవ్, చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి ఆరు నెలల ముందు వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, నియామకాలన్నీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సమీక్షించి రద్దు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. ఔటర్ రింగురోడ్డు, కోకాపేట భూములు, పాలమూరు ఎత్తిపోతల టెండర్లు..ఇలాంటివన్నీ సమీక్షిస్తామని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ అధికారులు నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుందని, అలా కాకుండా బీఆర్ఎస్‌కు రాజకీయ ప్రయోజనం చేకూర్చేలా వ్యవహరిస్తున్న అన్ని స్థాయిల్లోని అధికారులపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇందుకోసం టీపీసీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే అధ్యక్షతన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జరిగింది. పలు అంశాలపై సభ్యులు చర్చించారు. అనంతరం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పార్టీ నేతలు మధుయాష్కీ, సంపత్‌కుమార్, అంజన్‌కుమార్ యాదవ్, చిన్నారెడ్డిలతో కలిసి రేవంత్ విలేకరులతో మాట్లాడారు.

అలాంటి టీవీలు, పత్రికలపై ఫిర్యాదు చేస్తాం

ఆర్థిక శాఖ అధికారుల నుంచి మంత్రుల వరకు నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ ప్రయోజనం కోసం నిధులు విడుదల చేస్తున్నారని అలాంటి విషయాలు, సంబంధిత అధికారులపై ఈసీకి ఫిర్యాదు చేస్తామని టీపీసీసీ చీఫ్ వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పింఛన్లు తప్ప మిగిలిన అన్ని సంక్షేమ పథకాలకు నిధులు ఆపేయాలన్నారు. ఈ మేరకు అన్ని స్థాయిల్లోని అధికారులపై తాము నిఘా పెట్టామని తెలిపారు. కొన్ని పత్రికల్లో కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య అపోహలు సృష్టించేలా కథనాలు వస్తున్నాయని, కొన్ని టీవీలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బాకా ఊదుతున్నాయని, ఈ పత్రికలు, టీవీలపై కూడా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పార్టీ అభ్యర్థుల ప్రకటన, పొత్తుల విషయంలో మీడియా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. టికెట్లు రానివారితో చర్చలు జరిపేందుకు పార్టీ నేతలు ఠాక్రే, దీపాదాస్ మున్షీ, మీనాక్షి నటరాజన్, జానారెడ్డిలతో ఏఐసీసీ కమిటీ ఏర్పాటు చేసిందన్నారు.

జాతీయ నాయకత్వం సూచన మేరకు...

పార్టీ సీనియర్లు నిర్వహించ తలపెట్టిన బస్సు యాత్ర ఖర్గే, రాహుల్, ప్రియాంకలు హాజరయ్యేలా 15 నుంచి 22వ తేదీ వరకు యాత్ర చేయాలా? దసరా పండుగ తర్వాత 25 నుంచి ఎన్నికల వరకు చేయాలా అనే చర్చ జరిగిందని రేవంత్ తెలిపారు. అభ్యర్థులను ప్రకటించి బస్సుయాత్రకు వెళ్దామా? బస్సు యాత్ర మధ్యలో అభ్యర్థులను ప్రకటించాలా? అనేది కూడా ప్రస్తావనకు వచ్చిందని, వీటిపై జాతీయ నాయకత్వం సూచన మేరకు ముందుకు వెళతామని అన్నారు. పులి బయటకు వస్తోందని సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ చేసిన ప్రకటనపై రేవంత్ స్పందించారు. 'పులి చచ్చిపోయిన శవాన్ని కూడా వదలకుండా తింటుంది. సింహం ఎప్పుడు తినాలనుకుంటే అప్పుడు వేటాడి తింటుంది. కేసీఆర్‌ను పులితో పోల్చినందుకు కేటీఆర్‌కు అభినందనలు. దోపిడీ సొమ్ము ప్రగతి భవన్‌లో కుళ్లి పోయేంతవరకు కేసీఆర్ తింటున్నాడు..'అని ఆరోపించారు.

ప్రాథమిక స్థాయిలోనే పొత్తుల చర్చలు: భట్టి

వామపక్షాలతో పొత్తులకు సంబంధించిన చర్చలు జరుగుతున్న మాట వాస్తవమే కానీ, ఇవింకా ప్రాథమిక స్థాయిలోనే ఉన్నాయని ఫైనల్ కాలేదని భట్టి తెలిపారు. బీసీ జనాభా గణన గురించి సీడబ్ల్యూసీ చర్చించి ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాన్ని పీఏసీ స్వాగతించిందని, అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపామని చెప్పారు. పార్టీ అభ్యర్థుల జాబితాపై వస్తున్న కథనాలు ఊహాగానాలు మాత్రమేనన్నారు.

ఏపీలో ఉద్యోగ నియామకాల వయోపరిమితి పెంపు

- నాన్ యూనిఫాం పోస్టులకు అర్హత వయసు 34 నుంచి 42 ఏళ్లకు పెంపు
- యూనిఫాం సర్వీస్ పోస్టులకు అర్హత వయసు మరో రెండేళ్లు పెంపు

సాక్షి, అమరావతి: వయసు మీరిన నిరుద్యోగులకు మేలు చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఇతర రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నేరుగా భర్తీ చేసే నాన్ యూనిఫాం పోస్టులు, యూనిఫాం పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. నాన్ యూనిఫాం పోస్టులకు అభ్యర్థుల వయో పరిమితిని 34 నుంచి 42 సంవత్సరాలకు పెంచింది. యూనిఫాం పోస్టులకు ప్రస్తుతం ఉన్న వయోపరిమితికి అదనంగా రెండు సంవత్సరాలను పెంచింది. ఈ వయోపరిమితి పెంపుదల వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.


ప్రమీలా ప్రభ

శత్రు దేశాలు, ఉగ్రమూకలు, తీవ్రవాదులు విరుచుకుపడినప్పుడు ఎంత శక్తిమంతమైన దేశమైనా అల్లకల్లోలంగా మారిపోతుంది. ఆ మధ్యన అఫ్ఘానిస్థాన్ పరిస్థితి ఇలానే ఉండేది. అది మర్చిపోయే లోపు ఉక్రేయిన్ రష్యా యుద్ధం మొదలై నేటికీ కొనసాగుతూనే ఉంది. అఫ్ఘానిస్థాన్, ఉక్రెయిన్‌లలో ఏర్పడిన పరిస్థితులకు భయ పడిపోయిన చాలామంది ప్రజలు ప్రాణాలు అరచేత బట్టి దేశం విడిచి పారిపోయారు. ఇక ఆయా దేశాల్లో ఉన్న విదేశీయులు ముందుగానే పెట్టే బేడా సర్దుకుని తమ తమ దేశాలకు పరుగెత్తుకెళ్లారు. ప్రస్తుతం ఇజ్రాయెల్ పరిస్థితి కూడా ఇలానే ఉంది. అయినా అక్కడ నివసిస్తోన్న 41 ఏళ్ల ప్రమీలా ప్రభ మాత్రం "నేను ఇండియా రాను. ఇక్కడే ఉండి సేవలందిస్తాను" అని ధైర్యంగా చెబుతోంది.

పారిపోను.. సాయం చేస్తా

కర్ణాటకలోని ఉడిపి జిల్లా.. హెర్గాలో పుట్టి పెరిగింది ప్రమీలా ప్రభ. మైసూర్‌లో చదువుకుంది. చదువు పూర్తయ్యాక ఉడిపిలోని మణిపాల్ ఆసుపత్రిలో నర్స్‌గా చేరింది. కొన్నాళ్లు ఇక్కడ పనిచేశాక, ఇజ్రాయేల్‌లో మంచి జీతంతో ఉద్యోగం దొరకడంతో.. తన ఇద్దరు పిల్లలతో ఇజ్రాయెల్‌కు వెళ్లింది. గత ఆరేళ్లుగా అక్కడే ఉంటోన్న ప్రమీలా ఆ దేశం మీద అక్కడి ప్రజల మీద మమకారం పెంచుకుంది. అందుకే పరిస్థితులు దారుణంగా ఉన్నప్పటికీ ... ''ఇండియా నాకు జన్మనిస్తే.. ఇజ్రాయెల్ జీవితాన్నిచ్చింది. ఇలాంటి కష్ట సమయంలో దేశాన్ని వదిలి రాను. నేను చేయగలిగిన సాయం చేస్తాను'' అని కరాఖండిగా చెబుతూ అక్కడి పరిస్థితులను ఇలా వివరించింది....

నేను టెల్ అవీవ్ యాఫోలో నివసిస్తున్నాను. అక్టోబర్ 7తేదీన రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో భోజనం చేశాము. అప్పుడు ఎమర్జెన్సీ సైరన్ వినిపించింది. వెంటనే మేమంతా బంకర్‌లోకి వెళ్లిపోయాము. దాదాపు రాత్రంతా సైరన్ వినిపిస్తూనే ఉంది. నేను ఇజ్రాయెల్ వచ్చాక ఇంతపెద్ద హింసను ఎప్పుడూ చూడలేదు. మా ఇంటికి కిలోమీటర్ దూరంలో బాంబులు పడుతున్నాయి. పెద్దపెద్ద శబ్దాలు ఒక్కసారిగా భయపెట్టేశాయి. ఇక్కడ ప్రతి ఇంటికి బంకర్‌లు ఉన్నాయి. పబ్లిక్ ప్లేసుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బంకర్లు కూడా ఉన్నాయి. ఎమర్జెన్సీ సమయంలో ఎవరైనా వీటిలోకి వెళ్లి తలదాచుకోవచ్చు. సైరన్ మోగిన వెంటనే కనీసం ముప్పైసెకన్ల పాటు బాంబుల శబ్దాలు వినపడుతున్నాయి. దశాబ్దకాలంగా ఇజ్రాయెల్‌పై తీవ్రవాద సంస్థ హమాస్ దాడులకు తెగబడుతూనే ఉంది. హమాస్ వల్ల గాజా కూడా దాడులతో కొట్టుమిట్టాడుతూనే ఉంది. ఇప్పటికే వెయ్యిమందికిపైగా చనిపోయారు. ఇక్కడి ప్రజలు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు. టెల్ అవీవ్‌లో షాపులు అన్నీ మూసేసారు. వీధుల్లో అక్కడక్కడ ఒకరిద్దరు మాత్రమే విక్రయాలు జరుపుతున్నారు. అందరూ కిరాణా సామాన్లు తెచ్చుకుని నిల్వ చేసుకుంటున్నారు.



అరగంట లోపలే...

మా చెల్లి ప్రవీణ జెరుసలేంలోని ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. నేను టెల్ అవీవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాను. ఈ అపార్ట్‌మెంట్‌లో ముప్పై మంది వరకు ఉన్నారు. మేమంతా అత్యవసరమైన ఆహారం, నీళ్లు, టార్చ్‌లైట్ వంటివాటిని దగ్గర ఉంచుకుని బేస్‌మెంట్ తలుపులు తెరుచుకుని ...సైరన్ రాగానే బంకర్‌లోకి పరుగెడుతున్నాం. సైరన్ ఆగినప్పుడు బంకర్‌ల నుంచి బయటకు వస్తున్నాం. బంకర్‌లోకి వెళ్లిన ప్రతిసారి అరగంట పాటు లోపలే ఉండాల్సి వస్తోంది.

ఊహకందని దాడి


ఇజ్రాయెల్‌మీద పాలస్తీనా దాడులు చేయడం ఇది కొత్తేమీ కాదు. కానీ ఇప్పుడు జరిగిన దాడి అస్సలు ఊహించలేదు. ఊహకందని వికృతదాడికి హమాస్ సంస్థ పాల్పడింది. దక్షిణ ఇజ్రాయెల్‌లో శాంతికోసం ఏర్పాటు చేసిన 'మ్యూజిక్ ఫెస్టివల్'ను ఇలా అశాంతిగా మారుస్తారని అసలు ఊహించలేదు. ఆ ఫెస్టివల్ గురించి అత్యంత బాధాకరమైన వార్తలు వినాల్సి వస్తోంది. ఇజ్రాయెల్ ఎప్పుడూ.. యుద్ధానికి అన్నివేళలా సన్నద్ధమై ఉండి, రక్షణాత్మక చర్యలను పర్యవేక్షిస్తుంటుంది. లేదంటే మరింతమంది హమాస్ దాడుల్లో ప్రాణాలు కోల్పోయేవారు.

ఇప్పుడు రాలేను..

ఇజ్రాయెల్ నాకు జీవితాన్నిచ్చింది. వీరు కష్టాల్లో ఉన్నప్పుడు నేను నా మాతృదేశం వచ్చి సంతోషంగా ఉండలేను. ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతిస్తే నా సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నాను. ఉడిపిలో ఉన్న మా కుటుంబ సభ్యులు పదేపదే ఫోన్ చేస్తున్నారు. నేను క్షేమంగా ఉన్నానా... లేదా... అని కంగారు పడుతున్నారు. ఇక నా పిల్లలు ఇండియా వెళ్లిపోయారు. వారిని విడిచి ఇక్కడ ఉన్నాను. వాళ్లంతా గుర్తొస్తున్నారు. అయినా ఇంతటి విపత్కర పరిస్థితుల నుంచి పారిపోవాలనుకోవడం లేదు. పరిస్థితులు చక్కబడిన తరువాత ఇండియా తిరిగి రావడం గురించి ఆలోచిస్తాను'' అని చెబుతూ ఎంతోమంది స్ఫూర్తిగా నిలుస్తోంది ప్రమీలా ప్రభ.

పురస్కారం






గౌరీ గిల్

లక్ష సైనికుల కోటి కన్నుల కెమెరా

'నా చేతిలో కెమెరా ఉంటే నాకు భయమనేదే లేదు' అనేది ఫొటోగ్రాఫర్ గౌరీ గిల్‌కు ఇష్టమైన మాట.

ఈ కారణం వల్లే కావచ్చు ఆమె ఏ భయమూ లేకుండా మారుమూల పల్లెల నుంచి మహా అరణ్యాల వరకు వెళ్లింది. తన భుజాల మీద కెమెరా ఉంటే, తన చుట్టూ లక్షల సైన్యం ఉన్నట్లే. వర్తమాన చరిత్ర, సంస్కృతి, సంబరాన్ని తన కెమెరా కంటితో పట్టుకుంది గౌరీ గిల్. తన ఫొటో సిరీస్ 'నోట్స్ ఫ్రమ్ ది డిజర్ట్'తో ప్రతిష్ఠాత్మకమైన ప్రిక్స్ పిక్‌టెట్ అవార్డ్ గెలుచుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన మల్టీనేషనల్ ప్రైవేట్ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ పిక్‌టెట్ 'ప్రిక్స్ పిక్‌టెట్' (ఇంటర్నేషనల్ అవార్డ్ ఇన్ ఫొటోగ్రఫీ)కి 2008లో శ్రీకారం చుట్టింది...

చండీగఢ్‌లో పుట్టిన గౌరి గిల్ దిల్లీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో బీఎఫ్ఏ చేసింది. న్యూయార్క్‌లోని 'పార్సన్ స్కూల్ ఆఫ్ డిజైన్'లో ఫొటోగ్రఫీలో బీఎఫ్ఏ, స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో ఫొటోగ్రఫీలో ఎంఎఫ్ఏ చేసింది. అమెరికా, ఇండియాలో ఉన్న బంధువులను ఫొటోలు తీయడంతో తన ప్రయాణం మొదలైంది.

రాజస్థాన్‌లోని అట్టడుగు వర్గాల జీవితాలను అధ్యయనం చేసిన తరువాత తాను చేసిన ఫొటో ప్రాజెక్ట్ 'నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్'కు మంచి పేరు వచ్చింది. 'ది మార్క్ ఆన్ ది వాల్' 'జన్నత్'... మొదలైన ఎగ్జిబిషన్‌లు, ప్రాజెక్ట్‌లతో ప్రశంసలు అందుకుంది.

నోట్స్ ఫ్రమ్ ది డెజర్ట్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే... ఈ ప్రాజెక్ట్ కోసం రాజస్థాన్‌లోకి అడుగు పెట్టినప్పుడు అక్కడి పరిస్థితుల గురించి పెద్దగా ఏమీ తెలియదు. ఒక్కొక్క అడుగు వేస్తూ అక్కడి సమాజాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించింది. సంచారుల నుంచి రైతుల వరకు ఎంతోమందితో మాట్లాడింది. కాలాలతో పాటు మారే వ్యక్తుల జీవితాలను గమనించింది. తాను పరిశీలించిన జీవితాల గురించి డైరీలో రాసుకుంది.

> 2011లో కెనడాలోని ప్రతిష్ఠాత్మకమైన ఫొటోగ్రఫీ అవార్డ్ గ్రాంజ్ గెలుచుకొని ప్రపంచ దృష్టిని ఆకర్షించిన గౌరికి వినడం ఇష్టమైన పని. విన్న విషయాలను విశ్లేషించుకొని తన కెమెరాకు ముడిసరుకుగా మార్చుకోవడం మరింత ఇష్టమైన పని.

ఆ తరువాత తన కెమెరా ప్రయాణం రాజస్థాన్ మారుమూల ప్రాంతాల నుంచి మహారాష్ట్రలోని ఆదివాసుల ఇళ్ల దగ్గరకు చేరింది. వర్లీ ఆర్ట్‌ను ఒడిసిపట్టుకుంది. ఫలానా ఊళ్లో ఫలానా ప్రత్యేకత ఉందనే మాట చెవికి సోకగానే రెక్కలు కట్టుకొని అక్కడ వాలుతుంది. మోహడా అనే ఊళ్లో గ్రామస్థులు పురాణ పాత్రల మాస్క్‌లను ధరించి పెద్ద ఊరేగింపు తీస్తారు. ఈ మాస్క్‌లనే సబ్జెక్ట్‌గా తీసుకొని ఫొటో ప్రాజెక్ట్ చేసింది. ఒకరోజు ఒక గ్రామంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్ లేడు. అయితే ఆ డాక్టర్ సీట్‌లో దోమ మాస్క్ పెట్టుకొని ఒక వ్యక్తి కూర్చున్నాడు. పేషెంట్ సీట్లో కూర్చున్న వ్యక్తి ఏదో మాస్క్ పెట్టుకున్నాడు. ఆ ఆస్పత్రిలోని పాత సామాను, గోడలకు వేసిన రంగులు, ఆస్పత్రి చుట్టుపక్కల రకరకాల ఆవులు, వాటిని కాచుకు కూర్చున్న రైతులు... ఈ అంశాలన్నీ వచ్చేలా ఫొటోలు తీసింది. ఈ ఫోటోల నుంచి ఆలోచించిన వారికి ఆలోచించినన్ని కోణాలు కనిపిస్తాయి. ఎవరి వ్యాఖ్యానాలూ అవసరం లేకుండానే సమాధానాలు దొరుకుతాయి.

మొదట్లో ఒక పక్షపత్రికలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసింది గౌరి. తన ఆసక్తి గ్రామాలు, మారుమూల పల్లెల్లోని స్కూళ్లపై ఉండేది. అయితే తన ఉద్యోగం ద్వారా పల్లెలకు వెళ్లే అవకాశం రాలేదు. దీంతో పల్లెబాట పట్టడానికి ఉద్యోగాన్ని వదిలింది. ఎన్నో స్కూళ్ల చుట్టూ తిరిగింది. 'ఇది స్కూల్ కాదు. ఇదే అసలు సిసలు ప్రపంచం' అనుకుంది. 'ది మార్క్ ఆన్ ది వాల్' ప్రాజెక్ట్‌తో ప్రభుత్వ పాఠశాలల్లోని గోడలపై ఉన్న రాతలు, చిత్రాలను డాక్యుమెంట్ చేసింది. 'ట్రేసెస్' పేరుతో సమాధులపై చేసిన ప్రాజెక్ట్ మరో అద్భుతం. నిజానికి గౌరీ గిల్ అద్భుతాలు సృష్టించడానికి కెమెరా పట్టుకోలేదు. భిన్న సంస్కృతులు, భౌగోళిక అందాలపై ఆసక్తే అద్భుతాలను సృష్టించి ఆమెను అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్‌ని చేశాయి.

బ్యూటిప్స్

తొక్కతో తోమేయండి!



పాదాలను మెరిపించడంలో అరటితొక్కలు చక్కగా పనిచేస్తాయి.

- అరటితొక్కలను పాదాలపైన రుద్దితే మృతకణాలు, దుమ్మూ ధూళీ తొలగిపోతాయి.
- అరటి తొక్కలను ముక్కలుగా తరిగి కొద్దిగా తేనె వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టుని పాదాలకు రాయాలి. అరగంట తరువాత సాధారణ నీటితో కడిగేయాలి. ఇలా వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పాదాలు మృదువుగా మారడంతో పాటు, చక్కగా మెరుస్తాయి.
- అరటితొక్కల పేస్టులో కొద్దిగా అలోవెరా జెల్ కలపాలి. ఈ పేస్టుని పాదాలకు అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. ఈ పేస్టు పాదాలకు తేమనందించి కోమలంగా ఉంచుతుంది.
- అరటితొక్కల పేస్టులో కాఫీపొడి, తేనె వేసి కలిపి స్క్రబర్‌లా పదిహేను నిమిషాలు రుద్దాలి. పాదాలపైన మురికి, మలినాలు పోయి చక్కగా మెరుస్తాయి.

కిచెన్‌టిప్స్

మంచుకొండలా? అమ్మో వద్దు..!

ఫ్రీజర్‌లో చిన్నచిన్న మంచుకొండల్లా ఐస్ పేరుకుపోతుంది. ఇలా గడ్డకట్టిన ఐస్‌పైన కొన్ని ఆహార పదార్థాలు పెడితే పాడవుతాయి. ఐస్ ఒకపట్టాన కరగదు. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్య తీరిపోతుంది.



- రిఫ్రిజిరేటర్ పవర్ స్విచ్ ఆపేసి గడ్డకట్టిన ఐస్‌ను కరిగించాలి.
- ఇప్పుడు బంగాళదుంపను శుభ్రంగా కడిగి రెండు ముక్కలు చేయాలి. రెండు ముక్కలతో ఫ్రీజర్ ర్యాక్స్‌ను రుద్దాలి. మూలల్లో కూడా జాగ్రత్తగా రుద్దాలి. ఇలా చేస్తే ఫ్రీజర్‌లో త్వరగా మంచు ఉండలు ఏర్పడవు.
- అవసరాన్ని బట్టి రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతలను మార్చుకుంటూ ఉంటే ఐస్ ఏర్పడదు.
- ఫ్రీజర్‌లో అతిగా ఆహార పదార్థాలను పెట్టకూడదు. ఎక్కువ మొత్తంలో వస్తువులు పెడితే ఐస్ ఏర్పడడానికి ఖాళీ ఉండదని కుక్కేస్తుంటారు. ఫ్రీజర్‌లో ఎంత ఎక్కువమొత్తంలో వస్తువులు ఉంటే అంత ఎక్కువ తేమ ఏర్పడి ఐస్‌గా మారుతుంది.
- చాలామంది ఇంటిని శుభ్రం చేస్తుంటారు కానీ రిఫ్రిజిరేటర్‌ను పెద్దగా పట్టించుకోరు. కనీసం పదిరోజులకొకసారి స్విచ్ ఆపేసి, లోపల ఉన్న పదార్థాలను బయటపెట్టి శుభ్రం చేస్తే ఐస్ సమస్య అంతగా ఉండదు.

గార్డెన్ టిప్స్

పుల్లలతో పూలు పూస్తాయి!

గార్డెన్‌లో ఎంతో ఇష్టంగా మొక్కలు పెంచుతుంటాము. సమయానికి నీళ్లుపోసి, మొక్కల ఎదుగుదలకోసం ప్రత్యేక శ్రద్ధ వహించినప్పటికీ కొన్ని మొక్కలు బలహీనంగా, వాడిపోయినట్టుగా ఉంటాయి. ఇలాంటి మొక్కలను పూలతో చక్కగా కళకళలాడేలా చేయాలంటే పాదులో అగ్గిపుల్లలు గుచ్చాలి. అవును అగ్గిపుల్లలే...



- అగ్గిపుల్లలను యాంటీమోనీ సల్ఫైడ్, పొటాషియం, సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్ రసాయనాలతో తయారు చేస్తారు. ఈ రసాయనాలు మొక్కలకు క్రిమిసంహారాలుగా పనిచేస్తాయి.
- అంతేగాక ఇవి వేర్లకు బలాన్ని ఇస్తాయి. సల్ఫర్, మెగ్నీషియం, క్లోరేట్‌లు మొక్కలు వేళ్ల నుంచి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.
- ముందుగా కుండిలోని మొక్క చుట్టూ కొన్ని నీళ్లుపోయాలి. ఇప్పుడు పది అగ్గిపుల్లలను రసాయనం ఉన్నవైపు మట్టిలోకి గుచ్చాలి.
- పుల్ల పుల్లకు కొద్దిగా దూరం ఉండేలా .. అగ్గిపుల్ల పూర్తిగా మట్టిలోకి చొచ్చుకుపోయేలా గుచ్చాలి.
- ఇలా నెలకు ఒక్కసారి మాత్రమే పుల్లలను గుచ్చాలి. గుచ్చిన పుల్లలను పదిహేను రోజుల తరువాత తీసేయాలి.
- ఇలా చేయడం వల్ల మొక్కల పెరుగుదలకు కావాల్సిన పోషకాలు అగ్గిపుల్లల నుంచి అంది, మొక్క బలంగా పెరిగి పూలూ, పండ్లను చక్కగా ఇస్తుంది.

యూత్ పల్స్

యాప్‌లారిటీ




శివరీన - శిల్పాభట్

యాప్ స్టోర్‌లలో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్‌ల హవా కొనసాగుతుండగానే 'నేను సైతం' అంటోంది ఫోన్‌పే. 'ఇండస్ స్టోర్' పేరుతో కొత్త యాప్ స్టోర్‌ను తీసుకురానుంది.

యాప్ స్టోర్‌ల పోటీ సంగతి ఎలా ఉన్నా, దేశీయ యాప్‌లు వెలిగిపోతున్న కాలం ఇది.

'ఒక యాప్ ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది' అనేది నిజమే అయినా అది ఎలాంటి ఐడియా అనేదే కీలకం.

ఆ కీలకమైన విషయాలను దృష్టిలో పెట్టుకొని పాపులర్ యాప్‌ల రూపకల్పనపై దృష్టి పెడుతున్నారు యంగ్ యాప్ డెవలపర్‌లు. యాప్–పాపులారిటీని కలిపి నెటిజనులు సరదాగా సృష్టించిన 'యాప్‌లారిటీ'కి న్యాయం చేసేలా కృషి చేస్తున్నారు...


'సాధించాలనుకున్నప్పుడు సాధన చెయ్' అనే మంచి మాట శివరీన సారికను కొత్త దారిలోకి తీసుకెళ్లింది. 'ప్రెగ్‌బడ్డీ' అనే పాపులర్ యాప్ ఆవిష్కరించడానికి కారణం అయింది. స్టార్ డెవలపర్‌గా తన పేరు మారుమోగేలా చేసింది. గేమింగ్ స్టూడియో '99 గేమ్స్' వైస్ ప్రెసిడెంట్ శిల్పాభట్ 'నేను సాధిస్తాను' అంటూ నమ్మకంగా రంగంలోకి దిగి, సక్సెస్‌ఫుల్ డెవలపర్‌ల వరుసలో నిలిచింది.

శివరీన ఐఐటీ–ఖరగ్‌పూర్ గ్రాడ్యుయేట్. తన సోదరికి గర్భస్రావం అయినప్పుడు కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోయింది. 'మనం నిరంతరం టెక్నాలజీ మధ్యలోనే గడుపుతున్నాం అనుకుంటున్నప్పటికీ, ఆ టెక్నాలజీని కీలకమైన సమయంలో మాత్రం ఉపయోగించుకోలేకపోతున్నాం' అనే ఆలోచనతో తల్లులు, తల్లులు కావాలనుకునే వారి కోసం వాట్సాప్ గ్రూప్ మొదలు పెట్టింది. వారిని ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకుంది. నాలుగు నెలల తరువాత తన టీమ్‌తో కలిసి 'ప్రెగ్‌బడ్డీ' యాప్ డెవలప్‌మెంట్‌పై పనిచేసింది. తల్లులు, తల్లి కావాలనుకుంటున్నవారికి అనేక రకాలుగా ఉపయోగపడే ఈ యాప్ సంవత్సర కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది.

ఉడిపి (కర్నాటక)లోని 'రోబోసాఫ్ట్' అనే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలో పనిచేసిన శిల్పాభట్ '99గేమ్స్'తో గేమ్ డెవలపర్‌గా మారింది.

'చాలామందికి టెక్నాలజీ అంటే ఇష్టం ఉన్నప్పటికీ ఆవిష్కరణల విషయం వచ్చేసరికి అది వేరే వాళ్ల వ్యవహారం, మనం చేయలేం అనుకుంటారు. అయితే ఇది సరికాదు. మనం ఏదైనా చేయాలంటే ముందు తెలుసుకోవాలి, నేర్చుకోవాలి. తెలుసుకుంటూ నేర్చుకుంటూనే ఎన్నో చేయవచ్చు' అంటుంది శివరీన.

'సాధించాలనే తపన గట్టిగా ఉంటే ఏదీ అసాధ్యం కాదు. ప్రోగ్రామింగ్ లేదా గేమ్ డెవలప్‌మెంట్ మీ ప్యాషన్ అయితే, ఆ ప్యాషన్‌ను గుండెల్లోకి తెచ్చుకోండి. గుండె నిండా ధైర్యంతో నేను సాధించగలను అనే నమ్మకాన్ని సొంతం చేసుకోండి' అంటుంది శిల్పాభట్.



బిలియన్ డాలర్ ఐడియా

> యాప్ బిల్డింగ్‌పై ఆసక్తి ఉన్న యువతరానికి ఇష్టమైన పుస్తకాల్లో ఒకటి... జార్జ్ బెర్కోవోస్కీ 'హౌ టు బిల్డ్ ఏ బిలియన్ డాలర్ యాప్' పుస్తకం. 'మొబైల్ జెనెటిక్స్' 'ఏ బిలియన్ డాలర్ ఐడియా' 'ఈజ్ యువర్ యాప్ రెడీ ఫర్ ఇన్వెస్ట్‌మెంట్?' 'హౌ మచ్ ఈజ్ యువర్ యాప్ వర్త్ అండ్ హౌ మచ్ మనీ మడ్ యూ రైజ్?' 'ది టెన్-మిలియన్- డాలర్ యాప్' 'మేక్ సమ్‌థింగ్ పీపుల్ లవ్' 'డాలర్స్ ఇన్ ది డోర్' 'ఏ కలర్‌ఫుల్ లెస్సన్' 'మనీ ఫర్ సేల్'... మొదలైన ఆసక్తికరమైన చాప్టర్‌లు ఈ పుస్తకంలో ఉన్నాయి. 'బిలియన్ డాలర్‌ల యాప్స్‌ను రూపొందించిన వారి బుర్రలతో ఆలోచింపచేసే పునక్తం ఇది' అంటున్నాడు బెర్కోవోస్కీ. ఇంజనీర్, సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ అయిన బెర్కోవోస్కీ ఎంతోమంది విజేతలతో మాట్లాడి, తన స్వీయ అనుభవాలను జోడించి ఈ పుస్తకం రాశాడు.

చిన్న వయసులోనే ఎన్నో మిలియన్ డాలర్ యాప్స్‌ను సృష్టించి పెద్ద పేరు తెచ్చుకున్నాడు సిద్దార్థ్ నాయక్. సక్సెస్‌ఫుల్ యాప్‌లను ఎలా బిల్డ్ చేయాలో బాగా తెలిసిన నాయక్ పదమూడు సంవత్సరాల వయసులోనే వెదర్ ప్రెడిక్షన్ యాప్‌ను క్రియేట్ చేశాడు.

'తనదైన విలువను మార్కెట్‌లో సృష్టించగలిగినప్పుడే ఒక వ్యాపార సంస్థకు సంబంధించిన ప్రయోజనం నెరవేరినట్లు అవుతుంది. వినియోగదారులు, ఉద్యోగులు, ఇన్వెస్టర్‌ల ప్రయోజనాలు పరస్పరం ముడిపడి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ ఉపయోగపడే యాప్‌ను సృష్టించడంపై దృష్టి పెడతాను. అత్యంత విలువైన సాంకేతిక పరిజ్ఞానంతో యాప్‌ను రూపొందించినప్పటికీ అది వినియోగదారులను ఆకట్టుకోకపోతే ప్రయోజనం నెరవేరనట్లే. యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకొని యాప్‌ను డిజైన్ చేయడం అనేది ముఖ్యమైన విషయం' అంటున్నాడు నాయక్.

చిన్న యాప్‌లు కూడా పెద్ద విజయం సాధించడానికి ప్రధాన కారణం క్రియేటర్‌లు యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను దృష్టిలో పెట్టుకోవడమే.

చైనీస్ యాప్‌లను నిషేధించిన తరువాత ఆ ప్లేస్‌లోకి మన కుర్రాళ్ల యాప్స్ వచ్చాయి. 'ఎంఎక్స్ టకాటక్' అలాంటిదే. 'ఇదే సరియైన సమయం అనుకొని మా టీమ్ ఆరు రోజులు రాత్రి, పగలు కష్టపడి ఈ యాప్‌ను డిజైన్ చేశాం. భారతీయత ఒక్కటే మార్కెట్‌లో విజయం సాధించడానికి కారణం కాదు. ఇతరుల కంటే ఏ రకంగా భిన్నంగా ఉన్నాం అనేదానిపైనే మన విజయం ఆధారపడి ఉంటుంది' అంటున్నాడు 'ఎంఎక్స్ టకాటక్' సీఈవో కిరణ్ బేడీ.

స్వదేశీ యాప్‌లు విజయంతో వెలిగిపోతున్న కాలం ఇది.

'నాణ్యత అంశాలను విస్మరిస్తే ఫలితం వేరేలా ఉంటుంది. ఎప్పటికప్పుడు మెరుగైన యూజర్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలి' అంటున్నారు నిపుణులు.

ఆసియా క్రీడల పతక విజేతలకు మోదీ ప్రశంస

తదుపరి ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మరెన్నో పతకాలు తెస్తారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు మంగళవారం మోదీని కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని వారందరినీ ప్రశంసించారు. 'ప్రభుత్వం క్రీడాకారులకు ఏం కావాలో అది చేస్తుంది. వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఆసియా క్రీడల్లో వందకు పైగా పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే క్రీడల్లో ఈ రికార్డును అధిగమిస్తారనే నమ్మకముంది. పారిస్ ఒలింపిక్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరుస్తారని ఆశిస్తున్నాను'అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో రజత పతకం గెలిచిన సాకేత్ మైనేని, మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రుతుజా భోస్లే ప్రధానికి జ్ఞాపికగా రాకెట్‌ను అందించారు. స్వర్ణ పతకాలు గెలిచిన భారత పురుషుల హాకీ జట్టు హాకీ స్టిక్‌ను, క్రికెట్లు జట్లు బ్యాట్‌ను మోదీకి బహూకరించాయి. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల బృందం 107 పతకాలు సాధించి తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. తదుపరి ఆసియా క్రీడలు 2026లో జపాన్‌లో జరుగుతాయి.



పాక్ అదరగొట్టింది

345 పరుగులు... వన్డే వరల్డ్ కప్ చరిత్రలో ఏ జట్టూ ఇంతటి భారీ లక్ష్యాన్ని అందుకోలేదు... శ్రీలంకతో మ్యాచ్‌లో 37 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయిన దశలో పాకిస్తాన్‌కు ఇది దాదాపు అసాధ్యం అనిపించింది. కానీ రిజ్వాన్, షఫీక్ కలిసి దానిని చేసి చూపించారు. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్‌లో గేర్లు మారుస్తూ చివరకు మరో 8 బంతులు మిగిలి ఉండగా పాక్‌కు విజయాన్నందించారు. అంతకుముందు మెరుపు బ్యాటింగ్‌తో కుశాల్ మెండిస్, సమరవిక్రమ చేసిన శతకాలు చివరకు జట్టుకు ఉపయోగపడలేదు. మొత్తం 689 పరుగుల ఈ పోరుతో హైదరాబాద్‌లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు ముగిశాయి.


షఫీక్
రిజ్వాన్

- ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగుల ఛేదన
- 6 వికెట్లతో శ్రీలంకపై ఘన విజయం
- శతకాలతో గెలిపించిన రిజ్వాన్, షఫీక్
- మెండిస్, సమరవిక్రమ సెంచరీలు వృథా

సాక్షి, హైదరాబాద్: ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ పాకిస్తాన్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. ఉప్పల్ స్టేడియంలో ఆడిన రెండు మ్యాచ్‌లనూ సంతృప్తిగా ముగించింది. మంగళవారం జరిగిన పోరులో పాక్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 344 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (77 బంతుల్లో 122; 14 ఫోర్లు, 6 సిక్స్‌లు), సదీర సమరవిక్రమ (89 బంతుల్లో 108; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగగా, పతుమ్ నిసాంక (61 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మెండిస్ రెండో వికెట్‌కు నిసాంకతో 102 పరుగులు, మూడో వికెట్‌కు సమరవిక్రమతో 111 పరుగులు జోడించాడు. 65 బంతుల్లో సెంచరీ సాధించిన మెండిస్ శ్రీలంక తరఫున ప్రపంచకప్‌లో వేగవంతమైన శతకాన్ని నమోదు చేశాడు. అనంతరం పాకిస్తాన్ 48.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిజ్వాన్ (121 బంతుల్లో 131 నాటౌట్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (103 బంతుల్లో 113; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు బాది జట్టును గెలిపించారు. కండరాల నొప్పితో బాధపడుతూనే రిజ్వాన్ తన జట్టును విజయతీరానికి చేర్చాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 176 పరుగులు జత చేశారు. ఆరంభంలో శ్రీలంక చెలరేగినా... చివరి పది ఓవర్లలో 61 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) షఫీక్ (బి) షాదాబ్ 51; పెరీరా (సి) రిజ్వాన్ (బి) హసన్ 0; మెండిస్ (సి) ఇమామ్ (బి) హసన్ 122; సమరవిక్రమ (సి) రిజ్వాన్ (బి) హసన్ 108; అసలంక (సి) రిజ్వాన్ (బి) హసన్ 1; ధనంజయ (సి) షాహిన్ (బి) నవాజ్ 25; షనక (సి) బాబర్ (బి) షాహిన్ 12; వెలలాగె (సి) షఫీక్ (బి) రవూఫ్ 10; తీక్షణ (బి) రవూఫ్ 0; పతిరణ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 344. వికెట్ల పతనం: 1-5, 2-107, 3-218, 4-229, 5-294, 6-324, 7-335, 8-343, 9-344. బౌలింగ్: షాహిన్ 9-0-66-1, హసన్ అలీ 10-0-71-4, నవాజ్ 9-0-62-1, రవూఫ్ 10-0-64-2, షాదాబ్ 8-0-55-1, ఇఫ్తికార్ 4-0-22-0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: షఫీక్ (సి) (సబ్) హేమంత (బి) పతిరణ 113; ఇమామ్ (సి) పెరీరా (బి) మదుషంక 12; బాబర్ ఆజమ్ (సి) సమరవిక్రమ (బి) మదుషంక 10; మొహమ్మద్ రిజ్వాన్ (నాటౌట్) 131; షకీల్ (సి) వెలలాగె (బి) తీక్షణ 31; ఇఫ్తికార్ అహ్మద్ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం (48.2 ఓవర్లలో 4 వికెట్లకు) 345. వికెట్ల పతనం:** 1-16, 2-37, 3-213, 4-308. **బౌలింగ్:** తీక్షణ 10-0-59-1, మదుషంక 9.2-0-60-2, షనక 5-0-28-0, పతిరణ 9-0-90-1, వెలలాగె 10-0-62-0, ధనంజయ డిసిల్వా 4-0-36-0, అసలంక 1-0-10-0.



3 ఒక వన్డే మ్యాచ్‌లో నలుగురు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇది మూడోసారి మాత్రమే కాగా, వరల్డ్ కప్‌లో మొదటిసారి. 1998లో లాహోర్‌లో ఇజాజ్ అహ్మద్, మొహమ్మద్ యూసుఫ్, పాంటింగ్, గిల్‌క్రిస్ట్...2013లో నాగపూర్‌లో కోహ్లి, ధావన్, బెయిలీ, వాట్సన్ సెంచరీలు చేశారు.

మరో విజయం లక్ష్యంగా...

- టీమిండియా బరిలోకి
- నేడు అఫ్గానిస్తాన్‌తో పోరు
- అందరి కళ్లు టాపార్డర్‌పైనే

మ. గం. 2 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: వన్డే ప్రపంచకప్‌లో భారత్ గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను ఢీకొట్టి మరీ శుభారంభం చేసింది. ఇప్పుడు సులువైన జట్టు అఫ్గానిస్తాన్‌తో పోరుకు సై అంటోంది. పదునెక్కిన బౌలింగ్‌తో 'కంగారు' పెట్టించిన భారత్ ఇప్పుడు టాపార్డర్ ఫామ్‌పై దృష్టి పెట్టింది. అనుభవజ్ఞుడైన కెప్టెన్ రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌ల డకౌట్లు జట్టు మేనేజ్‌మెంట్‌ను కాస్త కలవరపెట్టినా... ఇప్పుడు అఫ్గాన్‌తో పరుగుల వరద పారించి ఫామ్‌లోకి వచ్చే అవకాశం లభించింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండ్ షోకు విలవిలలాడిన అఫ్గానిస్తాన్ పటిష్టమైన రోహిత్ సేనకు ఏ మేరకు బదులిస్తుందో చూడాలి.

ఆసీస్‌తో టాపార్డర్ మాత్రమే తడబడింది. కేఎల్ రాహుల్, కోహ్లిల సూపర్ ఇన్నింగ్స్‌లతో మాజీ చాంపియన్‌ను మట్టికరిపించింది. అది చెపాక్ పిచ్ అయితే... ప్రత్యర్థి ఆస్ట్రేలియా. కానీ ఇప్పుడు ఎదురవుతోంది మాత్రం అఫ్గాన్, తలపడుతోంది ఢిల్లీలో... కాబట్టి పరుగుల వరద గ్యారంటీ! ఇందులో సందేహమే లేదు. ఫిరోజ్ షా కోట్లా మైదానంలో గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 400 పైచిలుకు పరుగులు చేస్తే లక్ష్యఛేదనలో శ్రీలంక 300 పైచిలుకు చేసింది. ఇప్పుడు రోహిత్, కోహ్లి, అయ్యర్, రాహుల్, పాండ్యాలాంటి మేటి బ్యాటర్లున్న భారత్ ప్రేక్షకులను భారీ షాట్లతో అలరించడం ఖాయం. డెంగీ జ్వరం నుంచి శుబ్‌మన్ గిల్ కోలుకోకపోవడంతో తుది జట్టులో ఏమార్పు ఉండకపోవచ్చు. మరోవైపు అఫ్గానిస్తాన్ రాటుదేలినా... మెగా ఈవెంట్ ఒత్తిడిని తట్టుకొని భారత్‌ను కంగుతినిపించే సత్తా అయితే లేదనే చెప్పాలి. ఇలా ఏ రకంగా చూసినా కూడా ఢిల్లీలో ఏకపక్షమయ్యే మ్యాచే జరుగుతుందనడంలో సందేహమే లేదు.

ప్రపంచ నంబర్‌వన్ జోడీగా సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి

- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ జోడీగా కొత్త చరిత్ర



న్యూఢిల్లీ: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి మరో ఘనత సాధించింది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో పురుషుల డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌కు చేరుకున్న తొలి భారతీయ జోడీగా చరిత్ర సృష్టించింది. మంగళవారం విడుదల చేసిన బీడబ్ల్యూఎఫ్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 92,411 పాయింట్లతో అగ్రస్థానాన్ని అలంకరించింది. గతవారం హాంగ్జౌలో ముగిసిన ఆసియా క్రీడల్లో సాత్విక్-చిరాగ్ జోడీ స్వర్ణ పతకం సాధించింది. దాంతో ఈ జంట ఒక స్థానం పురోగతి సాధించి రెండు నుంచి టాప్ ర్యాంక్‌కు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ ఈ సీజన్‌లో స్విస్ ఓపెన్, ఆసియా చాంపియన్‌షిప్‌లో, ఇండోనేసియా ఓపెన్, కొరియా ఓపెన్‌లలో విజేతగా నిలిచారు. గతంలో భారత్ నుంచి పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రకాశ్ పదుకొనే (1980లో), శ్రీకాంత్ (2018లో), మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2021లో) ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు.

భారీ విజయంతో ఇంగ్లండ్ బోణీ

- సెంచరీతో చెలరేగిన మలాన్
- 137 పరుగులతో బంగ్లాదేశ్ ఓటమి


మలాన్

ధర్మశాల: డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ భారీ విజయంతో బోణీకొట్టింది. వన్డే ప్రపంచకప్‌లో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బట్లర్ బృందం 137 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై జయభేరి మోగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 364 పరుగులు చేసింది. ఓపెనర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ మలాన్ (107 బంతుల్లో 140; 16 ఫోర్లు, 5 సిక్సర్లు) తన కెరీర్‌లో ఆరో సెంచరీతో చెలరేగాడు. బెయిర్‌స్టో (59 బంతుల్లో 52; 8 ఫోర్లు)తో తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించిన మలాన్... రెండో వికెట్‌కు రూట్ (68 బంతుల్లో 82; 8 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మరో 151 పరుగులు జతచేశాడు. కెప్టెన్ బట్లర్ (20), బ్రూక్ (20) రెండంకెల స్కోరు చేశారు. మెహదీ హసన్ 4, షోరిఫుల్ ఇస్లామ్ 3 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించలేక బంగ్లాదేశ్ 48.2 ఓవర్లలో 227 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ లిటన్ దాస్ (66 బంతుల్లో 76; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), ముష్ఫికర్ రహీమ్ (64 బంతుల్లో 51; 4 ఫోర్లు) రాణించారు. టోప్లే 4, వోక్స్ 2 వికెట్లు పడగొట్టారు.

'నల్ల బ్యాండ్‌లు ధరించి ఆడాలి'

గౌతమ్ గంభీర్

అఫ్గానిస్తాన్ జట్టు మైదానంలో దిగుతున్న చాలా సందర్భాల్లో వారి దేశంలో ఏదో ఒక రాజకీయ సంక్షోభం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పుడు దీనికి తోడు ఆ దేశాన్ని అతి పెద్ద భూకంపం కుదిపేసింది. ఇలాంటి సమయంలో అఫ్గానిస్తాన్ టీమ్ ప్రపంచకప్‌లో తమ ఆటపై ఎలా ఏకాగ్రత కనబర్చగలదో చూడాలి. అఫ్గానిస్తాన్‌కు అందరి ప్రార్థనలు కావాలి. ఒడిశా రైలు ప్రమాద ఘటనలో 260 మంది చనిపోయిన సందర్భంలో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడుతున్న భారత్, ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇలా నివాళి అర్పించడం నాకు బాగా గుర్తుంది. ఏ ఘటనకు నల్ల బ్యాండ్‌లు ధరించాలో, దేనికి ధరించరాదో అడ్మినిస్ట్రేటర్లు నిర్ణయించే స్థితికి మనం దిగజారలేదనే నమ్ముతున్నా. నేటి మ్యాచ్‌లో భారత జట్టు నల్ల ఆర్మ్ బ్యాండ్‌లు ధరిస్తే బాగుంటుంది. చెన్నైలో భారత జట్టు శుభారంభం చేసింది. చాలా మంది నాతో అంగీకరించకపోవచ్చు గానీ పిచ్ స్వభావం నాకు నచ్చింది. 50 ఓవర్ల క్రికెట్‌ను బతికించేందుకు మనం ప్రత్యేకంగా జిమ్మిక్కులు చేయనవసరం లేదు. బ్యాట్‌కు, బంతికి మధ్య సమతూకం ఉండేలా పిచ్‌లు రూపొందిస్తే చాలు.

సినిమా



2023 మిస్సింగ్

ఈ ఏడాది సిల్వర్ స్క్రీన్ కొందరు స్టార్స్‌ని మిస్సయింది. వెంకటేశ్, నాగార్జున, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్, అల్లు అర్జున్.. ఈ హీరోలు నటించిన చిత్రాలు 2023లో రిలీజ్ కాలేదు. ఈ స్టార్స్ వెండితెరపై కనిపించకపోవడం వారి అభిమానులను కాస్త నిరుత్సాహపరిచే విషయం. మరి.. 2024లో ఈ స్టార్స్ ఏ చిత్రాలతో వెండితెరపై కనబడతారో తెలుసుకుందాం.

'సైంధవ్' రావాలి కానీ...

'సైంధవ్' రిలీజ్ ప్లాన్ మారడంతో ఈ ఏడాది తెలుగు తెరపై వెంకటేశ్ కనిపించే అవకాశం లేదు. వెంకటేశ్ కెరీర్‌లో రూపొందుతున్న 75వ సినిమా 'సైంధవ్'. ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకుడు. నిజానికి ఈ చిత్రాన్ని డిసెంబరు 22న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ అదే తేదీకి ప్రభాస్ 'సలార్: సీజ్ ఫైర్' చిత్రం రిలీజ్‌కు సిద్ధం కావడంతో 'సైంధవ్' రిలీజ్ జనవరి 13కు వాయిదా పడింది. ఇలా ఊహించని విధంగా వెంకటేశ్ ఈ ఏడాది తెలుగు తెరకు దూరంగా కావాల్సిన పరిస్థితి. ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్లుగా, చైల్డ్ ఆర్టిస్ట్ సారా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య కీలక పాత్రల్లో నటించారు. ఇక ఈ ఏడాది మార్చి నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతున్న 'రానా నాయుడు' వెబ్ సిరీస్ ద్వారా డిజిటల్ మీడియాలో, సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రంతో హిందీ తెరపై వెంకీ కనిపించడం ఈ స్టార్ ఫ్యాన్స్‌ను కాస్త ఆనందపరిచే విషయం.

నా సామి రంగ.. వచ్చే ఏడాదే

గత రెండేళ్లలో మూడు సినిమాలతో (2021లో 'వైల్డ్ డాగ్', 2022లో 'బంగార్రాజు', 'ది ఘోస్ట్') సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేసిన నాగార్జున ఈ ఏడాది మాత్రం గ్యాప్ ఇచ్చారు. నాగార్జున తాజా చిత్రం 'నా సామి రంగ' వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరిలో విడుదల కానుంది. సో.. ఈ ఏడాది అక్కినేని ఫ్యాన్స్‌కు నాగార్జున సిల్వర్ స్క్రీన్‌పై కనిపించరు. వచ్చే ఏడాది ఆరంభంలో నాగ్ స్టైల్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ 'నా సామి రంగ' రూపంలో ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంది. విజయ్ బిన్నీని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఈ చిత్రాన్ని శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు.

వేసవి నుంచి సంక్రాంతికి..

'సర్కారువారి పాట'తో గత ఏడాది సూపర్ హిట్ అందుకున్నారు మహేశ్‌బాబు. అన్నీ సజావుగా సాగినట్లయితే ఈ ఏడాది కూడా వెండితెరపై మహేశ్‌బాబు సందడి ఉండేది. మహేశ్‌బాబు హీరోగా చేస్తున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'ను ఈ ఏడాది వేసవిలోనే రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే వచ్చే ఏడాది జనవరి 12కి వాయిదా వేశారు. ఇలా మహేశ్ ఈ ఏడాది థియేటర్స్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా ఈ చిత్రాన్ని సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్నారు.

2024 నుంచి నో గ్యాప్

2018లో వచ్చిన 'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం తర్వాత ఎన్టీఆర్ మళ్లీ స్క్రీన్‌పై కనిపించింది 'ఆర్ఆర్ఆర్' (2022) సినిమాలోనే. ఆ సినిమా కమిట్‌మెంట్ కారణంగా 2019, 2020, 2021లో ఎన్టీఆర్ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. ఇక 2023 నుంచి అయినా ఎన్టీఆర్ సినిమాలు వరుసగా విడుదలవుతాయనుకున్న ఆయన ఫ్యాన్స్ మరికొంత సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి. ఎందుకంటే... ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా యాక్షన్ ఫిల్మ్ 'దేవర' తొలి భాగాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సో.. ఈ ఏడాది ఎన్టీఆర్ స్క్రీన్‌పై కనపడరు. 'దేవర' చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. ఇక ఎన్టీఆర్ ఓ లీడ్ రోల్‌లో నటించనున్న 'వార్ 2' (ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో), 'దేవర' రెండు భాగాలు, ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మూవీ.. ఇలా వరుస సినిమాలతో ఈ స్టార్ 2024 నుంచి గ్యాప్ లేకుండా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించే అవకాశం ఉంది.

లేట్‌గా డ్యూటీ

ఐఏఎస్ ఆఫీసర్ పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్న చిత్రం 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని యూనిట్ ప్లాన్ చేసినా వీలు పడలేదు. వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, సామాజిక అంశాలకు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి శంకర్ తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఇందులో కియారా అద్వానీ నాయిక. మరోవైపు ఈ ఏడాదే విడుదలైన సల్మాన్ ఖాన్ హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్'లోని ఓ పాటలో రామ్‌చరణ్ ఓ గెస్ట్ రోల్ చేశారు. ఇది చరణ్ ఫ్యాన్స్‌కు కాస్త ఊరట కలిగించింది.

రెండేళ్ల తర్వాతే పుష్ప రూల్

'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఎంతటి ఘనవిజయాన్ని నమోదు చేసుకుందో తెలిసిందే. 2021లో విడుదలైన ఈ సినిమా అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డును కూడా తెచ్చిపెట్టింది. దీంతో 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'పై అంచనాలు ఏర్పడ్డాయి. అయితే మేకర్స్ ప్లాన్ చేసినట్లుగా మలి భాగం 2023లో విడుదల కాలేదు. క్యాస్టింగ్, కథ విషయాల్లో ఈ సినిమా స్పాన్ మరింత పెరగడం, చిత్రీకరణ వాయిదా పడుతుండటంతో 2024 ఆగస్టు 15న 'పుష్ప: ది రూల్'ను రిలీజ్ చేస్తామని యూనిట్ ప్రకటించింది. సో.. ఈ ఏడాది కూడా అల్లు అర్జున్ థియేటర్స్‌లో కనిపించరు. సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రధారులు.

ఇలా మరికొందరు స్టార్స్‌ని 2023 సిల్వర్ స్క్రీన్ మిస్సయ్యింది.

మరో సక్సెస్‌ఫుల్ హీరో వచ్చాడు - హీరో నాని


మానస, రోషన్, నాని

''బబుల్‌గమ్' టీజర్ చూస్తే చాలా బలమైన కథ అనిపించింది. రోషన్‌ని స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు చాలా పర్ఫెక్ట్‌గా కనిపించాడు. మరో సక్సెస్‌ఫుల్ హీరో తెలుగు ఇండస్ట్రీకి వచ్చాడని నమ్మకంగా చెప్పగలను. టీజర్ చూసినప్పుడు నాకు ఆ నమ్మకం వచ్చింది'' అని హీరో నాని అన్నారు. నటుడు రాజీవ్ కనకాల, యాంకర్ సుమల తనయుడు రోషన్ కనకాల హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరెపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మానసా చౌదరి కథానాయిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 29న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్ విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''రవికాంత్‌కి ఒక యునిక్ స్టయిల్ ఉంది. అది టీజర్‌లో కనిపిస్తోంది. తెలుగులో క్వాలిటీ ఫిలిమ్స్‌కి మారుపేరుగా మారిన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్లగారికి 'బబుల్‌గమ్' మరో హిట్‌గా నిలుస్తుంది'' అన్నారు. ''నాకు ఇష్టమైన పని (సినిమాలు) చేయడానికి ప్రోత్సహించిన అమ్మానాన్నలకి థ్యాంక్స్'' అన్నారు రోషన్ కనకాల. ''పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మహేశ్వరి మూవీస్‌తో పని చేయడం చాలా ఆనందాన్నిచ్చింది'' అన్నారు రవికాంత్ పేరెపు. ''బబుల్‌గమ్' పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్, సహనిర్మాత వివేక్ కూచిభొట్ల. హీరోయిన్ మానస, నటుడు రాజీవ్ కనకాల మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: సురేష్ రగుతు, క్రియేటివ్ ప్రొడ్యూసర్: దివ్య విజయ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మధులిక సంచన లంక.

రజాకార్ చరిత్ర అందరికీ తెలుస్తుంది - మాజీ మంత్రి డీకే అరుణ


అనుశ్రేయ, గూడూరు నారాయణరెడ్డి, అనసూయ, డీకే అరుణ, యాటా సత్యనారాయణ

''దేశమంతా ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటారు. కానీ, హైదరాబాద్‌కి ఆ రోజు నిజమైన స్వాతంత్ర్యం రాలేదని చాలామందికి తెలియదు. 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని అతి కొద్దిమందికే తెలుసు. 'రజాకార్' సినిమా ద్వారా రజాకార్ చరిత్ర అందరికీ తెలుస్తుంది'' అని మాజీ మంత్రి డీకే అరుణ అన్నారు. బాబీ సింహా, అనసూయ, వేదిక, అనుశ్రేయా త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రజాకార్'. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రంలోని 'భారతి భారతి ఉయ్యాలో..' పాటను రిలీజ్ చేశారు డీకే అరుణ. ఈ సందర్భంగా గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ– ''రజాకార్లను ఉద్దేశించి మాత్రమే ఈ సినిమాను తీశాం. త్వరలోనే సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు. ''ఈ సినిమాలో చరిత్రను ఎక్కడా వక్రీకరించలేదు'' అన్నారు యాటా సత్యనారాయణ. ''ఈ సినిమాలో భాగం అయినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు అనసూయా భరద్వాజ్.

వారం ముందే దీపావళి!


అపర్ణ, రక్షిత్

రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్దన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లుగా సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. డాక్టర్ అజ్జ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబర్ 3న ఉషా పిక్చర్స్ ద్వారా రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. సెబాస్టియన్ నోవా అకోస్టా మాట్లాడుతూ– ''నరకాసుర అంటే దీపావళి గుర్తుకొస్తుంది. ఈ సినిమాతో దీపావళి ఓ వారం ముందుగానే థియేటర్స్‌కి వస్తుంది'' అన్నారు. ''నరకాసుర' మేమందరం గర్వపడే సినిమా అవుతుంది'' అన్నారు రక్షిత్ అట్లూరి. ''నేను వృత్తి రీత్యా డాక్టర్‌ను. సినిమాలంటే ప్యాషన్‌తో ఈ సినిమా తీశాను'' అన్నారు అజ్జ శ్రీనివాస్.

మ్యాడ్‌తో నలభైమంది జీవితాలు మారాయి - దర్శకుడు కల్యాణ్ శంకర్


నాగవంశీ, కల్యాణ్ శంకర్, నార్నే నితిన్, సంగీత్

''మ్యాడ్' కోసం మా బాబాయ్ (చినబాబు) ఓ రచయితలా కల్యాణ్‌తో కలిసి పని చేశారు'' అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా, శ్రీ గౌరీ ప్రియారెడ్డి, అనంతిక సనీల్‌కుమార్, గోపికా ఉద్యాన్ హీరోయిన్లుగా కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించిన చిత్రం 'మ్యాడ్'. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో కల్యాణ్ శంకర్ మాట్లాడుతూ– ''నాగవంశీ అన్నని కలవడం నా జీవితంలో గొప్ప మార్పు. ఈ కథ చినబాబుగారికి నచ్చడంతో నాతో పాటు దాదాపు 40 మంది జీవితాలు మారిపోయాయి'' అన్నారు. ''మా సినిమాకి వస్తున్న స్పందనకు హ్యాపీ'' అన్నారు హారిక సూర్యదేవర.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	567	66,079
నిఫ్టీ ▲	177	19,690

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,571	▲ 91
డోజోన్స్	33,792	▲ 187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,628	▲ 136
డాక్స్	15,433	▲ 295
షాంఘై	3,075	▼ 22
నికాయ్	31,746	▲ 752

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	57,479	▲ 147
బంగారం (22 క్యారట్)	57,249	▲ 147
వెండి (కిలో)	68,583	▲ 90

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.53	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.09	103.29
€	యూరో	ఎస్‌బీఐ	87.58	89.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.51	57.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.16	54.23
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.95	63.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.84
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.29	12.35

కొత్త కస్టమర్లను యాప్‌లో చేర్చుకోవద్దు

బ్యాంక్ ఆఫ్ బరోడాకు ఆర్‌బీఐ ఆదేశాలు



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా తమ 'బీవోబీ వరల్డ్' మొబైల్ యాప్‌లో కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా రిజర్వ్ బ్యాంక్ నిషేధం విధించింది. ఇది తక్షణమే అమల్లోకి వచ్చింది. యాప్‌లో కస్టమర్లను చేర్చుకునే ప్రక్రియకు సంబంధించి పర్యవేక్షణాపరమైన లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. బ్యాంకు వాటిని సరిచేసి, సంబంధిత ప్రక్రియను పటిష్టం చేసినట్లు ఆర్‌బీఐ సంతృప్తి చెందితే తప్ప కొత్త కస్టమర్లను చేర్చుకోవడానికి ఉండదు. దీనివల్ల ప్రస్తుత బీవోబీ వరల్డ్ ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలంటూ బ్యాంకుకు సూచించింది. ఆర్‌బీఐ సూచించిన అంశాలను ఇప్పటికే సరిదిద్దినట్లు, ఇతరత్రా ఏవైనా లోపాలుంటే వాటిని కూడా సరిచేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా తెలిపింది. ఆర్‌బీఐ ఆదేశాలను అమలు చేసే క్రమంలో కస్టమర్లకు సర్వీసులపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండబోదని పేర్కొంది.

టాంజానియాతో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎంవోయూ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాతో రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ (ఆర్‌సీఎంఎల్) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఆరోగ్య సంరక్షణ సేవలకు సంబంధించి సంస్థల మధ్య సమగ్ర సహకారానికి ఇది తోడ్పడనుంది. పిల్లల్లో గుండె, న్యూరాలాజికల్ శస్త్ర చికిత్సలు, కిడ్నీ మార్పిడి తదితర చికిత్సలకు సంబంధించి నైపుణ్యాలు, టెక్నాలజీ మొదలైన వాటి మార్పిడికి ఇది ఉపయోగపడనుంది. ఈ ఎంవోయూ విషయంలో కేంద్ర ఆరోగ్య శాఖ కీలకపాత్ర పోషించింది. టాంజానియా పిల్లలకు భారత్‌లోని తమ ఆస్పత్రిలో చికిత్స చేయడంతో పాటు వైద్యులకు శిక్షణ కార్యక్రమాలపరంగా సహాయం అందించేందుకు ఇది ఉపయోగపడగలదని ఆర్‌సీఎంఎల్ సీఎండీ రమేష్ కంచర్ల తెలిపారు. ఈ ఎంవోయూ మూడేళ్ల పాటు అమల్లో ఉంటుంది.

భారత్ కుబేరుల్లో అంబానీ టాప్

- రూ. 8 లక్షల కోట్ల సంపద
- రూ. 4.74 లక్షల కోట్లతో రెండో ర్యాంకులో అదానీ
- హురున్ ఇండియా 2023 జాబితా



ముంబై: పారిశ్రామిక దిగ్గజం, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తాజాగా 360 వన్ వెల్త్ హురున్ ఇండియా సంపన్నుల జాబితా 2023లో అగ్రస్థానంలో నిల్చారు. రూ. 8.08 లక్షల కోట్ల సంపదతో ఆయన టాప్ ర్యాంకు దక్కించుకున్నారు. గత ఏడాది వ్యవధిలో అంబానీ సంపద స్వల్పంగా రెండు శాతం పెరిగింది. అటు మరో దిగ్గజం గౌతమ్ అదానీ రూ. 4.74 లక్షల కోట్ల సంపదతో రెండో స్థానం దక్కించుకున్నారు. ఆయన సంపద 57 శాతం కరిగిపోయింది. అదానీ గ్రూప్ కంపెనీల ఖాతాలు, షేర్లలో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణల దెబ్బతో అదానీ సంస్థల షేర్లు కుదేలవడం ఇందుకు కారణమని హురున్ ఎండీ, చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. ఆగస్టు 30 తేదీ ప్రాతిపదికగా హురున్ ఈ జాబితాను రూపొందించింది. ఈసారి లిస్టులో 138 నగరాలకు చెందిన 1,319 మంది కుబేరులకు చోటు దక్కింది. రూ. 2.78 లక్షల కోట్ల సంపదతో (36 శాతం వృద్ధి) సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత సైరస్ పూనావాలా మూడో స్థానంలో, రూ. 2.28 లక్షల కోట్లతో (23 శాతం వృద్ధి) హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ ఆ తర్వాత ర్యాంకులో ఉన్నారు. గత ఏడాది వ్యవధిలో భారత్‌లో ప్రతి మూడు వారాలకు కొత్తగా ఇద్దరు బిలియనీర్లుగా ఎదిగారు. ప్రస్తుతం 259 మంది బిలియనీర్లు ఉన్నారు. గత 12 ఏళ్లలో వారి సంఖ్య 4.4 రెట్లు పెరిగింది.

మరిన్ని విశేషాలు..

- గోపిచంద్ హిందుజా (5), దిలీప్ సంఘ్వి (6), ఎల్‌ఎన్ మిట్టల్ (7), కుమార మంగళం బిర్లా (9), నీరజ్ బజాజ్ (10) టాప్ టెన్‌లో ఉన్నారు.
- డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ సంపద 18 శాతం క్షీణించి రూ. 1.43 లక్షల కోట్లకు పడిపోవడంతో ఆయన 8వ స్థానంతో సరిపెట్టుకున్నారు.
- అసమానతలు పెరిగిపోతుండటంపై ఆందోళన నేపథ్యంలో ఏడాది వ్యవధిలో 51 మంది కుబేరుల సంపద రెట్టింపయ్యింది. అంతక్రితం ఏడాది వ్యవధిలో ఈ సంఖ్య 24గా నమోదైంది.
- నగరాలవారీగా చూస్తే 328 బిలియనీర్లతో ముంబై అగ్రస్థానంలో ఉంది. న్యూఢిల్లీ (199), బెంగళూరు (100), హైదరాబాద్ (87) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. తొలిసారిగా టాప్ 20 నగరాల్లో తిరుప్పూర్ చోటు దక్కించుకుంది.
- ప్రైవేట్ ఈక్విటీ రంగం నుంచి తొలిసారిగా కేదార క్యాపిటల్‌కు చెందిన మనీష్ కేజ్రివాల్ చోటు దక్కించుకున్నారు. ఆయన సంపద రూ. 3,000 కోట్లు.
- ప్రెసిషన్ వైర్స్‌కు చెందిన మహేంద్ర రాతిలాల్ మెహతా 94 ఏళ్ల వయస్సులో లిస్టులో నిలిచారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇలా...

టాప్ 100లో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి రూ. 55,700 కోట్ల సంపదతో దివీస్ ల్యాబొరేటరీస్ అధినేత మురళి దివి 23వ ర్యాంకులో నిల్చారు. 196% సంపద వృద్ధితో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాకు చెందిన పీపీ పిచ్చిరెడ్డి (రూ. 37,300 కోట్లు), పీవీ కృష్ణారెడ్డి (రూ. 35,800 కోట్లు) వరుసగా 37, 41వ ర్యాంకుల్లో ఉన్నారు. హెటిరో గ్రూప్ చైర్మన్ బి. పార్థసారథి రెడ్డి కుటుంబం రూ. 21,900 కోట్ల సంపదతో 93వ స్థానంలో, అరబిందో ఫార్మా నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి రూ. 21,000 కోట్ల సంపదతో 98వ స్థానంలో, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్ రెడ్డి కుటుంబం రూ.20,900 కోట్లతో 99వ ర్యాంకులో ఉన్నాయి.

ఏపీలో గ్రీన్‌లామ్ ప్లాంటు ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లామినేట్ షీట్స్ తయారీలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన ప్లాంటులో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుపతి జిల్లాలోని నాయుడుపేట వద్ద ఉన్న ఈ అత్యాధునిక తయారీ కేంద్రానికి ఏటా 35 లక్షల లామినేట్ షీట్స్, కాంపాక్ట్ బోర్డులను ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. నూతన ప్లాంటు కోసం కంపెనీ రూ.239 కోట్లు వెచ్చించింది. పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే ఈ ఫెసిలిటీ ద్వారా రూ.600 కోట్ల వార్షికాదాయం సమకూరగలదని కంపెనీ ప్రకటించింది. 4 ప్లాంట్లలో కలిపి వార్షిక స్థాపిత సామర్థ్యం 2.45 కోట్ల లామినేట్ షీట్స్, కాంపాక్ట్ బోర్డులకు చేరిందని గ్రీన్‌లామ్ ఎండీ, సీఈవో సౌరభ్ మిత్తల్ వెల్లడించారు.

యుద్ధ భయాల నుంచి కోలుకున్న మార్కెట్

- కలిసొచ్చిన షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు
- అన్ని రంగాల షేర్లకు డిమాండ్
- సూచీలు ఒక శాతం జంప్



ముంబై: ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధ భయాల నుంచి దలాల్ స్ట్రీట్ తేరుకుంది. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో మంగళవారం సూచీలు దాదాపు ఒక శాతం లాభపడ్డాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న రికవరీ ర్యాలీ కలిసొచ్చింది. క్రూడాయిల్ ధరలు గరిష్ట స్థాయిల నుంచి దిగివచ్చాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) తాజాగా 2024 ఆర్థిక సంవత్సరానికి గానూ భారత వృద్ధి రేటును 20 బేసిస్ పాయింట్లు పెంచి 6.3 శాతానికి పెంచింది. ఫలితంగా ఫైనాన్స్, బ్యాంకింగ్, ఆటో, ఐటీ షేర్లలో నెలకొన్న కొనుగోళ్లతో సెన్సెక్స్ 567 పాయింట్లు పెరిగి 66,079 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 177 పాయింట్లు బలపడి 19,690 వద్ద నిలిచింది. ఒకదశలో సెన్సెక్స్ 668 పాయింట్లు బలపడి 66,180 వద్ద, నిఫ్టీ 206 పాయింట్లు దూసుకెళ్లి 19,718 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకున్నాయి. ఇటీవల అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్న చిన్న, మధ్య తరహా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఫెడ్ రిజర్వ్ అధికారుల సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఇజ్రాయెల్‌లోని హైఫా పోర్ట్‌లో పనిచేస్తున్న తమ ఉద్యోగుల భద్రతకు తగిన చర్యలు తీసుకున్నామని, ఉద్యోగులందరూ సురక్షితంగా ఉన్నారని అదానీ పోర్ట్స్, సెజ్ వివరణ ఇవ్వడంతో ఈ కంపెనీ షేరు 4% లాభపడి చేసి రూ.819 వద్ద స్థిరపడింది.
- పండుగ డిమాండ్‌తో సెప్టెంబర్ రిటైల్ అమ్మకాల్లో 20% వృద్ధి నమోదైనట్లు డీలర్ల సమాఖ్య ఫెడా ప్రకటనతో ఆటో షేర్లు దూసుకెళ్లాయి. టాటా మోటార్స్ 2%, ఎంఅండ్ఎం 1.50%, మారుతీ 1.32% లాభపడ్డాయి. అశోక్ లేలాండ్ 1.22%, హీరో మోటో 0.66%, బజాజ్ ఆటో 0.64%, ఐషర్ 0.42%, టీవీఎస్ 0.36% పెరిగాయి.

బ్రిడ్జ్‌స్టోన్ డీలర్‌షిప్‌లలో ఈవీ చార్జర్లు

టాటా పవర్‌తో జట్టు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ సంస్థ బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా తమ డీలర్‌షిప్‌లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జర్ల ఏర్పాటు కోసం టాటా పవర్‌తో చేతులు కలిపింది. ఈ ఒప్పందం ప్రకారం గంట వ్యవధిలోనే కార్లు వంటి నాలుగు చక్రాల వాహనాలను చార్జింగ్ చేసే సామర్థ్యం ఉండే ఫాస్ట్ చార్జర్లను టాటా పవర్ ఇన్‌స్టాల్ చేస్తుంది. తద్వారా ఒక్కో చార్జరుతో రోజులో 20–24 వాహనాలను చార్జింగ్ చేయడానికి వీలవుతుందని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ రాజర్షి మొయిత్రా తెలిపారు. బ్రిడ్జ్‌స్టోన్ కస్టమర్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనదారులందరికీ దేశవ్యాప్తంగా తమ డీలర్‌షిప్‌లలో ఈ చార్జర్లు 24 గంటలూ అందుబాటులోకి ఉంటాయన్నారు. ఇన్‌స్టాలేషన్, చార్జింగ్, మెయింటెనెన్స్, ఈ–పేమెంట్స్ మొదలైన వాటికి సంబంధించి టాటా పవర్ సహాయ, సహకారాలు అందిస్తుంది.

వృద్ధి అంచనాలను పెంచిన ఐఎంఎఫ్

- 2023–24లో 6.3 శాతం
- తొలి అంచనా 6.1 శాతం
- క్యూ1లో అంచనాలకు మించిన వినియోగం నేపథ్యం



న్యూఢిల్లీ: భారత్ ఏప్రిల్ 2023తో ప్రారంభమయిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో 6.3% స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిని నమోదుచేసుకుంటుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) తాజా 'వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్' అంచనా వేసింది. తొలి జూలై నెల అంచనా 6.1 శాతాన్ని ఈ మేరకు 20 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు 1%) పెంచింది. తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) అంచనాలకు మించి వినియోగ గణాంకాలు నమోదవడం తాజా అప్‌గ్రేడ్‌కు కారణమని అవుట్‌లుక్ వివరించింది. 2024–25లో కూడా భారత్ వృద్ధి అంచనాలను ఐఎంఎఫ్ 6.3%గా పేర్కొంది.

వృద్ధి స్పీడ్‌లో టాప్..

ప్రపంచంలోని రెండవ ఆర్థిక వ్యవస్థ చైనాకన్నా భారత్ వృద్ధి స్పీడ్ వేగంగా ఉండడం మరో అంశం. 2023లో చైనా వృద్ధి రేటు అంచనాలను ఐఎంఎఫ్ 20 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఈ రేటు 5%కి తగ్గింది. 2024లో అంచనాలను 30 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఫలితంగా ఈ రేటు 4.2%కి దిగింది. చైనాలో ప్రోపర్టీ మార్కెట్ సంక్షోభంలో ఉండటం కూడా వృద్ధి రేటు కోతకు కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది.

ప్రపంచ వృద్ధి అంచనా డౌన్

కాగా, 2023 ప్రపంచ వృద్ధి అంచనాలను మాత్రం ఐఎంఎఫ్ తగ్గించడం గమనార్హం. ఇంతక్రితం 3.2 శాతంగా ఉన్న గ్లోబల్ వృద్ధి అంచనాలను తాజాగా 3%కి కుదించింది.

కొన్ని సంస్థల అంచనా ఇలా..

సంస్థ	(వృద్ధి శాతాల్లో) 2023–24
ఆర్‌బీఐ	6.5
ప్రపంచబ్యాంక్	6.3
ఎస్అండ్‌పీ	6.0
ఫిచ్	6.3
మూడీస్	6.1
ఏడీబీ	6.3
ఇండియా రేటింగ్స్	6.2
ఓఈసీడీ	6.3

భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఆప్కాబ్, విజయవాడలో 35 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్(ఆప్కాబ్).. స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 35
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీతో పాటు తెలుగు/ఆంగ్ల భాషలు తెలిసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
» వయసు: 01.10.2023 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.17,900 నుంచి రూ.47,920 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష/ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 21.10.2023
» ఆన్‌లైన్ పరీక్ష తేది: నవంబర్, 2023.
» వెబ్‌సైట్: https://www.apcob.org

కాకినాడ కోఆపరేటివ్ బ్యాంక్‌లో 33 పోస్టులు

కాకినాడలోని ది కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్.. కేటీబీ శాఖల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 33
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్–2,మేనేజర్ లా–1, ఆఫీసర్–09, క్లర్క్ కమ్ క్యాషియర్–16,అటెండర్(సబ్ స్టాఫ్)–5.
» అర్హత: ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్టర్డ్ పోస్టు/కొరియర్ ద్వారా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,కాకినాడ కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్, రామారావుపేట, కాకినాడ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 31.10.2023.
» వెబ్‌సైట్: www.kakinadatownbank.in

వీఎంఎంసీ-సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లో 909 పారామెడికల్ స్టాఫ్ పోస్టులు

న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్, డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, కళావతి సరన్ చిల్డ్రన్స్ హాస్పిటల్, రూరల్ హెల్త్ ట్రెనింగ్ సెంటర్లు సంయుక్తంగా రెగ్యులర్ ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నాయి.

» మొత్తం పోస్టుల సంఖ్య: 909
» పోస్టుల వివరాలు: ఫ్యామిలీ వెల్ఫేర్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేటర్, రేడియోగ్రాఫర్, ఎక్స్–రే అసిస్టెంట్, ఈసీజీ టెక్నీషియన్, మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్, జూనియర్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజిస్ట్, ఫార్మసిస్ట్, ఫిజియోథెరపిస్ట్, ఆపరేషన్ థియేటర్ అటెండెంగ్, నర్సింగ్ అటెండెంట్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్, పన్నెండో తరగతి, డిప్లొమా, సర్టిఫికేట్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:25.10.2023
» ఆన్‌లైన్ ఫీజు చెల్లింపునకు చివరితేది: 26.10.2023
» వెబ్‌సైట్: www.vmmcsjh.nic.in

పీజీసీఐఎల్, న్యూఢిల్లీలో ఇంజనీర్ ట్రైనీ పోస్టులు

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. దేశవ్యాప్తంగా పీజీసీఐఎల్ రీజియన్/కార్యాలయాల్లో గేట్–2024 ద్వారా ఇంజనీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» పీజీసీఐఎల్ రీజియన్: నార్తెర్న్, ఈస్టర్న్, నార్త్–ఈస్టర్న్, సదరన్, వెస్టర్న్, ఒడిశా ప్రాజెక్ట్స్, కార్పొరేట్ సెంటర్.
» పోస్టులు: ఇంజనీర్ ట్రైనీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/సివిల్/కంప్యూటర్ సైన్స్).
» విభాగాలు: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కంప్యూటర్ సైన్స్.
» అర్హత: కనీసం 60శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్శిటీ/సంస్థ నుంచి ఇంజనీరింగ్ విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్(పవర్)/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్/పవర్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్)/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్ /టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ గేట్–2024 స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» పే స్కేల్: నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» ఎంపిక విధానం: గేట్ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్,పర్సనల్ ఇంటర్వ్యూ,సర్టిఫికేట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 16.01.2024
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:18.02.2024
» వెబ్‌సైట్: www.powergrid.in

» సీయూఈటీ-యూజీ-2024 తేదీల ప్రకటన
» 2024, మే 15 నుంచి 31 వరకు పరీక్షలు
» ఆ స్కోర్‌తోనే సెంట్రల్ వర్సిటీల్లో యూజీ ప్రవేశాలు
» అకడమిక్స్‌పై పట్టుతో టెస్టులో రాణించే అవకాశం

సెంట్రల్ వర్సిటీలకు.. సిద్ధమవుతారా!

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారా! ఆ తర్వాత సెంట్రల్ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకుంటున్నారా!! అందుకు చక్కటి మార్గం.. సీయూఈటీ-యూజీ పరీక్ష! ఈ పరీక్షలో ఉత్తీర్ణత ఆధారంగా.. దేశ వ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. తాజాగా.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ).. సీయూఈటీ-యూజీ-2024 తేదీలను ఖరారు చేసింది! ఈ నేపథ్యంలో.. సీయూఈటీ-యూజీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, మెరుగైన స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం..



కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్–అండర్ గ్రాడ్యుయేషన్.. సంక్షిప్తంగా సీయూఈటీ–యూజీ. దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి పరీక్ష. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా.. విద్యార్థులు దేశంలోని అన్ని సెంట్రల్ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకుని ప్రవేశ ప్రక్రియలో పాల్గొనొచ్చు. ఇంతటి కీలకమైన పరీక్షకు సంబంధించి వచ్చే ఏడాదికి గాను ఎన్‌టీఏ తేదీలను ఖరారు చేసింది. మే 15 నుంచి 31 వరకు పలు సబ్జెక్ట్‌లకు సంబంధించి పలు స్లాట్లలో పరీక్షలు జరగనున్నాయి.

లక్షల సంఖ్యలో పోటీ

ఎన్‌టీఏ–సీయూఈటీకి లక్షల మంది హాజరవుతున్నారు. దీనికి ప్రధాన కారణం.. ఇది అన్ని సెంట్రల్ వర్సిటీలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష కావడమే. సీయూఈటీకి గతేడాది మొత్తం 14,99,790 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

సీయూఈటీ స్కోర్‌తోనే

దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీల్లోని యూజీ కోర్సులకు సీయూఈటీ–యూజీ స్కోర్ ఉంటేనే దరఖాస్తుకు అర్హత లభిస్తుంది. సీయూఈటీ–యూజీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు..ఆ స్కోర్ ఆధారంగా సెంట్రల్ యూనివర్సిటీలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత సెంట్రల్ యూనివర్సిటీలు అందుబాటులో ఉన్న సీట్లు, సీయూఈటీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు ఖరారు చేయనున్నాయి.

ప్రాంతీయ భాషల్లో

సీయూఈటీ–యూజీకి సంబంధించి ప్రాంతీయ భాషల్లోనూ పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. మొత్తం పదమూడు భాషల్లో ఈ పరీక్ష నిర్వహిస్తారు. అవి.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాలం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్ష ఉంటుంది.

ఇంటర్‌లో 50 శాతం ఉంటేనే

సీయూఈటీ–యూజీకి హాజరవ్వాలనుకునే విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో కనీసం యాభై శాతం మార్కులు సాధించేలా చూసుకోవాలి. వాస్తవానికి ఎన్‌టీఏ నోటిఫికేషన్‌లో సీయూఈటీ–యూజీకి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలని పేర్కొంటున్నారు. కానీ..సెంట్రల్ యూనివర్సిటీలు మాత్రం మలి దశ ప్రవేశ ప్రక్రియ, దరఖాస్తు సమయంలో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత నిబంధన విధిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు ముందుగానే ఆయా వర్సిటీల ప్రవేశ అర్హతల నిబంధనలపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్

సీయూఈటీ–యూజీ స్కోర్‌తో సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌కు కూడా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్), ఎన్ఐటీ యూనివర్సిటీ,బీఎంఎల్ ముంజాల్ యూనివర్సిటీ తదితర మరో 50కు పైగా డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగానే గతేడాది అడ్మిషన్ కల్పించాయి. ఈ ఏడాది ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అదే విధంగా మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని కొన్ని స్టేట్ యూనివర్సిటీలు కూడా సీయూఈటీ–యూజీ స్కోర్‌తో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. సెంట్రల్ యూనివర్సిటీలు సహా మొత్తం 250 ఇన్‌స్టిట్యూట్స్ ఈ స్కోర్ ఆధారంగానే బ్యాచిలర్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం కల్పించాయి.

సీయూఈటీ–యూజీ.. ఇలా

- సీయూఈటీ–యూజీ పరీక్షను మొత్తం మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. సెక్షన్–1ఎ (లాంగ్వేజెస్)–13 లాంగ్వేజెస్–50 ప్రశ్నలు; సెక్షన్–1బి (లాంగ్వేజెస్)–20 లాంగ్వేజెస్–50 ప్రశ్నలు; సెక్షన్–2 (డొమైన్ సబ్జెక్ట్స్)–27 డొమైన్ సబ్జెక్టులు–45/50 ప్రశ్నలు; సెక్షన్–3 జనరల్ టెస్ట్–జీటీ, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్– 60 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది.
- సెక్షన్–1ఎలో అభ్యర్థులు 13 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్–1బిలో అభ్యర్థులు 20 భాషల్లో ఏదో ఒక భాషను ఎంచుకోవచ్చు.
- సెక్షన్–2 డొమైన్ సబ్జెక్ట్స్ విభాగంలో.. మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్స్ అందుబాటులో ఉంటాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవచ్చు. • సెక్షన్–2లో ఛాయిస్ విధానం ఉంటుంది. 45 లేదా 50 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు 35 లేదా 40 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- మొత్తం మూడు సెక్షన్లలో గరిష్టంగా పది సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం కల్పించారు. సెక్షన్–1ఎ, సెక్షన్–1బి లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి ఎన్‌టీఏ నిర్దేశిత జాబితాలోని లాంగ్వేజ్‌లను ఎంచుకోవాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు 5 మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన మేరకు ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

సెక్షన్-1ఎ భాషలు ఇవే

లాంగ్వేజెస్ కోణంలో సెక్షన్–1ఎలో అస్సామీ, ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మళయాలం, మరాఠి, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషలు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒక భాషను ఎంచుకోవాల్సి ఉంటుంది.

సెక్షన్-1బి లాంగ్వేజెస్

సెక్షన్–1బి లాంగ్వేజెస్‌లో.. అరబిక్, బోడో, చైనీస్, డోగ్రి, ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, జపనీస్, కశ్మీరి, కొంకణి, మైథిలి, మణిపురి, నేపాలి, పర్షియన్, రష్యన్, సింధి, స్పానిష్, టిబెటిన్, సంస్కృతం ఉంటాయి.

27 డొమైన్ సబ్జెక్ట్‌లు

గత ఏడాది మొత్తం 27 డొమైన్ సబ్జెక్ట్‌ల్లో పరీక్ష జరిగింది. ఈ ఏడాది ఆ సంఖ్య పెరిగే అవకాశముంది. గతేడాది డొమైన్ సబ్జెక్ట్‌లు..అకౌంటెన్సీ/బుక్ కీపింగ్; అగ్రికల్చర్; ఆంత్రోపాలజీ; బయాలజీ/బయోలాజికల్ స్టడీస్/బయోటెక్/బయో కెమిస్ట్రీ; బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్; ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్; ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్; ఫైన్ ఆర్ట్స్/విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్; జాగ్రఫీ/జియాలజీ; హిస్టరీ; హోమ్‌సైన్స్; నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇండియా; లీగల్ స్టడీస్; మాస్ మీడియా/మాస్ కమ్యూనికేషన్; మ్యాథమెటిక్స్; పెర్ఫార్మింగ్ ఆర్ట్స్; ఫిజికల్ ఎడ్యుకేషన్/ఎన్‌సీసీ/యోగా; ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్; సైకాలజీ; సంస్కృతం;టీచింగ్ ఆప్టిట్యూట్. అందుబాటులో ఉన్న డొమైన్ సబ్జెక్ట్‌లలో అభ్యర్థులు తమ అర్హతకు సరితూగే సబ్జెక్ట్‌లను ఎంచుకోవచ్చు. డొమైన్ సబ్జెక్ట్స్‌లో గరిష్టంగా ఆరింటిని ఎంచుకునే అవకాశముంది.

మెరుగైన స్కోర్ సాధించాలంటే

- సీయూఈటీ–యూజీలో మంచి స్కోర్ సాధించాలంటే.. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించాలి.
- పదో తరగతి, ఇంటర్మీడియెట్ స్థాయి అకడమిక్ పుస్తకాలను ఔపోసన పట్టాలి.
- డొమైన్ సబ్జెక్ట్‌ల కోసం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి పుస్తకాలను అధ్యయనం చేయాలి.
- లాంగ్వేజ్ సబ్జెక్ట్‌ల కోసం సంబంధిత లాంగ్వేజ్‌ల గ్రామర్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా వాక్య నిర్మాణం, ప్రెసిస్ రైటింగ్, ప్యాసేజ్ రీడింగ్ ప్రాక్టీస్ చేయడమే కాకుండా.. సంబంధిత ప్రశ్నలను సాధన చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, సంబంధిత లాంగ్వేజ్‌లో లిటరరీ ఆప్టిట్యూడ్, వొకాబ్యులరీలలో పట్టు సాధించాలి.
- జనరల్ టెస్ట్: ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ నైపుణ్యాలను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు హిస్టరీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ పుస్తకాలను చదవాలి. కరెంట్ ఈవెంట్స్‌పైనా అవగాహన ఏర్పరచుకోవాలి. క్వాంటిటేటివ్ రీజనింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాల్లో రాణించడానికి అర్థగణిత అంశాలు, కోడింగ్–డీ కోడింగ్, బ్లడ్ రిలేషన్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, నంబర్ సిస్టమ్స్‌పై పట్టు సాధించాలి..

ముఖ్య సమాచారం

- దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో బ్యాచిలర్ కోర్సుల్లో ప్రవేశానికి ప్రామాణికం.. సీయూఈటీ–యూజీ.
- 2024, మే 15 నుంచి 31 వరకు సీయూఈటీ–యూజీ–2024 పరీక్షలు.
- ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులతోపాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. • 2024 జనవరి/ఫిబ్రవరిలో నోటిఫికేషన్ వెలువడే అవకాశం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.